అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapakshams.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

జెలెన్స్కీ, స్టార్మర్ సహా నేడు ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో యూరప్ నేతల సమావేశం **02**

గాంధీజయంతి నాటికి లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు మంత్రి పొంగులేటి వెల్లడి **03**

సంపుటి 08, సంచిక: 258 | సోమవారం | 18-08-2025 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# బిహార్‌లో ఓట్లు చోరీ కానివ్వం





## ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల తొలగింపు, చేర్పుల వంటి కుట్రలకు తెరలేపారు

## ఇండియా కూటమి దీనిని అంగీకరించబోదు

## పేదల ఓటు అధికారాన్ని వారి నుంచి దూరం కానివ్వదు

## 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రారంభోత్సవంలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఉద్ఘాటన

**ససారం :** ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘంపై మరో సారి తీవ్ర ఆరోపణలు చేశారు. దేశంలో అధికారంలో ఉన్న బిజెపితో కుమ్మక్కై ఓట్లను దొంగిలిస్తోందని ఇప్పుడు యావత్ భారతావనికి తెలుసునన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ద్వారా ఓట్ల తొలగింపు, చేర్పులు వంటి కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. ఇండియా కూటమి దీనికి అంగీకరించబోదన్నారు. పేదల ఓటు అధికారాన్ని వారి నుంచి దూరం కానివ్వబోదన్నారు. ఆదివారం రాహుల్‌గాంధీ ఆదివారం బిహార్‌లోని ససారంలో 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించారు. యాత్ర ప్రారంభం కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్షనేత తేజస్వీ యాదవ్, సిపిఐ నేత పి. సందోష్ కుమార్, వికాస్‌షీల్ ఇసాన్ పార్టీ నాయకుడు ముకేష్ సహానీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సిపిఐ(ఎం)కు చెందిన సుభాషిణి అలీలు పాల్గొన్నారు. ఈ యాత్ర రాష్ట్రంలోని 20 జిల్లాల గుండా 1300 కి.మీ. కొనసాతుంది. సెప్టెంబరు 1వ తేదీన పాట్నాలా నిర్వహించే భారీ సభతో ముగుస్తుంది. కాగా, యాత్ర ప్రారంభం అనంతరం రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ రాజ్యాంగాన్ని రక్షించేందుకే తాను ఈ యాత్ర చేపట్టినట్లు ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఇలాగే ఓట్లు చోరీకి గురయ్యాయని ఆందోళన చెందారు. బిహార్‌లో ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల దొంగిలించేందుకు కుట్ర జరుగుతుందని మండిపడ్డారు. దీని ద్వారా దేశ ప్రజలకు ఎన్నికల సంఘం ఎలా ఓట్లను చోరీ చేస్తుందో అర్థమవుతుందని చెప్పారు.అయితే ఓటు చోరీపై తాను ప్రెస్ కాన్ఫరెన్స్

**బిజెపి అధికారంలో ఉన్నంత కాలం రాజ్యాంగానికి ముప్పు : ఖర్గే**

**ప్రజాస్వామ్యం బలోపేతానికి ఎన్‌డిఎను సాగనంపాల్సిందే : లాలూ**

తరువాయి 2లో

# నరేంద్రమోదీని గద్దె దించుదాం



- తిరిగి అధికారంలోకి రానివ్వొద్దు
- ఓటు అధికార్ యాత్రలో సందోశ్ కుమార్ పిలుపు

నాడు బ్రిటిష్ సామ్రాజ్యం అంతమైనట్టే మోదీ పాలన ముగియబోతోందని సిపిఐ ఎంపి పి.సందోశ్ కుమార్ అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి రానివ్వొద్దని పిలుపునిచ్చారు. బిహార్, సాసారామ్‌లో ఓటు అధికార్ ర్యాలీ ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ బిజెపి పాలన అంతం కావాల్సిందేనని అన్నారు. బిహార్‌లో మొదట ఉత్పన్నమైన ప్రశ్న... నేడు యావత్ దేశం ప్రశ్న ఒక్కటే 'ఓట్ల దొంగనం ఎలా జరిగింది' అని సందోశ్ కుమార్ తెలిపారు. కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఇదే ప్రశ్న

తరువాయి 2లో

## ఎన్నికల సంఘం ముందు

# అందరూ సమానమే

- అధికారపక్షం, ప్రతిపక్షమనే తేడా లేదు
- హడావిడిగా 'సర్' చేపట్టలేదు
- నిరాధార ఆరోపణలకు ఇసి బెదరదు
- రాహుల్ గాంధీ అఫిడవిట్ దాఖలు చేయాలి.. లేదంటే క్షమాపణ చెప్పాలి
- సిఇసి జ్ఞానేశ్ కుమార్



**న్యూఢిల్లీ:** కొన్ని రాజకీయపార్టీలు ఎన్నికల సంఘాన్ని ఆసరాగా చేసుకుని అసత్య ప్రచారం చేస్తున్నాయని, ఆరోపణల దాడులు చేస్తున్నాయని భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ విమర్శించారు. నిరాధార ఆరోపణలుచేస్తే ఎన్నికల సంఘంగానీ, ఓటర్లుగానీ భయపడరన్నారు. "కోటిమందికిపైగా ఉద్యోగులు బిహార్ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యారు, ఇంతటి బాహాటపద్ధతిలో సవరణ ప్రక్రియ జరుగుతుంటే ఓటు చోరీ ఎలా జరుగుతుంది?" అని ప్రశ్నించారు. బిహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఇంకా 15 రోజులు గడువు ఉన్నందువల్ల ఎన్నికల సంఘానికి తెలియజేయాలని అన్ని రాజకీయపార్టీలకు విజ్ఞప్తి చేశారు. రాజకీయపార్టీల పట్ల ఎన్నికల సంఘం ఎలాంటి వివక్ష చూపించబోదని, ఎన్నికలసంఘం ముందు అధికార–ప్రతిపక్షాలన్నీ

తరువాయి 2లో

## ఇసి అసమర్థత– వివక్ష బయటపడింది

### కాంగ్రెస్ విమర్శ

కేంద్ర ఎన్నికల సంఘం వైఖరి దాని అసమర్థతను, ఎలాంటి దాపరికాలు లేని బహిరంగ వివక్షను బయటపెట్టాయని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై పత్రికాగోష్ఠిపెట్టి సిఇసి జ్ఞానేశ్ కుమార్ వివరణ ఇచ్చిన తర్వాత ఎక్స్ వేదికగా కాంగ్రెస్‌పార్టీ స్పందిస్తూ, అధికారపార్టీకి, ప్రతిపక్షాలకు తమ వద్ద తేడా ఉండదని, అన్ని రాజకీయపార్టీలు ఎన్నికల సంఘం ఎదుట సమానమేనని సిఇసి చెప్పడం హాస్యాస్పదమైన విషయమని విమర్శించింది. సిఇసి ఈ విధమైన ప్రకటన చేయడం నవ్వుపుట్టించేదిగా

తరువాయి 2లో




సిపిఐ తమిళనాడు రాష్ట్ర మహాసభల్లో ప్రసంగించిన పార్టీ ప్రధాన కార్యదర్శి డి. రాజా

12

## అధిక వడ్డీ ఆశ చూపి

# రూ.20 కోట్లతో పరార్



- హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి
- బాధితులంతా విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులే

ప్రజాపక్షం/హైదరాబాద్

అధిక వడ్డీ ఆశ చూపి పలువురిని నమ్మించి సుమారు రూ.20 కోట్లతో ఓ వ్యక్తి పరారైన ఘటన హైదరాబాద్‌లోని మల్కాజిగిరి పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల్లో ఎక్కువ మంది విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం సైనిక్‌పురి ప్రాంతానికి చెందిన దినేశ్ పాణ్యం స్థానికంగా ఓ కార్యాలయం ఏర్పాటు చేశాడు. తాను షేర్ మార్కెట్లో నిపుణుడినని, పెట్టుబడులు పెట్టి అధిక లాభాలు సంపాదిస్తానని పరిచయస్థులను

తరువాయి 2లో

# పోరాట యోధుడు అయోధ్య

- సంస్మరణ సభలో కొనియాడిన వక్తలు
- నిజమైన కమ్యూనిస్టుని కోల్పోయాం : కూనంనేని



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/మణుగూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేసిన యోధుడు బొల్లోజు అయోధ్య అని, నిజమైన కమ్యూనిస్టును కోల్పోయామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. మణుగూరులోని కిన్నెర కల్యాణ మంటపంలో ఆదివారం అయోధ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా అయోధ్య చిత్రపటానికి కూనంనేనితో పాటు మహబూబాబాద్ ఎంపి

తరువాయి 12లో

## ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్



**న్యూఢిల్లీ :** ఎన్‌డిఎ తరఫున ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఆదివారం ఢిల్లీలో సమావేశమైన బిజెపి పార్లమెంటరీ పార్టీ బోర్డు దీనిపై కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సిపి. రాధాకృష్ణన్ పేరును ఖరారు చేసినట్టు బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ప్రకటించారు. 1957 మే 4న జన్మించిన రాధాకృష్ణన్..

తరువాయి 2లో

# జాతీయ సమ్మెతో స్తంభించిన ఇజ్రాయెల్

- ఒప్పందం చేసి, బందీలను తీసుకురావాలని
- దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు,అరెస్టులు



**జెరూసలెం:** ఇజ్రాయెల్ వ్యాప్తంగా ఆదివారం జాతీయ సమ్మె జరిగింది. బందీలను విడుదల చేసేందుకు వీలుగా హమాస్‌తో ఒక ఒప్పందం చేసుకోవాలని, గాజాలో దురాక్రమణ చర్యలకు స్వస్తి చెప్పాలని, యుద్ధం విరమించాలన్న పలు డిమాండ్లు చేస్తూ ఇజ్రాయెల్‌లో సార్వత్రిక సమ్మె జరిగింది.రోజంతా జరిగిన నిరసన ప్రదర్శనల్లో కార్మిక వర్గం భారీస్థాయిలో పాల్గొంది. దేశవ్యాప్తంగా 400 ప్రాంతాలలో ప్రదర్శనలు జరిగాయి. పోలీసులు అనేకమందిని అరెస్టు చేశారు. బందీల కుటుంబాల వేదిక, బందీల బంధువులు, స్నేహితులు, కార్మికవర్గం వేలాదిగా ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తదుపరి దురాక్రమణ చర్యలవల్ల ఇంకా మిగిలిన 50 మంది బందీలను కూడా ఉగ్రవాదులు చంపేసే ప్రమాదం ఉందని ప్రదర్శకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హమాస్ చెర నుండి ఇటీవల విడుదలైన ఆర్బెల్ యెహౌస్,

తరువాయి 12లో

4వ రాష్ట్ర మహాసభ
భారత కమ్యూనిస్టు పార్టీ (CPI) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ
2025-ఆగస్టు 20 నుండి 22 వరకు, గాజులరామారం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.
ప్రదర్శన: 20.08.2025న ఉదయం 9:00 గంటలకు
జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభం
మహాసభ వేదిక: మహారాజా గార్డెన్స్, గాజులరామారం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.
ప్రారంభ సభ: 20.08.2025 (బుధవారం) ఉదయం 10:00 గంటలకు
ప్రారంభకులు: కామ్రేడ్ డి. రాజా, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి
అతిథులు : కామ్రేడ్ డాక్టర్ కె. నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి
కామ్రేడ్ సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ జాతీయ కార్యదర్శి
కామ్రేడ్ కె. రామకృష్ణ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి
కామ్రేడ్ జాన్ వెస్లీ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి
ఉదయం 10:00 గంటలకు :
అరుణ పతాకావిష్కరణ: కామ్రేడ్ కె. ప్రతాప రెడ్డి
ఉదయం 10:15 గంటలకు:
అమరవీరుల స్థూపావిష్కరణ: కామ్రేడ్ ఏటుకూరి ప్రసాద్
అభినందనలతో...
కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి



# ప్రపంచం
WORLD NEWS

## ఇండోనేసియాలో భూకంపం

**పలు :** ఇండోనేసియాలోని సులవేసి ద్వీపంలో భూకంపం సంభవించింది. దీనివల్ల 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇండోనేసియా సెంట్రల్ సులవేసీ రాష్ట్రం పోసో జిల్లాలో ప్రాంతంలో ఆదివారం ఉదయం భూకంపం వచ్చింది. ఆ తర్వాత మళ్ళీ 15 సార్లు భూ ప్రకంపనలు నమోదయ్యాయి. అధికారులు ఎలాంటి సునామీ హెచ్చరికలూ చేయలేదు. భూకంపంవల్ల నిర్మాణాలకు ఎలాంటి నష్టం వాటిల్లిందో తెలుసుకోవడానికి ప్రకృతి వైపరీత్యాల విభాగం విశ్లేషణలు చేస్తోంది. పశ్చిమ జావాలో 2022లో వచ్చిన భూకంపంలో 604 మంది మరణించారు. అంతకు ముందు 2018లో సులవేసిలో వచ్చిన సునామీ, భూకంపాలకు 4,300 మంది మరణించారు.
2004లో హిందూమహాసముద్రంలో భయంకర భూకంపం, సునామీల వల్ల 2.30 లక్షలమంది మరణించారు.

## జెలెన్‌స్కీ, స్టార్‌మర్ సహా నేడు
# ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో యూరప్ నేతల సమావేశం

**వాషింగ్టన్ :** వైట్‌హౌస్‌లో యూరప్ నాయకులతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోమవారం సమావేశం నిర్వహిస్తారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అలాస్కాలో శిఖరాగ్ర సదస్సు పురోగతి లేకుండా ముగిసిన తర్వాత ట్రంప్ తన వ్యూహం మార్చుకున్నారు. తాత్కాలికంగా కాల్పుల విరమణ ఒప్పందంకోసం వెంపర్లాడకుండా ఉక్రేన్‌లో శాశ్వత శాంతి సాధనకు వీలుగా రెండు దేశాల మధ్యా (ఉక్రేన్–రష్యా) నేరుగా శాంతి ఒప్పందం జరగడమే ఒక ఉత్తమ మార్గమని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమవుతున్నారు. సోమవారం జరిగే ఈ సమావేశంలో జెలెన్‌స్కీతో పాటు అనేకమంది యూరప్ నాయకులు కూడా పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో వాషింగ్టన్‌లో ఒక సందడి వాతావరణం ఏర్పడనున్నది. కాగా గడచిన ఫిబ్రవరినెలలో ఓవల్ ఆఫీసులో ట్రంప్, జె.డి.వాన్స్ సమక్షంలో జెలెన్‌స్కీకి తీవ్ర భంగపాటు కలిగింది. పత్రికాగోష్టి నుండి ఆయన బయటకు వెళ్ళిపోయారు. ఆ తర్వాత ట్రంప్–జెలెన్‌స్కీమధ్య దెబ్బతిన్న సంబంధాల్లో ఏర్పడిన గాయం పూర్తిగా మానలేదు. ఏప్రిల్‌నెలలో ఉక్రేన్‌లో విలువైన ఖనిజాలను అమెరికాకు ఇచ్చేందుకు ఒక ఒప్పందంపై జెలెన్‌స్కీ సంతకం చేశారు. తర్వాత వాటికన్‌సిటీలో వారిద్దరూ ప్రైవేటు సంభాషణలు చేశారు. ఆ తర్వాత ఇద్దరూ ఓవల్ ఆఫీసులో సోమవారంనాడు కలుసుకునేందుకు రంగం సిద్ధమైంది.
ప్రధానంగా యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్, బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ సహా పలువురు యూరప్ దేశాధినేతలు ఈ సమావేశంలో



పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేశారు. జెలెన్‌స్కీని అలాస్కా చర్చల్లో భాగస్వామిగా చేర్చాలని యూరప్ దేశాలు ట్రంప్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చాయి. పుతిన్‌కు ట్రంప్ రెడ్‌కార్పెట్ పరిచి స్వాగతం చెప్పడాన్ని యూరప్ నాయకులు తప్పుపట్టారు. ఒక నియంత పాలకుడికి రెడ్‌కార్పెట్ ఎందుకు పరిచి స్వాగతం పలికారని ట్రంప్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐతే ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు ట్రంప్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ప్రశంసలు కురిపించారు. అలాస్కాలో చర్చల తర్వాత ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ దేశాల నాయకులు ఉక్రేన్ అధినేత జెలెన్‌స్కీతో ఆదివారంనాడు ముమ్మరంగా ఫోన్ సంభాషణలు చేశారు.

**22న రష్యా,ఉక్రేన్, అమెరికా త్రైపాక్షిక సమావేశం?**
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆగస్టు 22వ తేదీనాటికి రష్యా, ఉక్రేన్ నాయకులతో కలిసి యుద్ధ విరమణకోసం ఒక త్రైపాక్షిక సమావేశం నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు అమెరికాకు చెందిన ఆక్సియోస్ వెబ్ పోర్టల్ తన వర్గాలను ఉటంకిస్తూ తెలియజేసింది. టాస్‌వార్తాసంస్థ ఆదివారంనాడు ఈ విషయం ప్రకటించింది. ఆగస్టు 15వ తేదీన అలాస్కాలో పుతిన్‌తో శిఖరాగ్ర సమావేశం తర్వాత యూరప్ నాయకులతో ట్రంప్ విస్తారంగా టెలిఫోన్ సంభాషణలు చేశారు. తన ప్రణాళిక మార్చుకున్నాననీ, సరిగ్గా వచ్చే శుక్రవారంనాటికి (ఆగస్టు 22) అమెరికా,రష్యా,ఉక్రేన్‌లతో ఒక త్రైపాక్షిక సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాననీ యూరప్ నాయకులతో ట్రంప్ చెప్పారు. మరోవైపు న్యూయార్క్ టైమ్స్ పత్రిక కూడా ఒక నివేదిక ప్రచురించింది.
పుతిన్‌తో చర్చల తర్వాత శాంతి ఒప్పందం చేసుకోవడానికి ఉక్రేన్‌తో సంప్రదింపులకు ప్రతిపాదన చేశారనీ, దీని ప్రకారం, ఇప్పటివరకూ ఉక్రేన్‌లో రష్యా దళాలు విముక్తి చేయని ప్రాంతాలతోపాటు డాన్‌బాస్‌లో మిగిలిన ప్రాంతాన్ని రష్యాకు అప్పగించాల్సిందిగా యూరప్ నాయకులకు టెలిఫోన్ సంభాషణల్లో ట్రంప్ ప్రతిపాదించారనీ న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. ఉక్రేన్‌లోని మిగిలిన అన్ని ప్రాంతాలకు పూర్తి భద్రత భరోసా కూడా రష్యా నుండి లభిస్తుంది. అదేవిధంగా యూరప్‌కు కూడా భద్రత లభిస్తుందని నివేదిక పేర్కొంది.

**డాన్‌బాస్‌ను వదులుకునేందుకు జెలెన్‌స్కీ తిరస్కృతి**
రాయిటర్స్ వార్తాసంస్థ ఒక నివేదిక ప్రచురిస్తూ, ట్రంప్ సూచించినవిధంగా యావత్ డాన్‌బాస్ ప్రాంతాన్ని రష్యాకు వదులుకునేందుకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తిరస్కరించారని తెలిపింది. అలాస్కాలో చర్చల తర్వాత జెలెన్‌స్కీతో గంటన్నరసేపు ట్రంప్ ఫోన్ సంభాషణ చేశారు. ఈ సందర్భంగా డాన్‌బాస్‌ను వదులుకోవాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనను జెలెన్‌స్కీ తిరస్కరించారు. డోనెట్స్క్, లుగాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్కుల నుండి తన దళాలను ఉక్రేన్ పూర్తిగా ఉపసంహరించుకోవాలని ట్రంప్ ప్రతిపాదించారు. అందుకు జెలెన్‌స్కీ తిరస్కరించారు. ట్రంప్‌తో ఫోన్ సంభాషణ వివరాలను తర్వాత యూరప్ నాయకులకు జెలెన్‌స్కీ వివరించారు.

**సరైన సమయంలో ట్రంప్‌తో చర్చ : పుతిన్**
అలాస్కాలో తన పర్యటనను, ట్రంప్‌తో జరిపిన మూడు గంటల చర్చను ఎంతో ఉపయుక్తమైనవనీ, సరైన సమయంలో జరిగిన సమావేశమని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. రష్యా పార్లమెంటు డ్యూమాలో సభ్యులు, మంత్రులు, అధ్యక్షుడి సిబ్బంది, ప్రభుత్వ సిబ్బందికి అలాస్కాలో జరిగిన సమావేశ వివరాలను పుతిన్ తెలియజేశారు. న్యాయబద్ధమైన పద్ధతిలో ఉక్రేన్‌లో యుద్ధ సంక్షోభాన్ని పరిష్కరించే విషయంపై ప్రధానంగా తామిద్దరం చర్చించామని పుతిన్ వారికి తెలియజేశారు. అన్ని రకాలుగా సహకారం పెంపొందించే విషయం చర్చించామన్నారు. ద్వైపాక్షిక సహకారం గురించి చర్చించామని, మాస్కోకు రావాల్సిందిగా ట్రంప్‌ను ఆహ్వానించానని పుతిన్ చెప్పారు.



## ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్‌తో చర్చలు రద్దుచేసిన ట్రంప్

**వాషింగ్టన్ :** ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై నిర్ణీత ప్రకారం ఈనెల 25 నుండి న్యూఢిల్లీలో భారత్‌తో జరగాల్సిన చర్చలను అమెరికా ప్రభుత్వం రద్దు చేసింది. ఈ చర్చలు బహుశా మరో తేదీన జరిగే అవకాశం ఉంది. వ్యవసాయ, పాడిపరిశ్రమకు సంబంధించిన భారత్ మార్కెట్లను అమెరికా ప్రయోజనాలకోసం తెరవాలని, రాయితీలు ఇవ్వాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతున్నది. కానీ ఇప్పటివరకూ ఈ రంగాలలో ఎవ్వరికీ భారత్ వాణిజ్య రాయితీలు ఇవ్వలేదు. అందుకు భారత్ తిరస్కరించడం చర్చల రద్దు వెనుక ఒక కారణమైతే, రష్యా నుండి చమురు కొనుగోలు భారత్ ఆపేసి అమెరికా నుండి దిగుమతులు చేసుకోవాలన్నది ట్రంప్ వాంఛ. రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాల వృద్ధి, ద్వైపాక్షిక సమగ్ర వాణిజ్య ఒప్పందం నిమిత్తం ఇప్పటివరకూ ఐదు విడతలుగా చర్చలు జరిగాయి. ఆరోవిడత చర్చలు చేసేందుకు అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ ఉన్నతాధికారుల బృందం భారత్‌కు రావాల్సి ఉంది. భారత్ ఆగస్టు తొమ్మిదోతేదీలోపు నిర్ణీత ప్రకారం వాణిజ్య ఒప్పందం చేసుకోవడంలో విఫలమైందన్న కారణంగా సుంకాలను అమెరికా పెంచింది. అదేవిధంగా రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకు జరిమానాగా మరో 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు కూడా ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిస్థితులమధ్య ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈనెల 25 నుండి 29వ తేదీ వరకూ న్యూఢిల్లీలో భారత్–అమెరికా వాణిజ్య ప్రతినిధులమధ్య ఉన్నతస్థాయీ సమావేశాలు జరగాల్సి ఉండగా వాటిని ట్రంప్ ప్రభుత్వం రద్దుచేసింది.

## పాకిస్థాన్ బ్యూనెర్ జిల్లాలో 209 మంది గల్లంతు

**పెషావర్ :** పాకిస్థాన్‌లో ఆకస్మిక భారీ వర్షాలు, వరదల కారణంగా గడచిన నాలుగు రోజుల్లో 314 మంది మరణించారు. మరో 156 మంది గాయపడ్డారు. ఒక్క బ్యూనెర్ జిల్లాలోనే 209 మంది ప్రజలు ఆకస్మిక వరదల్లో గల్లంతయ్యారు. ఇప్పటికీ వారి జాడ తెలియరాలేదు. వారి జాడ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది బురదలో కూరుకుపోయి సమాధైపోయి ఉంటారని భావిస్తున్నారు. ఇప్పటికే బురదమట్టిలోంచి ఎనిమిది దేహాలను వెలికితీశారు. బునెర్‌లో 40 మంది మృతదేహాలను సామూహికంగా ఖననం చేశారు. వందలమంది గుమిగూడి వారికి అంతిమ నివాళులు అర్పించారు. బ్యునెర్, స్వాత్, షాంగ్లా, మన్సెహ్రా ప్రాంతాలలో ఎక్కువమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. మృతుల్లో ఎక్కువమంది ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలోనే మరణించారు. ఇందులో బ్యూనెర్ జిల్లా వరదలవల్ల తీవ్రంగా నష్టపోయింది.

## లెబనాన్‌లో తారాస్థాయికి హిజ్బొల్లా నిరసనలు
### కడదాకా పోరాటం చేస్తాం : ఉగ్రవాదుల శపథం

**బీరూట్ :** ప్రభుత్వేతర సంస్థలుగా ఉన్న హిజ్బొల్లా ఉగ్రవాద సంస్థలను దశలవారీగా నిర్మూలించాలని ఈనెల ఐదో తేదీన లెబనాన్ మంత్రివర్గం తీర్మానం చేసిన తర్వాత ఆ దేశంలో నిరసన ప్రదర్శనలు తారాస్థాయికి చేరుకున్నాయి. హిజ్బొల్లా ఉగ్రవాద సంస్థల ప్రతినిధులు వీధుల్లోకి వచ్చి తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. కార్లు తగలబెడుతున్నారు. రహదారులను అడ్డగిస్తు



న్నారు. నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. హిజ్బొల్లా లేకపోతే లెబనాన్ దేశమే లేదని ఉగ్రవాదులు వీధుల్లో ప్రదర్శనలు చేస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రభుత్వానికి లెబనాన్ ప్రభుత్వం లొంగిపోయిందని, కీలుబొమ్మగా మారిందని హిజ్బొల్లా కార్యకర్తలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం దగ్గర తప్ప ఇంకెవ్వరి దగ్గరా దేశంలో ఆయుధాలు ఉండకూడదని ఇటీవల లెబనాన్ దేశాధ్యక్షుడు, ప్రధానమంత్రి ఆదేశించడంతో హిజ్బొల్లా ఉగ్రవాద సంస్థలు ఎక్కడికక్కడ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. హిజ్బొల్లా నాయకుడు నయీమ్ క్వాస్సిమ్ ప్రభుత్వానికి ప్రత్యక్ష హెచ్చరిక చేస్తూ, ఇలాంటి షరతులు విధించి బలవంతంగా ఆయుధాలు లాక్కుంటే లెబనాన్‌లో జీవం అనేదే ఉండబోదన్నారు. గడచిన 22 నెలలుగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడులవల్ల ప్రస్తుతం హిజ్బొల్లా బలహీనంగా ఉంది. కానీ వారికి ఇరాన్ ప్రభుత్వం మద్దతు ఉంది.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సి.పి. రాధాకృష్ణన్
(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు బిజెపి తరుపున ఎంపిగా ఎన్నికయ్యారు. తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగానూ పని చేశారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డ్ చైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు బిజెపి సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి జార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. గతంలో తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే అధికారాన్ని ఎన్‌డిఎ పక్షాలు ప్రధాని నరేంద్ర మోదీ, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాకు అప్పగించిన సంగతి తెలిసిందే. నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 చివరి తేదీ.

## గద్దె దించుదాం
(మొదటి పేజీ తరువాయి)

వినిపిస్తోందన్నారు. 'బీజేపీ పాలనలో ఓట్ల చోరీ పెద్ద సవాల్‌గా మారింది. ప్రధాని మోదీ మాతృభాష గుజరాతీ కాదన్నది అబద్ధం. అబద్ధాలతో పబ్బం గడుపుకునే వ్యక్తి దేశాన్ని పాలించేందుకు అనర్హుడు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే మా ఈ పోరాటం. దేశ భవిష్యత్ కోసమే పోరాడుతున్నాం. ఓటు అధికార్ ర్యాలీకి సీపీఐ సంపూర్ణ మద్దతిస్తుంది. ఈ యాత్రతో దేశానికి మంచి జరుగుతుందని ఆకాంక్షిస్తుంది' అని సంతోశ్ కుమార్ వెల్లడించారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో తన ప్రసంగాన్ని ముగించారు.

**కేంద్రానికి మినీ కేబినెట్ ఈసీ**
త్రిస్సూర్: కేంద్రప్రభుత్వానికి మినీ కేబినెట్‌లా ఎన్నికల సంఘం మారిపోయిందని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు సంతోశ్ కుమార్ విమర్శించారు. త్రిస్సూర్ లోక్‌సభ నియోజకవర్గంలో డబుల్ ఐడీలు, నకిలీ ఓటర్ రిజిస్ట్రేషన్లపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఐ త్రిస్సూర్ జిల్లా సమితి అధ్వర్యంలో జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ అసెంబ్లీని సంతోశ్ కుమార్ ప్రారంభించారు.
బీజేపీ నేతలు ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళిని పదేపదే అతిక్రమిస్తున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఓటు దొంగతనం అన్నది బీజేపీ నినాదంగా మారిందన్నారు. మోదీ పాలనలో ఎన్నికల సంఘం దుర్వినియోగానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలని సంతోశ్ కుమార్ పిలుపునిచ్చారు. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ద్వారా దేశ ఎన్నికల వ్యవస్థ నాశనం అవుతుండటానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. రిగ్గింగ్ చేసి బీజేపీ ఎంపీ సురేశ్ గోపీ గెలిచారని, ఇది త్రిస్సూర్ ప్రజలకు అవమానమని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు.

## రూ.20 కోట్లతో పరార్
(మొదటి పేజీ తరువాయి)

నమ్మించాడు. తన వద్ద డబ్బు డిపాజిట్ చేస్తే బ్యాంకు వడ్డీ కంటే ఎక్కువ మొత్తంలో ప్రతినెలా చెల్లిస్తానని ఆశ చూపాడు. అతని మాటలు నమ్మిన పలువురు విశ్రాంత ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వృద్ధులు తమ వద్ద ఉన్న డబ్బును లక్షల్లో అతడికి అప్పగించారు. నమ్మకం కుదిరేందుకు దినేశ్ పాణ్యం కొన్నాళ్లపాటు చెప్పినట్టుగానే ప్రతినెలా వడ్డీ డబ్బును బాధితుల ఖాతాల్లో జమ చేశాడు. దీంతో అతడిపై పూర్తి విశ్వాసం పెంచుకున్న మరికొందరు కూడా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. ఇలా దాదాపు 170 మంది నుంచి రూ. 20 కోట్ల వరకు వసూలు చేశాడు. అయితే, గత కొన్ని నెలలుగా వడ్డీ చెల్లింపులు ఆగిపోవడం, కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో బాధితులు తాము మోసపోయామని గ్రహించారు. దీంతో వారంతా ఏకమై జూన్ 2న కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు అందిన రెండ్రోజులకే నిందితుడు దినేశ్ పాణ్యం భార్య కవిత పాణ్యం విడాకుల కోసం కోర్టును ఆశ్రయించడం గమనార్హం. ఆమెను సంప్రదించగా తన భర్తతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నట్లు బాధితులు తెలిపారు. తాము ఫిర్యాదు చేసి ఇన్ని రోజులైనా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు వాపోతున్నారు. తమకు న్యాయం చేసి, డబ్బును తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

నిర్వహించిన తర్వాత.. అఫిడవిట్ సమర్పించాలని తనను ఎన్నికల సంఘం కోరిందన్నారు. కానీ బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపై మాత్రం ఎన్నికల సంఘం స్పందించ లేదన్నారు. బిహార్‌లో ఓట్లు చోరీని తాము అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. పేదవారికి ఓటు ఒకటే అధికారమని తెలిపారు. వారి ఓటును లాక్కొనే అధికారం ఎవరికి లేదన్నారు. ఇసి ఏం చేస్తుందో, ఈ దొంగతనం ఎలా జరుగుతుందో ఇప్పుడు దేశమంతా తెలుసని ఆయన అన్నారు. కొన్ని రోజుల క్రితం తాను విలేకరుల సమావేశంలో 'ఓటు చోరీ' ఎలా జరుగుతుందో బయపెట్టానని చెప్పారు. భారతదేశం మొత్తంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని గాంధీ ఆరోపించారు. 'ప్రతి ఎన్నికల్లోనూ బిజెపి గెలుస్తుంది. మహారాష్ట్రలో అన్ని సర్వేలు ఇండియా కూటమి గెలుస్తుందని చెప్పాయి. లోక్‌సభలో తమ కూటమి గెలిచింది కానీ, అదే మహారాష్ట్రలో నాలుగు నెలల తర్వాత, ఒక కోటి మంది ఓటర్లు చేరడంతో బిజెపి కూటమి ఎన్నికలలో విజయం సాధించింది. అలాంటి చేరికలు జరిగిన చోట బిజెపి గెలిచింది' అని గాంధీ అన్నారు. ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌లో లక్షకు పైగా ఓట్లు దొంగిలించబడ్డాయని, బిజెపి ఆ లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుందని కాంగ్రెస్ దానిని బయటపెట్టిందని ఆయన అన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఆందోళన చేస్తాయని తెలిపారు. మరి కొన్ని నెలల్లో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని పేర్కొన్నారు. వాటి లక్ష్యంగా ఓటు హక్కు తొలగించేందుకు ఎన్నికల సంఘం తన వంతు ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఒత్తిడితోనే కులగణనకు అగీకరించిన మోదీ
మోడీ ప్రభుత్వం ఒత్తిడితోనే కుల గణనను ప్రకటించిందని రాహుల్ అన్నారు. అయితే కాషాయ పార్టీ సర్కార్ నిజమైన కుల గణనను చేయదని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని

## ఓట్లు చోరీ కానివ్వం
(మొదటి పేజీ తరువాయి)

ఎత్తివేయదని ఆరోపించారు. కుల గణనను చేయాలని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలని తాము పార్లమెంట్‌లో ప్రధాని మోదీకి చెప్పానన్నారు. అయితే బిజెపి, నరేంద్ర మోదీ ఒత్తిడికి లోనై కుల గణనను ప్రకటించారు కానీ.. నిజమైన కుల గణనను నిర్వహించరన్నారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎప్పటికీ తగ్గించరని తనకు తెలుసునన్నారు. కాంగ్రెస్, ఇండియా బ్లాక్ దేశవ్యాప్తంగా కుల గణనను నిర్వహించి, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తాయని రాహుల్ పునరుద్ఘాటించారు.



**బిజెపి అధికారంలో ఉన్నంత కాలం రాజ్యాంగానికి ముప్పు : ఖర్గే**
కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం, రాజ్యాంగం ముప్పులో ఉందని, ప్రజల హక్కులు సురక్షితంగా లేవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం ఆరోపించారు. కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని అన్నారు. బిజెపి ఓటు హక్కును లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నదని, ఎన్నికల సంఘం మోదీ ప్రభుత్వానికి ఏజెంట్ లాగా పనిచేస్తోందని ఆరోపించారు. ప్రధాని ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రశంసించారని, గత 100 సంవత్సరాలుగా అది దేశానికి సేవ చేస్తోందని అన్నారు... కానీ ఈ సంస్థ బ్రిటిష్ వారితో కలిసి పనిచేసిందని మండిపడ్డారు. భారత దేశ స్వేచ్ఛను వ్యతిరేకించే వారికి మద్దతు ఇస్తోందని, కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల హక్కుల కోసం పోరాడింది, ఈ పోరాటాన్ని అలాగే కొనసాగుతుందని ఖర్గే పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిహార్‌లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని భారత కూటమి గద్దె దించుతుందని ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు రోజు పాట్నాలో ఆయన మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో దేశంలో నెలకొన్న పరిస్థితి అత్యవసర పరిస్థితి కంటే దారుణంగా ఉందని ఆరోపించారు. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితికి వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తున్నామని, ఇది అత్యవసర పరిస్థితి కంటే దారుణంగా ఉందన్నారు. రాహుల్ గాంధీ కూడా మాతో ఉండటం మంచిది, అని ప్రసాద్ ససారానికి బయలుదేరే ముందు విలేకరులతో అన్నారు. బిహార్‌లో ఎన్నికల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్‌ఐఆర్)పై ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రజల ఓటు హక్కును లాక్కోవడానికి ఎన్నికల కమిషన్‌ను ఉపయోగిస్తోందని ఆరోపించారు. బిఆర్ అంబేద్కర్ మనకు ఓటు హక్కు కల్పించారు. కానీ బిజెపి ఎన్నికల కమిషన్ ద్వారా ఈ హక్కును లాక్కుంటోందని మండిపడ్డారు. ఎన్నికల సంఘం బిజెపి ఆదేశాల మేరకు పనిచేస్తోందని ఆరోపించారు.

## వివక్ష బయటపడింది
(మొదటి పేజీ తరువాయి)

ఉందని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. సుప్రీంకోర్టు ఈనెల 14వ తేదీన ఇచ్చిన ఆదేశాలను కేంద్ర ఎన్నికల సంఘం తు.చ తప్పకుండా అమలు చేస్తుందా? అని ప్రశ్నించారు. ''ఈరోజున సాసరం నుండి రాహుల్‌గాంధీ 'ఇండియా' జనబంధన్ ఓటర్ అధికారి యాత్ర ప్రారంభించారు, దీంతో సిఇసి, ఆయన వెంట ఉన్న ఇద్దరు ఎన్నికల అధికారులూ, ఏ రాజకీయపార్టీపట్ల తమకు వివక్ష లేదని, అధికార–ప్రతిపక్షాలన్నీ తమ ముందు సమానమేనని చెప్పడం ప్రారంభించారు. పర్వతాలంత ఎత్తున సాక్ష్యాలు ఎదురుగా కనిపిస్తుంటే సిఇసి మాత్రం సౌమ్యంగా ఇలాంటి ప్రకటన చేయడం నవ్వు పుట్టించే విషయం, రాహుల్‌గాంధీ అర్థవంతంగా అడిగిన ఏ ప్రశ్నకూ ఆయన సూటిగా సమాధానం చెప్పలేదు'' అని జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు.

సమానమేనని అన్నారు.
ఓటర్ల జాబితాలో ఉండే తప్పులు,పొరపాట్లన్నింటినీ తొలగించే ఉద్దేశంతో ప్రతిసారీ వాటిని సవరిస్తామని, కానీ కొన్ని పార్టీలు మాత్రం ఈ సవరణల గురించి అసత్య ప్రచారం చేయడం, ఎన్నికల సంఘాన్ని ఊతంగా చేసుకుని దాడులు చేయడం అత్యంత విచారకరమైన విషయమని అన్నారు. త్వరలో ఎన్నికలు జరిగే బీహార్ రాష్ట్రంలో 'ఓట్‌చోరీ' కి వ్యతిరేకంగా 'ఇండియా కూటమి' పార్టీలు ''ఓటర్ అధికార్ యాత్ర'' ప్రారంభించిన పూర్వరంగంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆదివారం పత్రికాగోష్ఠిలో పైవిధంగా స్పందించారు.
డబుల్ ఓటింగ్, ఓటు చోరీ ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమైనవని కేంద్ర ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను విజయవంతం చేసేందుకు అధికారులు,సంబంధిత విభాగాలన్నీ ఎంతో కష్టపడి పనిచేస్తున్నాయని జ్ఞానేశ్ కుమార్ ఉద్ఘాటించారు. ఎన్నికలు దగ్గరపడిన తరుణంలో ఆదరాబాదరాగా బీహార్‌లో ఓటర్ల జాబితాల సమీక్షకు ఉపక్రమించడంపై ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలపై సమాధానం చెబుతూ, హడావుడిగా ప్రత్యేక ముమ్మర సమీక్ష (సర్) బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిందనడాన్ని ఒక కట్టుకథగా పేర్కొన్నారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ, దానికి ముందుగా ఓటర్ల జాబితాలను సరిదిద్దడం ఎన్నికల సంఘానికి ఉన్న చట్టబద్ధమైన విధి నిర్వహణ అని చెప్పారు.
''బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణపై కొన్ని పార్టీలు, వారి నాయకులు అసత్య ప్రచారం వ్యాప్తి చేస్తూ ఉండటం చాలా తీవ్ర ఆందోళన కలిగించే విషయం, కొన్ని రాజకీయపార్టీలు ఎన్నికల సంఘం భుజాలను ఊతంగా చేసుకుని, ఎన్నికల సంఘం భుజాలమీదుగా కాల్పులు (విమర్శలు) చేస్తున్నాయి, ఇది

## అందరూ సమానమే
(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఆందోళన కలిగించే విషయం, ఇంకా 15 రోజులు గడువు మిగిలి ఉంది, అందువల్ల బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలేమైనా ఉంటే మాకు తెలియజేయాలని అన్ని రాజకీయాపార్టీలను కోరుతున్నాం, ఎన్నికల సంఘం తలుపులు ప్రతిఒక్కరికీ బార్లా తెరచి ఉంటాయి, బూత్ స్థాయి అధికారులు, ఏజంట్లు ఎలాంటి దాపరికాలు లేని పద్ధతులలో ఓటర్ల జాబితాలు సిద్ధం చేయడానికి ఉమ్మడి కృషి చేస్తున్నారు'' అని జ్ఞానేశ్ కుమార్ చెప్పారు. ఎన్నికల ఫిర్యాదులను 45 రోజుల లోపు దాఖలు చేయకపోతే అది రాజ్యాంగానికి అవమానం కాగలదని, కానీ ఓట్ చోరీ ఆరోపణలను మాత్రం కొనసాగిస్తున్నారని విమర్శించారు. డబుల్ ఓటింగ్, ఓట్ చోరీ ఆరోపణలు నిరాధారమైనవనీ, ఇలాంటి ఆరోపణలకు ఎన్నికల సంఘంగానీ, ఓటర్లుగానీ భయపడబోరని ఉద్ఘాటించారు. కొన్ని పార్టీలు ఆడుతున్న రాజకీయ క్రీడలను పట్టించుకోకుండా ఎన్నికల సంఘం అన్ని వర్గాలకు చెందిన ఓటర్లు ఎలాంటి ఆందోళనా చెందని పద్ధతిలో తన విధులు నిర్వహిస్తుందన్నారు. దేశంలోపల అనేకమంది ఓటర్లు ఒకచోట నుండి మరోచోటకు తరలివెళుతున్నారన్న ఆరోపణలు, రాజకీయపార్టీలు చేస్తున్న ఫిర్యాదుల కారణంగా బీహార్‌లో ఎన్నికల సంఘం ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియ చేపట్టిందని చెప్పారు. దేశంలోపల జరిగే వలసలు, ఇతర సమస్యల కారణంగా తెలిసో తెలియకో ఒకరికి అనేకమైన ఓటర్లు కార్డులు ఉంటాయని, దీనిని ప్రక్షాళన చేయడానికే తాము పూనుకున్నామని చెప్పారు.
బిజెపితో కుమ్మక్కైన కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనానికి పాల్పడిందని ఇప్పుడు యావత్ దేశానికీ తెలిసిందని, 'సర్' ప్రక్రియ ద్వారా ఓటర్లను తొలగించి అదనపు ఓటర్లను చేర్చడం ద్వారా బీహార్ అసెంబ్లీ ఎన్నికలను దొంగిలించే కుట్ర విజయవంతం కాకుండా 'ఇండియా కూటమి' అడ్డుపడుతుందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఆదివారం విమర్శించడంతో సిఇసి పత్రికాగోష్ఠిలో ఈ వివరణ ఇచ్చారు.

**బీహార్‌లో తొలగించిన 65 లక్షలమంది ఓటర్ల పేర్లు జిల్లాలవారీగా ప్రచురించాం**
ప్రత్యేక ముమ్మర సవరణ తర్వాత బీహార్‌లో ఓటర్ల జాబితాల నుండి తొలగించిన 65 లక్షలమంది ఓటర్ల పేర్లను జిల్లాల వారీగా ఆయా జిల్లాల మెజిస్ట్రేట్‌ల వెబ్‌సైటులలో ప్రచురించామని సిఇసి జ్ఞానేశ్ కుమార్ పాత్రికేయులకు చెప్పారు. తొలగించిన ఓటర్ల పేర్లను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలవారీగా మెజిస్ట్రేట్ల వెబ్‌సైటులలో ఉంచామని చెప్పారు. జాబితాల నుండి తొలగించిన ఓటర్లపేర్లు అన్నింటినీ సుప్రీంకోర్టు తమకు ఆదేశాలు జారీ చేసిన 56 గంటల్లోపే వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశామన్నారు.
బీహార్‌లో 'సర్' ప్రక్రియను సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో అనేక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఈ విచారణ సందర్భంగా ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల ప్రకారం, ఎన్నికలసంఘం అనర్హులుగా భావించి తొలగించిన ఓటర్ల పేర్లను వెబ్‌సైట్లలో ఉంచిందని సిఇసి చెప్పారు. అదేవిధంగా ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రచురించిన తర్వాత వాటి డిజిటల్ ప్రతులను, లిఖితపూర్వంగా కాగితాలపై ఉన్న ప్రతులను కూడా అన్ని రాజకీయపార్టీలకు అందజేశామని,వీటిని ఎన్నికల సంఘం వెబ్‌సైటులో కూడా ఉంచామని చెప్పారు. ఈ ముసాయిదా ఓటర్ల జాబితాలను బీహార్‌లో ఆగస్టు ఒకటో తేదీన ప్రచురించామని, సెప్టెంబరు ఒకటో తేదీ వరకూ ఈ జాబితాలు అందుబాటులో ఉంటాయని, ఏ రాజకీయపార్టీకైనా, వ్యక్తులకైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. సర్ ప్రక్రియ ఎంతో బాహాటత్వంగా, దాపరికం లేకుండా నిర్వహించామని చెప్పారు.

**ఏడురోజుల్లో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి:సిఇసి**
బీహార్ ఓటర్ల జాబితాలలో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై ఏడు రోజులలోపు ఒక డిక్లరేషన్‌పై సంతకం చేసి తమకు ఇవ్వాలని లేకపోతే ఈ ఆరోపణలను నిరాధారమైనవిగా, చెల్లుబాటుకానివిగా తోసిపుచ్చుతామని సిఇసి జ్ఞానేశ్ కుమార్ చెప్పారు. ఏ నియోజకవర్గంలోనైనా ఓటు చోరీ జరిగిందని ఫిర్యాదు చేయదలచినవారు ఎవరైనా ఒక సాక్షిగా సంతకంచేసి ఫిర్యాదు చేయాలన్నారు. గతనెల 31న రాహుల్‌గాంధీ ఓట్‌చోరీ ఆరోపణలు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఓట్లు చోరీకి గురయ్యాయని ఆరోపించారు. ఐదు రకాలుగా ఈ మోసాలు జరిగాయని ఆయన చెప్పారు. ఇతర రాష్ట్రాలలో కూడా ఇలాంటి అక్రమాలే జరిగాయని ఆయన అన్నారు. దీంతో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రధాన ఎన్నికల అధికారులు రాహుల్‌గాంధీకి ఒక విజ్ఞప్తి చేస్తూ, అక్రమాలు జరిగాయని లిఖితపూర్వకంగా సంతకం చేసి డిక్లరేషన్ ఇవ్వాలని కోరారు. ఏడు రోజుల్లోపు సంతకంతో ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకపోతే ఈ ఆరోపణలను నిరాధారమైనవిగా కొట్టిపారేస్తామని సిఇసి చెప్పారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## '253 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్'పై ప్రభుత్వ నిర్లక్ష్యం : కొప్పుల ఈశ్వర్




ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని 253 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పట్ల రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బిఆర్ఎస్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో అవైలబుల్ స్కూల్స్‌లో 17,000 సీట్లు పెంచారని, కానీ ప్రస్తుతం 26వేల మంది విద్యార్థులకు రెండు సంవత్సరాలుగా బిల్లులను చెల్లించకపోవడంతో వారిని బయటకు పంపిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, వారికి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పడిపోతున్నాయని, 238 గురుకుల పాఠశాలలు ఉంటే వాటిలో ఆశించిన స్థాయిలో అడ్మిషన్స్ రాకపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని ఆరోపించారు. గురుకులాల్లో ఇటీవల ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు చనిపోవడం, తరచూ ఆసుపత్రులలో చేరడమే ఇందుకు కారణమని కొప్పుల ఈశ్వర్ తెలిపారు.

### బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై

# 23న కాంగ్రెస్ పిఎసి సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అంశంలో ఈ నెల 23న కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సమావేశం కానుంది. ఈ సమావేశంలో బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో రాజకీయ పార్టీగా, ప్రభుత్వపరంగా ఎటువంటి నిర్ణయం తీసుకోవాలనే విషయమై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించే అవకాశాలు ఉన్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నా యి. ఇప్పటికే బిసి రిజర్వేషన్ల సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. అలాగే రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఢిల్లీలోనే ఉండి ఎదురుచూసినప్పటికీ ఫలితం లేకుం డా పోయింది. మరో వైపు స్థానిక సంస్థలకు సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్ట్ తీర్పునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉండబోతుందనేది రాజకీయ వర్గాలలో సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. అయితే రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలనే నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నప్పటికీ, బిసి బిల్లులపైన రాష్ట్రపతి ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కనీసం 'తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ 2018 చట్ట సవరణ' ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదిస్తే, బిసి రిజర్వేషన్లను పెంచేందుకు అవకాశం ఉండేదని, ఈ చట్ట సవరణ ద్వారానైనా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుకునే వెసులుబాటు ఉండేదని, కానీ ఈ అవకాశం కూడా లేకుండా పోయిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. పంచాయతీ రాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌ను రాష్ట్రపతి వద్దకు గవర్నర్ పంపించినట్టు ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. ఈ ఆర్డినెన్స్ అమలుకు నోచుకుంటే 50 శాతం రిజర్వేషన్లు మించరాదనే ఆంక్షలు తొలగిపోయే



అవకాశం ఉండేదని, తద్వారా రిజర్వేషన్లను పెంచుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు మార్గం సుగమమయ్యేదని అధికార వర్గాలు, అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. రిజర్వేషన్ల విషయం లో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని, మరోవైపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలనే కోర్ట్ ఆదేశాలు ఉన్నాయని, దీంతో కోర్ట్ విధించిన గడువు కూడా దగ్గరపడుతోందని, ఇటువంటి పరిస్థితుల్లో ఎటువంటి నిర్ణయం తీసుకోవాలనే విషయమై అధికార పార్టీ , రాష్ట్ర ప్రభుత్వం తర్జన భర్జన పడుతోంది.

రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలు ఈ రెండు అంశాలు పిఎసి సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి, అందరిఅభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఒక నిర్ణయానికి వచ్చే అవకాశాలు లేకపోలేదు. రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే ఎన్నికలను నిర్వహించాలంటే, రిజర్వేషన్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున ఎన్నికలు నిర్వహించేందుకు మరికొంత సమయం కావాలని హైకోర్ట్ తీర్పుపైన అప్పీల్‌కు వెళ్లాల్సి ఉంటుందని,లేదా రాజకీయ పార్టీ పరంగా 42 శాతం బిసిలకు టికెట్లను ఖరారు చేసి, బిసి బిల్లు సాధనకు మరో పోరాట కార్యాచరణను రూపొందించుకోవాల్సి ఉంటుందని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

**'లోకల్ ' నిధులకు కేంద్రం బ్రేక్..**
**ఇప్పటి వరకు రూ. 2200కోట్ల నష్టం...**

స్థానిక సంస్థలకు పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు అందడం లేదు. గతఆర్థిక ఏడాది కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు సుమారు రూ. 1500 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.700 కోట్ల నిధులు మొత్తంగా కేంద్రం నుంచి రావాల్సిన రూ.2200ల కోట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. సకాలంలో ఎన్నికలు నిర్వహించకుంటే మరిన్ని నిధులు కూడా వచ్చే అవకాశాలు లేవని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుంటే మరింత నష్టమని, ఎలాగైనా ఎన్నికలకు నిర్వహించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇది వరకే అధికార వర్గాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఒక వైపు ఆర్థిపరమైన నష్టం, మరో వైపు రాజకీయ నిర్ణయం, ఇంకోవైపు బిసిలకు ఇచ్చిన మాట ఇలాంటి పరిస్థితుల్లో పిఎసి సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు ముఖ్యులు చర్చించి ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయంశంగా మారింది.

**సిఎం రేవంత్‌తో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ భేటీ**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ సిఎం నివాసంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈనెల 23న పిఎసి సమావేశాన్ని నిర్వహించాలని వారు నిర్ణయించారు. ఈ సందర్భంగా పిఎసి సమావేశంలో చర్చించాల్సిన అంశాలు, తీసుకునే నిర్ణయాలు, న్యాయపరమైనచిక్కులు తదితర అంశాలు కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం.



## సిపిఐ రాష్ట్ర 4వ మహాసభకు

# ముమ్మర ఏర్పాట్లు

### పనులను పరిశీలించిన పార్టీ జాతీయ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/నిజాంపేట్ : మరో రెండు రోజుల్లో మేడ్చల్ జిల్లాలో జరుగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభల ఏర్పాట్లను సిపిఐ జాతీయ నాయకులు చాడా వెంకటరెడ్డి ఆదివారం పరిశీలించారు. జిల్లాలోని గాజులరామారంలో మహారాజా గార్డెన్స్‌లో మహాసభల నేపథ్యంలో ఏర్పాటు చేయనున్న తెలంగాణా సాయుధ పోరాటవీరుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భావం నుండి నేటి వరకు సిపిఐ చేసిన త్యాగాలు వెలకట్ట లేనివని, గత చరిత్ర వివరాలన్నీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని అడ్డుకోవాలంటే ఇలాంటివి అవసరం ఉందని, వీటిద్వారా ప్రజలు నిజానిజాలు తెల్సుకోగలుగుతారన్నారు. పార్టీ రాష్ట్ర మహాసభల్లో మరింత బలోపేతం చేసుకొనే లక్ష్యంగా ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించనున్నామన్నారు. మహాసభలను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షులు యూసఫ్, ప్రధాన కార్యదర్శి ఉమామహేష్, గౌరవ అధ్యక్షులు ఏసురత్నం, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్, మండల కార్యదర్శి స్వామి. ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ నేతలు శ్రీకాంత్, వెంకటేష్, ప్రవీణ్, దుర్గయ్య, సహదేవ్‌రెడ్డి, బాబు, వెంకటేష్, రాజు, జంబు తదితరులు పాల్గొన్నారు.

## విషాదం నింపిన సరదా

**గంగారం :** సరదాకోసం జలపాతాన్ని చూద్దామని వెళ్లిన మిత్రుని మృతితో ఒక్కసారిగా విషాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని మిరియాలపెంట దగ్గర దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ ఏడుబావుల జలపాతం మరోసారి ఒక ప్రాణాన్ని బలి తీసుకుంది. శనివారం స్నేహితులతో ఏడు బావుల జలపాతానికి వచ్చి గల్లంతైన తోటి స్నేహితుడు ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలం జన్నారం గ్రామానికి చెందిన పామర్తి ప్రేమ్‌కుమార్ (25) యువకులతో ఈ జలపాతం సందర్శనకు వచ్చారు. అయితే వారిలో ప్రేమ్‌కుమార్ జలపాతంలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న వెంటనే గంగారం ఎస్సై రవికుమార్ స్థానిక పోలీసులతో కలిసి గాలింపు చర్యలు ప్రారంభించారు.

# ఒయు హాస్టళ్ల శంకుస్థాపనకు రండి

### సిఎం రేవంత్ రెడ్డికి ఒయు వైస్‌ఛాన్స్‌లర్ ఆహ్వానం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 21న హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన, డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూమ్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఒయు వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు వారు హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో సిఎం రేవంత్ రెడ్డిని ఆదివారం కలిసి ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. వారివెంట హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. ఒయులో రూ. 80కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి అయిన 1200మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు హాస్టల్స్‌ను ప్రారంభించి, గిరిజన సంక్షేమం శాఖ ఆర్థిక సహాయంతో మరో 300మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టల్స్ నిర్మాణానికి సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే ఒయులో ఉన్న 25 హాస్టళ్లలో 7223 మంది విద్యార్థులకు వసతి ఉండగా, కొత్తగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి. అలాగే దాదాపు రూ. 10కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూము పనులకు కూడా సిఎం ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాల అనంతరం ఒయులోని ఠాగూర్ ఆడిటోరియంలో వెయ్యిమంది ప్రొఫెసర్లను, విద్యార్థులను



ఉద్దేశించి 'తెలంగాణ విద్యారంగంలో రావాల్సిన మార్పులు ప్రభుత్వ ప్రణాళిక' అనే అంశంపైన సిఎం ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొననున్నారు. 20ఏళ్ల కాలంలో ఒయులోకి ముఖ్యమంత్రి హోదాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో సిఎం రీసెర్చ్ ఫెలోషిప్‌తో పాటు విదేశీ పర్యటనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని సిఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నామని విసి తెలిపారు.

# ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు

ప్రజాపక్షం/హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్న ఊహాజనిత 'ఫ్యూచర్ సిటీ'కి భవిష్యత్తు లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. కేవలం తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసమే హైదరాబాద్ ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న సిఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరబోదన్నారు.

సిఎం రేవంత్ రెడ్డి ఒక విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాల తో ప్రజాధనం వృధా అవుతోందని కెటిఆర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులు మోసపోయా రని ఆవేదన వ్యక్తం చేశారు.కెసిఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దుచేసి, ఆ స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనాల కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కెటిఆర్ పేర్కొన్నారు. ఫార్మా సిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయ ల ప్రజాధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభిస్తే, దీనిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కన పెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్ కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.




# ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి శ్రేయస్కరం

### ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ఎంతో ప్రయోజనం
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/గజ్వేల్ : వ్యవసాయరంగంలో దేశం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టగా, వ్యవసాయ ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయపల్లిలో క్రిస్టల్ విత్తనోత్పత్తి సంస్థను పరిశీలించి వివిధ విభాగాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాగా, క్రిమిసంహారక మందుల వినియోగాన్ని తగ్గించి కంపోస్టు ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఆధునిక వ్యవసాయ విధానం తో విత్తన ఎంపిక నుండి పంటకోత వరకు ప్రయోజనం, అలాగే నీరు, ఎరువుల వినియోగం సరైన మోతాదులో ఉంటుందని అన్నారు. ముఖ్యంగా క్రిమిసంహారక మందులు, అధిక ఎరువుల వినియోగంతో సాగునేల ఆరోగ్యం దెబ్బతింటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని సహజ పద్ధతుల్లో పండించే సాగులో కంపోస్ట్ ఎరువులు వినియోగించి పర్యావరణానికి హాని కలగకుండా ఆరోగ్యకర పంట ఉత్పత్తులు చేసుకోవచ్చని చెప్పారు.

అంతేకాకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించే నూతన వంగడాలను ప్రోత్సహించి వాతావరణ మార్పులు, తెగుళ్ళ నుండి పంటలు కాపాడుకోవాలని కోరారు. కేంద్ర వ్యవసాయ, డైరీ రంగాన్ని ప్రోత్సహిస్తూ అవసరమైన నిధులు కేటాయించడంతోపాటు ఎంఎస్పి పెంచుతూ పంటల బీమా పథకం వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఎదుర్కొనే క్రమంలో నీరు వృధా చేయకుండా భూమిలో చేర్చేందుకు దృష్టి పెట్టాలని, తద్వారా ప్రతి ఒక్కరికి ఎంతో ప్రయోజ నం ఉంటుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పై ఎంత ఒత్తడి వస్తున్నప్పటికీ ఇతర దేశాల పంట ఉత్పత్తుల దిగుబడుల జోలికి వెళ్లకుండా, దేశీయ వ్యవసాయం, రైతులను ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రపంచ దేశాలకు దీటుగా భారత్‌ను గొప్ప ఆర్థిక శక్తిగా తీర్చి దిద్దుతూ అమెరికా వంటి దేశాలకు దీటైన చెబుతున్నట్లు వివరించారు.

### గాంధీజయంతి నాటికి

# అందుబాటులోకి లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించి మొదటి విడత సర్వేయర్ల శిక్షణ పూర్తయిందని, రెండవ విడత శిక్షణ 23 జిల్లా కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభించనున్నామని తెలిపారు. అభ్యర్థులు ఆయా జిల్లాల్లో 18వ తేదీ ఉదయం 10 గంటల లోపు సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. గత పదేళ్ళ కాలంలో సర్వే విభాగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. 'లైసెన్స్ డ్ సర్వేయర్ల' నియామకం అంశంలో అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం



సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను అందుబాటులోనికి తీసుకొస్తున్నామన్నా రు. మే 26 నుంచి జూలై 26 వరకు 50 పని దినాల్లో ఆయా జిల్లా కేంద్రాల్లో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చామని, గత నెల 28, 29 తేదీల్లో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్షను నిర్వహించి ఫలితాలు ప్రకటించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణను కూడా ప్రారంభించామన్నారు. ఈ శిక్షణ పూర్తయిన వెంటనే వారికి లైసెన్స్ జారీ చేస్తామని, వారి సేవలను పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా సర్వే మాన్యువల్ ను రూపొందించాలని అధికారులకు మంత్రి సూచించారు. రెవెన్యూ, సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధం ఉందన్నారు. సర్వే విభాగం బలోపేతంతోనే రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించగలుగుతామని, దీనిని దృష్టిలో పెట్టుకుని సర్వే విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

## ఉద్యమంగా 'బహుజన బతుకమ్మ'

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రకృతి విధ్వం సం అంటే ప్రజలపై యుద్ధమేనని, శాంతి స్వావలంబనను చాటుతూ 'బహుజన బతుకమ్మ'ను ఊరూరా, వాడవాడలా ఘనంగా నిర్వహించుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి కమ్యూనిటీ హాల్‌లో 'బహుజన బతుకమ్మ' సమాలోచన సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశాని కి అరుణోదయ విమలక్క, ప్రొఫెసర్ లక్ష్మీ, కట్టా భగవంత రెడ్డి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ ను ఒక ఉత్సవంగా కాకుండా ఉద్యమంగా కొనసాగించాలని సూచించారు. అభివృద్ధి పేరుతో అడవులను ధ్వంసం చేయడం, ఆదివాసుల హక్కులను కాలరాయడం సరైంది కాదనే విషయం ఊరూరా, వాడవాడలా 'బహుజన బతుకమ్మ బ్యానర్లు' వెలిసేలా చూడాలని తెలిపారు.



### సామాజిక న్యాయంకోసం

# నిబద్ధతతో కాంగ్రెస్

### బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలు గడిచినా ఇంకా సామాజిక న్యాయంపై చర్చ జరగడం బాధాకరమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సమాఖ్య ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జరిగిన జాతీయ సమావేశంలో టిపిసిసి అధ్యక్షు డు




బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎఐసిసి ఎస్‌సి సెల్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'జిత్నే ఆబాది ఉత్నే ఇస్సేదారి' నినాదం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన 'జిత్నే ఆబాది, ఉత్నే ఇస్సేదారి' (ఎంత జనాభా ఉంటే, అంత వాటా) నినాదం ద్వారా బలహీన వర్గాల ప్రజలకు న్యాయం అందించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు.

రాజ్యాంగం ప్రమాదంలో ఉన్న ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఓటు హక్కు ను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై అందరూ చర్చించాలని కోరారు. పోటీ ప్రపంచంలో వెనుకబడిన వర్గాలు ముందుండాలని, అందుకు తగ్గట్టుగాముందుకు సాగాలని ఆయన సూచించారు. తెలంగాణ ప్రభు త్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. తమ హక్కుల కోసం అడగడం తప్పు కాదని, వాటిని సాధించుకోకపోవడమే అసలైన తప్పు అని పొన్నం ప్రభాకర్ అన్నారు. సామాజిక బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా తమ హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపు నిచ్చారు.

# 'కాళేశ్వరం'పై కాంగ్రెస్ సర్కార్ కుట్ర

### మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట:కట్టిన ఇళ్లు.. పెట్టిన పొయ్యి మాదిరిగా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వరదనీటిని ఎత్తిపోసి రైతాంగానికి సాగు నీటి కొరత లేకుండ చూడాల్సింది పోయి బురద రాజకీయాల కోసం, కృష్ణ గోదావరి నదుల వరద నీటిని సముద్రంలోకి వదులుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసి రైతాంగానికి సాగునీరు అందిస్తే మాజీ సిఎం కెసిఆర్‌కు పేరు వస్తుందని అక్కసుతో ప్రాజెక్టులను పడావు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం కూలిపోయిందని చెప్పిన కాంగ్రెస్ నాయకులు చెప్పిన అబద్ధాన్ని నిజం చేసేందుకు నేడు మోటర్లు ఆన్‌చేయటం లేదన్నారు.

ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టులోకి ప్రతిరోజు 15 టిఎంసీల వరదనీరు వస్తుందన్నార. వరద కాల్వద్వారా మిడ్‌మానేరు, ఎల్ఎంబిసలకు నీరు విడుదల చేయకుండ నీళ్ల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిద్ర పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం మోటర్లు ప్రభుత్వం ఆన్‌చేయకుంటే లక్షలాదిగా తరలివచ్చి మోటర్లను ఆన్‌చేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయాల కోసం రైతులపై పగ, ప్రతికారం తీర్చుకుంటుందని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేయాలి తప్పా.. కీడు చేయవద్దని హితవు పలికారు. 30 టిఎంసీల మిడ్‌మానేరులో ఉన్నది 10 టిఎంసీలే, ఎల్‌ఎండిలో 24టిఎంసీల్లో 7 టిఎంసీలే మాత్రమే ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 3.5 టిఎంసీలకు 1 టిఎంసి, రంగనాయక్ సాగర్ రిజర్వాయర్‌లో 3 టిఎంసీలకు 1 టిఎంసి, మల్లన్న సాగర్‌లో 50 టిఎంసిలకు 10 టిఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 15 టిఎంసీలకు 4 టిఎంసీలు , బస్వాపూర్ రిజర్వాయర్‌లో 4 టిఎంసీలకు 0.5 టిఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. తక్షణమే ఎస్ఆర్ఎస్‌పి వరద కాలువ గేట్లు ఎత్తివేసి మిడ్ మానేరు నింపాలని తదనంతరం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్‌లో నీటిని ఎత్తిపోయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## దివ్యాంగులైన కేడెట్ల సమస్యపై నేడు సుప్రీం సుమోటో విచారణ

**న్యూఢిల్లీ:** జాతీయ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ మిలిటరీ అకాడమీలలో శిక్షణ పొందుతూ మధ్యలో గాయపడి దివ్యాంగులైన సైనిక అధికారులు ఎదుర్కొంటున్న బాధలపై పత్రికలో వచ్చిన వార్త ఆధారంగా సుప్రీంకోర్టు తనకుతానుగా కేసు విచారణకు తీసుకుంది. 1985 నుండి ఇప్పటివరకూ ఈ విధంగా 500 మంది అధికారులు వివిధ కారణాలవల్ల శిక్షణలో గాయపడి దివ్యాంగులుగా మారారు. వారికి ఎక్స్‌–సర్వీస్‌మెన్ హోదా లేకపోవడంతో సైనికరంగానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రులలో ఉచిత చికిత్సలకు కూడా అర్హులు కాలేకపోతున్నారు. నెలవారీగా వారికి ఇచ్చే వేతనం రూ.40వేలు వారి వైద్యఖర్చులకు, ఇంటి ఖర్చులకు చాలడంలేదు, వారికి ఎక్స్ సర్వీస్‌మెన్ హోదా ఇస్తే సైనిక ఆసుపత్రులలో ఉచితంగా చికిత్సలు చేయించుకునే అవకాశం ఉంటుంది. ఈ సమస్యలను పత్రిక ద్వారా తెలుసుకున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ కేసును తనంతట తానుగా విచారణకు తీసుకుంది. జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారంనాడు ఈ కేసు విచారణ చేస్తుంది.



## రూ.120 కోట్లతో చేప పిల్లల పంపిణీ

### తెలంగాణ గంగ తెప్పోత్సవంలో మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లో చేపల వృత్తిని ప్రోత్సహించడానికి చెరువులు, కుంటల్లో చేప పిల్లల పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సంవత్సరం రూ.120 కోట్లతో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బాండ్ వద్ద గల హెచ్‌ఎమ్‌డిఏ గ్రౌండ్స్‌లో ఆదివారం తెలంగాణ గంగ తెప్పోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కార్పొరేషన్ చైర్మన్‌లు మెట్టు సాయి కుమార్, నిర్మలా జగ్గారెడ్డి, రోహిణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గంగ తెప్పోత్సవం సందర్భంగా గంగపుత్రులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. లోయర్ మానేరు డ్యామ్‌లో గంగమ్మ గుడిని నిర్మించామని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. గీత వృత్తిని ప్రోత్సహించడానికి చెట్లు పెంచాలని, గతంలో మత్స్య శాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని, కానీ ఇప్పుడు ప్రత్యేక మంత్రి ఉన్నారని చెప్పారు. గత సంవత్సరం చేప పిల్లల పంపిణీలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, కానీ ఈసారి అలాంటి పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. గంగమ్మ ఆశీస్సులతో మంచి వర్షాలు కురుస్తున్నాయని, కొన్ని చోట్ల క్లౌడ్ బరస్ట్ అవుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచి వర్షాలతో పంటలు బాగా పండుతున్నాయని చెప్పారు. అందరూ అమ్మవారికి మంచి పూజలు చేయాలని కోరారు.



## పాపన్న గౌడ్ విగ్రహా ఏర్పాటుకు నేడు శంకుస్థాపన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా నేడు ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్ ట్యాంక్‌బాండ్ సచివాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అనంతరం 11 గంటలకు రవీంద్ర భారతిలో పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలు సజావుగా జరిగేలా మంత్రి పొన్నం ప్రభాకర్, మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఇతర అధికారులు విగ్రహం ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు.

## వసంత్‌దాదా ప్రభుత్వాన్ని మేం కూల్చేశాం : శరద్ పవార్

### ఆయనే నన్ను సిఎంగా ప్రతిపాదించారు



**పుణె:** మహారాష్ట్రలో 1978లో వసంత్‌దాదా ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు తానే నాయకత్వం వహించాననీ, కానీ ఈ ఘటన జరిగిన పది సంవత్సరాల తర్వాత ఆయనే స్వయంగా తనను ముఖ్యమంత్రి పదవికి ప్రతిపాదించారని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ చెప్పారు. ఆనాడు కాంగ్రెస్‌పార్టీలో అంతగొప్ప విశాలహృదయంగల నాయకులు ఉండేవారని ఆయన గుర్తుచేసుకున్నారు. శరద్ పవార్ 1999లో కాంగ్రెస్ పార్టీతో సంబంధాలు తెంచుకుని నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించారు. కానీ 2023లో ఆ పార్టీ చీలిపోయింది. శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్ పార్టీనిఇ చీల్చి శివసేన,బిజెపి కూటమిలో చేరారు. ఈ సందర్భంగా శనివారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో శరద్ పవార్ మాట్లాడుతూ పాతకాలంలో జరిగిన ఘటనలను గుర్తుచేసుకున్నారు. అనేకసార్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించిన 84 ఏళ్ళ వయసు గల రాజ్యసభ సభ్యుడు శరద్ పవార్ మాట్లాడుతూ, తాను చాలాకాలం స్వరన్‌సింగ్ కాంగ్రెస్‌పార్టీలో తన ఉపదేశకుడు యశ్వంత్‌రావు చవాన్‌తో కలిసి ఉన్నానని, కానీ అప్పట్లో ఎవరికీ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ రాలేదన్నారు. చివరకు తాము ఏకమై వసంత్‌దాదాను ముఖ్యమంత్రిని చేశామన్నారు. ఎంతోమంది యువ కార్యకర్తలు ఆనాడు చవాన్ సాహెబ్‌తో కలిసి ఉండేవారని, ఆ విధంగా చాలా గ్యాప్ ఉండేదని, ఆ వెలితి భర్తీ చేసేందుకు చవాన్ సాబ్ చాలా ప్రయత్నాలు చేశారని, కానీ మేం దానిని వ్యతిరేకించామని శరద్ పవార్ గుర్తుచేసుకున్నారు. ఆయనను వ్యతిరేకించినవారిలో తానే కీలక ప్రత్యర్థిపాత్ర వహించాననీ, దీని ఫలితంగా ఆయనను పదవి నుండి దించేయాలని తాము నిర్ణయించుకున్నామని, అనుకున్నవిధంగానే ఆయనను పదవి నుండి దించేశాక తాను ముఖ్యమంత్రిని అయ్యానని చెప్పారు. ఇదంతా ఎందుకు గుర్తుచేసుకుంటున్నానంటే, వసంత్ దాదాతో తర్వాత పదేళ్ళకు మేం కలిసిపోయామని, ఆయనే తనను ముఖ్యమంత్రిగా ప్రతిపాదించారని అన్నారు. తదుపరి ముఖ్యమంత్రిని ఎంచుకోవడానికి ఒక సమావేశం ఏర్పాటు చేసినప్పుడు అనేకమంది పేర్లు చర్చకు వచ్చాయని, రామ్‌రావ్ అదిక్, శివాజీరావ్ నీలంగేకర్‌ల పేర్లు చర్చకు వచ్చాయన్నారు. కానీ వసంత్‌దాదా మాత్రం ''ఇక ఎలాంటి చర్చలూ అవసరం లేదు, మనం తిరిగి పార్టీని పునర్నిర్మించాం, శరద్ పవార్ పార్టీకి నాయకత్వం వహించి ముందుకు నడిపిస్తారు'' అని తన పేరును ఆయన ప్రతిపాదించారని గుర్తుచేసుకున్నారు. ''ఒక్కసారి ఊహించండి, అదే వ్యక్తి ప్రభుత్వాన్ని నేను ఒకప్పుడు కూల్చేశాను, కానీ తర్వాత ఆయనే నా పేరు ప్రతిపాదించారు నాయకుడుగా, ఆనాడు సైద్ధాంతిక ఐక్యత అంత గొప్పగా ఉండేది, అంతగొప్ప విశాల హృదయంగల నాయకులు ఆనాడు కాంగ్రెస్‌పార్టీలో ఉన్నారు'' అని శరద్ పవార్ అన్నారు.

# ఆరు ఫర్టిలిటీ సెంటర్లు, ఆస్పత్రులకు నోటీసులు

### సొంత ఇంటిని ఎల్‌ఎల్‌హెచ్ ఫర్టిలిటీ సెంటర్‌గా పేర్కొన్న నిందితురాలు
### రెండో అంతస్తులో సరోగసి మహిళలకు ఆశ్రయం
### మొదటి అంతస్తులో బ్రహ్మచారులకు మాత్రమే అద్దె గదులు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ జిల్లాలో సంచలనం సృష్టించిన అక్రమ సరోగసి కేసులో కీలకమైన డైరీని ప్రధాన నిందితురాలైన లక్ష్మి రెడ్డి నుండి స్వాధీనం చేసుకొన్న డైరీలో పలు కీలక అంశాలు వెలికి వచ్చాయి. ఈ తతంగంలో అండదానంతో పాటు సరోగసికి మహిళలను అప్పచెబుతానంటూ ఆమె సంబంధాలు ఏర్పాటు చేసుకొన్న ఆరు ఫర్టిలిటీ సెంటర్లు, ఆస్పత్రులకు పోలీసులు నోటీసులు జారీ చేసారు. సుచిత్ర చౌరాస్తా సమీపంలోని మాణిక్యనగర్‌లోని లక్ష్మి రెడ్డి సొంత నివాసగృహంపై మేడ్చల్ ఎస్‌ఓటి, పేట్‌బషీరాబాద్ పోలీసులు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులతో సంయుక్తంగా దాడులు నిర్వహించిన సమయంలో అదుపులో తీసుకొన్న సరోగసికి అంగీకరించిన 9 మంది మహిళకు నోటీసులిచ్చి పంపగా ఈ తతంగంలో కీలకంగా వ్యవహరించిన తల్లీకొడుకులు లక్ష్మి రెడ్డి, ఆమె కుమారుడైన నరేందర్‌రెడ్డి ఏ1, ఏ2 లుగా పేర్కొంటూ రిమాండ్‌కు తరలించారు.. మరింత లోతుగా విచారించేందుకు వారిద్దరిని న్యాయస్థానాన్ని పోలీస్ కస్టడీ కోరనున్నామని పేట్‌బషీరాబాద్ ఇనస్పెక్టర్ విజయవర్ధన్ తెలిపారు. ఆమె నివాసంలో పోలీసులకు లభించిన డైరీలో అండదానం,సరోగసికి అంగీకరించిన వివిధ ప్రాంతాలకు చెందిన మహిళల చిరునామాలు, వారిని సంప్రదించిన తేదీలు తదితర వివరాల ఆధారంగా వారిని గుర్తించేందుకు పోలీసు బృందాలు ఆరా తీస్తున్నారు. ఆమె డైరీలో లభించిన వివరాలు, దాడి సందర్భంగా వెల్లడైన అంశాల మేరకు న్యాయస్థానానికి ఎఫ్ఐఆర్‌లో పొందుపరచిన కేసు డైరీలో పొందుపరచిన వివరాలిలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిలకలూరిపేటకు చెందిన నారెద్దుల లక్ష్మి రెడ్డి 1994లో వివాహం అయి 1999లో భర్తతో విడిపోయి తన కుమార్తె, కుమారుడితో కల్సి నగరానికి వచ్చి తొలుత కూకట్‌పల్లిలో నివాసం ఏర్పరచుకొంది. తొలిసారిగా 2022లోఆమె డబ్బుల కోసం తన అండాన్ని ఓ ఫర్టిలిటీ సెంటర్‌కు విక్రయించింది. ఈ సమయంలో సంతానం లేని వారు లక్షల్లో డబ్బులిస్తారని తెల్సుకొన్న ఆమె అండాలను దానం చేయటంతో పాటు సరోగసికి ఆమోదించేందుకు ముందుకు వచ్చే పేద మహిళలను ఏర్పాటు చేసే ఏజంట్‌గా అవతారం ఎత్తి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ సెంటర్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకొంది. ఈ క్రమంలోనే పేద కుటుంబీకులకు పిల్లలను ఫెర్టిలిటీ సెంటర్లకు తరలించే క్రమంలో 2024లో మహారాష్ట్ర పోలీసులు ఆమెను అరెస్టు చేసి హ్యూమన్ ట్రాఫికింగ్ కేసులో జైలుకు పంపారు. అనంతరం జైలు నుండి విడుదలైన తర్వాత ఆమె పాత తరహానే కొనసాగిస్తూ నగరానికి వచ్చి సుచిత్ర చౌరాస్తా సమీపంలోని మాణిక్యనగర్‌లో రెండతస్తుల భవనాన్ని కొనుగోలు చేసింది. పెద్ద ఎత్తున సంపాదించాలన్న లక్ష్యంతో నగరలోని ఆర్టీసీ క్రాస్ రోడ్, మాదాపూర్, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లోని ఫెర్టిలిటీ సెంటర్లు, ఆస్పత్రుల నిర్వాహకులను సంప్రదించి తాను సరోగసి కోసం అండ దానంతో పాటు సరోగసికి ఆమోదించే మహిళలను ఏర్పాటు చేసేందుకు ఏజంటుగా పరిచయం చేసుకొంది. దీని కోసం తన కుమారుడు నరేందర్‌రెడ్డి సాయంతో మహారాష్ట్ర,కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన నిరుపేద కుటుంబాలను గుర్తించటం, వారికి ఆర్థికంగా సహకరించేందుకు గాను అండదానానికి.సరోగసికి ఒప్పించేది. అండదానానికి రూ.30 వేలు, సరోగసి ద్వారా పిల్లలను కని ఇస్తే రూ. 3 నుండి 4 లక్షలు ఇస్తానని ఒప్పందం చేసుకొన్న మహిళలను నగరానికి తీసుకొని వచ్చి మాణిక్యనగర్‌లో ఆమె కొనుగోలు చేసిన రెండతస్తుల భవనంలోని రెండో అంతస్తులో ఆశ్రయం కల్పించేంది. తన ఇంటినే ఎల్‌ఎల్‌హెచ్ ఫర్టిలిటి సెంటరుగా పేర్కొంటూ సంతానం లేని దంపతులను సైతం గుర్తించి పిల్లలను సరోగసి ద్వారా కానీ అండాల ద్వారా అందించేందుకు రూ. 30 నుండి రూ. 40 లక్షల వరకు తీసుకొనేది. ఈ క్రమంలో తాను సంబంధాలు ఏర్పరచుకొన్న వివిధ ఫర్టిలిటి సెంటర్లకు తన వద్ద ఉన్న మహిళలను తీసుకొని వెళ్లి ఆండదానం, సరోగసి కోసం అప్పగించటం ద్వారా పెద్ద మొత్తాల్లో సంపాదించేంది. ఈ విధంగా ఇప్పటి వరకు 50 మందికి పైగా మహిళలను అక్రమ (నిషేధిత కమర్షియల్) సరోగసికి అప్పచెప్పినట్లు పోలీసులు గుర్తించారు. ఆమె డైరీలో వెల్లడైన సంబంధాలు ఏర్పరచుకొన్న ఆరు ఫర్టిలిటీ సెంటర్లు, ఆస్పత్రులకు పోలీసులు నోటీసులు పంపారు. మరో పక్క తన సొంత గృహంలోని మొదటి అంతస్తులో కేవలం బ్రహ్మచారులకు మాత్రమే గదులను అద్దెకిచ్చి వారి నుండి వీర్యం సేకరించి సరోగసికి ఫర్టిలిటీ సెంటర్లకు అమ్మి సొమ్ము చేసుకొంటున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## అంతా అప్రమత్తంగా ఉండండి

### 88.55 కిలోమీటర్లు దెబ్బతిన్న గ్రామీణ రోడ్లు
### అధికారులతో మంత్రి దనసరి సీతక్క వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వరుసగా కురుస్తున్న వర్షాలు, వరదల కారణంగా అధికారులందరు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్/గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ఆదివారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఇఎన్‌సి ఎన్. అశోక్‌తో పాటు చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. వర్షాలు, వరదల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడిన పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తూ, ఇప్పటివరకు మొత్తం 86.55 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని మంత్రికి నివేదించారు. ఈ రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు ఆరున్నర కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.143 కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. మొత్తంగా రహదారులు; ఇతర మౌలిక వసతుల పునరుద్ధరణకు రూ.150 కోట్ల వరకు అవసరమవుతుందని అధికారుల నివేదిక వెల్లడించింది. అలాగే వర్షాలు, వరదల కారణంగా 66 రహదారులు, 83 క్రాస్ డ్రైన్ పనులు, 60 చోట్ల గండ్లు పడినట్లు వివరించారు. అంతేకాకుండా శిధిలావస్థలో ఉన్న 36 భవనాలు గుర్తించామని, వాటిలో నివసిస్తున్న ప్రజలను ఇతర సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నామని మంత్రికి తెలియజేశారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా రవాణా సంబంధాలు తెగిపోయిన కొన్ని గ్రామాలకు మళ్లీ కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు ఇఎన్‌సి అశోక్ తెలిపారు. మంచిర్యాల జిల్లా భీమిలి మండలంలోని కర్జిభీంపూర్ గ్రామానికి, అదే మండలంలోని రాజారం గ్రామానికి రవాణా సంబంధాలను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. అసిఫాబాద్ జిల్లా, అసిఫాబాద్ మండలంలోని రాజూర్ గ్రామానికి కూడా కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్నవారు పనిప్రదేశాలను వదిలి వెళ్లరాదన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే తాత్కాలిక మరమ్మతు పనులను పూర్తి చేయాలని ఆదేశిస్తూ, జిల్లా కలెక్టర్ల వద్ద ఇప్పటికే తగిన నిధులు అందుబాటులో ఉన్నందున వాటిని వినియోగించి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రహదారులు, కల్వర్టులు, భవనాల పునరుద్ధరణలో ఎలాంటి ఆలస్యం చేయకుండా వేగంగా స్పందించాలని మంత్రి సీతక్క ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు.

## మూడురోజులు అతిభారీ వర్షాలు

### కొత్తగూడెం, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కొన్ని జిల్లాలకు రెడ్ అలెర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదివారం కొత్తగూడెం, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ చేశామన్నారు. ఆదిలాబాద్, జనగాం, భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయనే అంచనగా ఉందని అధికారులు చెప్పారు. జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయన్నారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కామారెడ్డి, మెదక్, ములుగు, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేశామని అధికారులు చెప్పారు.

## టిఎస్‌పిజెఎ న్యూస్ ఫొటోగ్రఫీ–2025 పోటీల విజేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టిఎస్‌పిజెఎ) నిర్వహించిన 23వ రాష్ట్ర స్థాయి ఫొటో పోటీల ఫలితాలను జ్యూరీ సభ్యులు ఆదివారం విడుదల చేశారు. మొత్తం 250కి పైగా ఎంట్రీల నుంచి ఉత్తమ ఫొటోలను ఎంపిక చేశారు. ఈనెల 19న '186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం' సందర్భంగా ఈ ఫలితాలను వెల్లడించారు. పోటీల విజేతలను ఎంపిక చేసిన జ్యూరీలో తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ కోశాధికారి విశ్వేందర్ రెడ్డి, సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సత్తిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, టిఎస్ పిజెఎ అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి ఉన్నారు. పోటీలో ఎంపికైన ఉత్తమ ఫొటోలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఈనెల 19న హైదరాబాద్ బషీర్‌బాగ్ లోని దేశోద్ధారక భవన్‌లో ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభిస్తారని టిఎస్‌పిజెఎ అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి తెలిపారు.

విజేతల వివరాలు..

1వ బహుమతి : ఇంగు శ్రీనివాస్ (ఈనాడు, నిజామాబాద్) 2 వ బహుమతి : ఎ. కృష్ణ (హన్స్ ఇండియా, హైదరాబాద్) 3 వ బహుమతి : జి. బాలస్వామి (సాక్షి, హైదరాబాద్)

**కన్సోలేషన్ బహుమతులు..**

1. ఎన్. రాజేష్ రెడ్డి (సాక్షి, హైదరాబాద్)
2. జి. శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్)
3. ఎ. జాన్ (సాక్షి, హైదరాబాద్)
4. ఆర్. రాజు (సాక్షి, ఖమ్మం)
5. పి. వరప్రసాద్ (సాక్షి, వరంగల్)
6. ఎం. శ్రీనివాస్ (ది హన్స్ ఇండియా, నల్లగొండ)
7. జి. వేణుగోపాల్ (సాక్షి, జనగామ)
8. ఎం. అనిల్ కుమార్ (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్)
9. వి. రజనీకాంత్ గౌడ్ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్) 10. ఎ. జ్వాలా కోటేశ్వర్ రావు (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్).

# విద్యార్థుల అస్వస్థత

### గిరిజన ఆశ్రమంలో 15మంది ఫుడ్ పాయిజన్




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు గిరిజన ఆశ్రమంలో ఆదివారం విద్యార్థులకు అస్వస్థతకు గురయ్యారు. కల్లూరు లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినిలు 15మంది అస్వస్థతకు గురయ్యారు. శనివారం సాయంత్రం ఉడికి ఉడకని అన్నం తినడంతో ఆదివారం ఉదయానికి క్రమేపి 15 మందికి వాంతులు, విరోచనాలు కావడంతో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వసతి గృహంలో బియ్యంలో తెల్ల పురుగులు చేదుగా ఉండటం, రాళ్లు ముక్క పురుగులు మిరగలు వస్తున్నాయని ఉడికి ఉడకని అన్నం, మధ్యాహ్నం వండిన కూర సాయంత్రం భోజనంలో పెడుతున్నారని దానివల్లనే భోజనం బాగా లేదని, మెనూ పాటించడం లేదని విద్యార్థులు తెలిపారు. అదేవిధంగా ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచడం లేదని పారిశుద్ధ్యం పాటించడం లేదని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని విజయలక్ష్మి సహాయక అధికారిని భారతి తహసీల్దార్ పులి సాంబశివుడు మండల విద్యాశాఖ అధికారి నివేదితకి విద్యార్థులు ముఖాముఖి తెలిపారు. ఉపాధ్యాయ సిబ్బంది బెదిరిస్తున్నారని విద్యార్థినిలు తెలిపారు. మా పిల్లలను ఆవరణలో తల్లిదండ్రులకు బయట వచ్చే వారికి ఏమి చెప్పవద్దని బెదిరిస్తున్నారని తల్లిదండ్రులైన సవరపు శైలజ, అజ్మీర్ సక్కు తదితర తల్లిదండ్రులు తెలుపుతున్నారు. తరచూ మెనూ పాటించకపోవడం వలన ఉడికి ఉడకని అన్న వలన విద్యార్థుల సంఖ్య ఆశ్రమంలో పడిపోతుందని మెనుపై పూర్తిగా నమ్మకం పోయిందని విద్యార్థులు, తల్లిదండ్రులు తెలుపుతున్నారు. మెనూ పాటించకపోవడం చాలీచాలని భోజనం ఉడికి ఉడకని భోజనం తరచూ జరగడంతో విద్యార్థినిల తల్లిదండ్రులు విద్యార్థినీలకు నమ్మకం పోయి వారు ఇంటి బాట పడుతున్నారు. వంట మనిషిని వెంటనే మార్చాలని విద్యార్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా నాణ్యమైన మెనూ విద్యార్థులకు క్రమశిక్షణ పద్ధతిలో ఉత్తమ విద్యా బోధన అందించేందుకు కృషి చేస్తున్నామని ఎలాంటి పొరపాట్లు లేకుండా మెనూ పాటిస్తామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని విజయలక్ష్మి తెలిపారు. ఇట్టి సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియపరచి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు.



## హెచ్‌సిఎలో భారీ అవినీతి

### టిసిఎ కార్యదర్శి గుర్వారెడ్డి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ)లో భారీ అవినీతి చోటు చేసుకుందని నిధుల వినియోగం అవినీతితో నిండిపోయిందని కాగ్ మార్గదర్శకాలకు విరుద్ధంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వ్యవహరించిందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఏ) ప్రధాన కార్యదర్శి గుర్వారెడ్డి ఆరోపించారు. ఖమ్మం లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత ఆడిటర్ల ద్వారా కూడా ఆమోదం పొందలేని పరిస్థితిలో హెచ్‌సిఏ ఉందన్నా రు. అక్రమంగా ఆర్థిక ఖాతాలను ఆమోదించారని గతంలో ఉన్న కార్యదర్శులు, సరఫరాదారులు పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని 2023 అక్టోబర్‌లోనే నాలుగు కేసులు నమోదైనా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. హెచ్‌సిఏలో రూ. 200 కోట్లకు పైగా దోపిడీ జరిగిందని ఇందులో రూ. 12 కోట్లు జిల్లాల క్రికెట్ పేరిట దుర్వినియోగం చేశారని గుర్వారెడ్డి తెలిపారు. అవినీతిలో ప్రమేయం ఉన్న వ్యక్తులపై స్థానిక పోలీసులు కేసులు నమోదు చేయాలని సంబంధిత వ్యక్తులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు తీసుకున్నప్పుడే కుట్రల నుండి యువ క్రికెటర్లు రక్షించబడతారని ఆయన తెలిపారు. 90 ఏళ్ల హెచ్‌సిఏ చరిత్రలో తెలంగాణలో ఎక్కడ క్రికెట్ కోసం మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. బిసిసిఐ నిబంధనలు పాటించని సంస్థలను కూడా అర్హులుగా చేర్చారని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో కూరపాటి ప్రదీప్‌కుమార్, వీరేష్‌గౌడ్, జయపాల్, చిత్తరంజన్ పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆసుపత్రిలో చేరిన నవీన్ పట్నాయక్



**భువనేశ్వర్:** ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజెడి చీఫ్ నవీన్ పట్నాయక్ భువనేశ్వర్‌లోని ఎస్‌యుఎం అల్టిమేట్ మెడికేర్‌లో చేరారు. డీహైడ్రేషన్‌తో బాధపడుతుండటంతో ఆదివారం సాయంత్రం 5.15 గంటలకు ఆయనను ఆసుపత్రిలో చేర్చారు. చికిత్సకు సహకరిస్తున్నారని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. నవీన్ పట్నాయక్ ఆదివారంనాడు తనకు అసౌకర్యంగా ఉందని చెప్పడంతో వైద్యుల బృందం ఆయన ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించింది. అనంతరం ఆయనను మెడికేర్ ఆసుపత్రిలో చేర్చారు. 78 ఏళ్ల నవీన్ పట్నాయక్ సర్వికల్ ఆర్థరైటిస్‌కు ఇటీవల ముంబైలో స్పైనల్ సర్జరీ చేయించుకున్నారు. జూలై 12న తిరిగి ఒడిశా చేరుకున్నారు. 21 రోజుల చికిత్స తర్వాత భువనేశ్వర్ చేరుకున్న ఆయనకు ఘనమైన స్వాగతం లభించింది. వందలాది మంది బీజేడీ మద్దతుదారులు జెండాలు ఊపుతూ 'జై జగన్నాథ్' అంటూ తమ నేతకు స్వాగతం పలికారు.

## తమిళ గవర్నర్‌వి చౌకబారు రాజకీయాలు

### ప్రతిపక్షాల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారు : ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర విమర్శలు



**ధర్మపురి :** తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవిపై ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఆదివారం తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయన ప్రతిపక్షాల కంటే 'చౌకబారు రాజకీయాలు' చేస్తున్నారని, అధికార డిఎంకె, పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వంపై ఆయన అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వెల్లడిస్తూ తమిళనాడు ఇటువంటి పథకాలలో దేశానికి మార్గదర్శకంగా మారిందని ఆయన అన్నారు. ద్రవిడ నమూనా ప్రభుత్వం దేశానికి దిశానిర్దేశం చేస్తుందని, కొంతమంది దుర్మార్గులు దీనిని సహించలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సామాజిక సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవం సందర్భంగా స్టాలిన్ ధర్మపురిలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రతిపక్ష పార్టీలు ఏమి చెబుతున్నాయో తనకు ఆందోళన లేదని, ఎందుకంటే 'అది వారి రాజకీయాలు' అని ముఖ్యమంత్రి అన్నారు. వారికంటే చౌకబారు రాజకీయాలు చేస్తున్న వ్యక్తి ఎవరో మీకు తెలుసునన్నారు. అది కేంద్ర బిజెపి ప్రభుత్వం నియమించిన గవర్నర్ ఆర్.ఎన్. రవి అని అన్నారు. రాజ్‌భవన్ నుండి డిఎంకె ప్రభుత్వానికి వ్యతిరేకంగా అబద్ధాలు వ్యాప్తి చేస్తారన్నారు. ఆయన ద్రవిడాన్ని అవమానిస్తారని, బిల్లులను ఆమోదించరని, తమిళ గీతం ను అగౌరవపరుస్తారని, టిఎన్ విద్యార్థులను కించపరుస్తారని తీవ్రంగా విమర్శించారు. టిఎన్ విద్య, శాంతిభద్రతలు, మహిళల భద్రతపై రవి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తమిళనాడు భారతదేశంలోని అగ్ర రాష్ట్రమని కేంద్ర బిజెపి ప్రభుత్వ గణాంకాలే సూచిస్తున్నాయన్నారు. తమిళనాడు బిజెపి పాలిత రాష్ట్రాల కంటే (సామాజిక సూచికలలో) ముందుందని, దీనిని తట్టుకోలేక ఆయన (రవి) ప్రజా వేదికలపై తన నిరాశను వ్యక్తం చేస్తున్నారని స్టాలిన్ ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మహిళల భద్రత, రాష్ట్రంలోని యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఇతర అంశాలపై గవర్నర్ ఆందోళన వ్యక్తం చేసిన తర్వాత సిఎం తీవ్రంగా స్పందించారు. పాఠశాల విద్యలో తమిళనాడు రెండవ స్థానంలో ఉందని స్టాలిన్ అన్నారు. అలాగే, రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగా నిర్వహించడం వల్లే గత నాలుగు సంవత్సరాలలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షితులయ్యాయని ఆయన అన్నారు. మహిళల భద్రత విషయానికొస్తే, 2022 నాటి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలను ఉటంకిస్తూ, మహిళలపై నేరాలలో బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల, గవర్నర్ బిజెపి పాలిత రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకోవాలని స్టాలిన్ అన్నారు.

## భారత్‌కు చేరుకున్న శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ :** యాక్సియం–4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా భారత్‌కు చేరుకున్నారు. అంతరిక్ష యాత్ర విజయవంతమయ్యాక అమెరికాలో ఉన్న ఆయన, ఆదివారం తెల్లవారుజామున స్వదేశానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు భార్య కామ్నా శుక్లా, కుమారుడు సమక్షంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా ఘన స్వాగతం పలికారు. శుభాంశు శుక్లా స్వదేశానికి చేరుకోవడం భారత్‌కు గర్వకారణమైన క్షణంగా కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అభివర్ణించారు. 'భారతదేశానికి గర్వకారణమైన క్షణం! ఇస్రోకు కీర్తినిచ్చే క్షణం! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దీనికి దోహదపడిన వ్యవస్థకు కృతజ్ఞత తెలుపుతూ, దేశ అంతరిక్ష వైభవం భారత గడ్డను తాకింది. భారతమాత దిగ్గజ పుత్రుడు శుభాంశు శుక్లా ఆదివారం తెల్లవారుజామున ఢిల్లీలో అడుగుపెట్టారు. ఆయనతో పాటు మిషన్ గగన్‌యాన్‌కు ఎంపికైన వ్యోమగాముల్లో ఒకరైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఉన్నారు' అని తెలిపారు. కాగా, యాక్సియం–4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా శనివారం పోస్టు ద్వారా తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు చెప్పారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని అన్నారు. అయితే ఆదివారం భారత్‌కు వచ్చిన శుక్లా, సోమవారం మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈనెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కూడా శుక్లా పాల్గొంటారని వెల్లడించాయి. ఇటీవల నిర్వహించిన యాక్సియం–4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. రోదసిలో 18 రోజులు గడిపి మానవాళికి ప్రయోజనం కలిగించే పలు ప్రయోగాలను నిర్వహించిన శుభాంశు శుక్లా బృందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. ఆ వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ (పోలండ్), టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

### రాజ్యాంగ చెల్లుబాటు అంటే..

## 'వాంఛనీయత' అనే అర్థం కాదు

### మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా



**న్యూఢిల్లీ :** ఒక ప్రతిపాదన యొక్క రాజ్యాంగ చెల్లుబాటు ఏవిధంగానూ దాని నిబంధనల వాంఛనీయత అనే అర్థం కాదని మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా ఏకకాల ఎన్నికల (ఓఎన్‌ఓఇ) బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీకి చెప్పారు. సంజీవ్‌ఖన్నా కమిటీకి రాసిన తన అభిప్రాయంలో, రాజ్యాంగ సవరణ బిల్లు గురించి దేశ సమాఖ్య నిర్మాణాన్ని పలుచన చేయడానికి సంబంధించిన వాదనలు లేవనెత్తవచ్చని సూచించారు. ఎందుకంటే ఈ వాదనకు మద్దతు ఇస్తూ విమర్శిస్తూ చేసిన వివిధ వాదనలను ఆయన జాబితా చేశారని వర్గాలు తెలిపాయి. బిజెపి ఎంపి పిపి.చౌదరి నేతృత్వంలోని కమిటీతో అభిప్రాయాలను పంచుకున్న చాలామంది నిపుణులు ఈ ప్రతిపాదనలు రాజ్యాంగవిరుద్ధమనే ఆరోపణలను తిరస్కరించారు. కానీ బిల్లులోని ప్రస్తుత నిబంధనలతో కొన్ని సమస్యలను లేవనెత్తారు. మంగళవారం కమిటీ సభ్యులతో సంభాషించనున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా బిల్లులో ఎన్నికల కమిషన్‌కు ఇవ్వబడిన అధికారంపై ఆందోళనలను లేవనెత్తడంలో భారత దేశపు మరికొందరు న్యాయమూర్తుల సరసన చేరారు. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించరాదని నిర్ణయించడంలో, ఈ దిశగా రాష్ట్రపతికి సిఫారసు చేయడంలో ఎన్నికల సంఘానికి ఈ బిల్లు అపరిమితమైన విచక్షణాధికారాన్ని కల్పిస్తుందని సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘించడం ద్వారా రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించడం అనే కారణంతో ఈ నిబంధన ప్రశ్నించదగినదని సంజీవ్‌ఖన్నా చెప్పినట్లు తెలిసింది. ఆర్టికల్ 14 చట్టం ముందు సమానత్వం గురించి వివరిస్తుంది. 'ఎన్నికల సంఘం ఎన్నికలను వాయిదా వేయడం ద్వారా పరోక్ష రాష్ట్రపతి పాలన విధించవచ్చు. మరో రకంగా చెప్పాలంటే రాష్ట్ర ప్రభుత్వం పగ్గాలను కేంద్ర ప్రభుత్వం చేపట్టడం ఇది రాజ్యాంగం ఊహించిన సమాఖ్య నిర్మాణాన్ని ఉల్లంఘించడం కాబట్టి న్యాయపరంగా ప్రశ్నార్థకం అవుతుంది' అని సంజీవ్ ఖన్నాఅన్నారు.

## గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

### రెండు వాహనాలు ఢీకొని ఏడుగురు సజీవ దహనం..!



**గాంధీనగర్ :** గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లాలో ఆదివారం ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మరణించారు. దేదాదర గ్రామం సమీపంలో స్విఫ్ట్ డిజైర్ కారు, టాటా హారియర్ ఎస్‌యువి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసు అధికారులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదం చాలా తీవ్రంగా ఉండడం వెంటనే వాహనాన్ని మంటలు అలుముకున్నాయి. వాహనంలోనే ప్రయాణికులంతా చిక్కుకుపోయారు. సమాచారం మేరకు మధ్యాహ్నం సమయంలో ఘటన జరిగినట్లు సమాచారం. ప్రమాదం తీవ్రత నేపథ్యంలో డిజైర్ వాహనంలో ఉన్న ప్రయాణికులంతా మృతిచెందినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గాయపడ్డ వారిని రక్షించి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. స్థానికులు డిజైర్ వాహనంలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రయత్నించినా మంటల్లో ఏడుగురు కాలిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. వాధ్వన్ పోలీస్ స్టేషన్ నుంచి ఇన్‌స్పెక్టర్ పీబీ జడేజా మాట్లాడుతూ.. 'దేదాదర గ్రామం సమీపంలో మధ్యాహ్నం జరిగిన సంఘటన తర్వాత కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారని.. ఎస్‌యూవీలో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారని చెప్పారు. ఈ ఘటనతో రద్దీగా ఉండే హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. వాహనాలు వేగంగా ఉండడం వల్లే అదుపు తప్పి ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నట్లుగా అనుమానిస్తున్నారు. దాంతో మంటలు చెలరేగాయని పలువురు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

### ప్రతిపాదిత జిఎస్‌టి సంస్కరణల అమలుకు..

## రాష్ట్రాలు సహకరించాలి

### ఢిల్లీలో రెండు ఎక్స్‌ప్రెస్‌వేలను ప్రారంభించిన ప్రధాని మోదీ






**న్యూఢిల్లీ :** తదుపరి తరం (నెక్స్ట్ జనరేషన్) జిఎస్‌టి సంస్కరణల ముసాయిదాను కేంద్రం రాష్ట్రాలకు పంపిణీ చేసిందని, దీపావళికి ముందు ఈ ప్రతిపాదనను అమలు చేయడానికి రాష్ట్రాల సహకారాన్ని కోరిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. జిఎస్‌టిలో సంస్కరణ పేద, మధ్యతరగతి ప్రజలకు, చిన్న, పెద్ద వ్యాపారాలకు ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన చెప్పారు.ఆదివారం నాడు ఇక్కడ రెండు ఎక్స్‌ప్రెస్ వేల ప్రారంభోత్సవం అనంతరం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసగించిన ప్రధానమంత్రి మోదీ కేంద్రం జిఎస్‌టి చట్టాన్ని మరింత సులభతరం చేయాలని,పన్ను రేట్లను సవరించాలని యోచిస్తోందని తెలియజేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగాన్ని ఎర్రకోట వేదికగా చేస్తూ జిఎస్‌టి చట్టాన్ని సంస్కరించే ప్రతిపాదనను ప్రధానమంత్రి మోదీ ప్రకటించారు.'మాకు సంస్కరణ అనేది మంచి పాలకుడి పురోగతిని సూచిస్తుంది.అందుకే మేం సమీపభవిష్యత్తులో నిరంతరమైన మెరుగుదలపై బలమైన ప్రాధాన్యతనిస్తాం. ప్రకాశవంతమైన వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేయడానికి , మరింత సౌకర్యవంతంగా చేయడానికి ఉద్దేశించిన సంస్కరణలను అమలు చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని ప్రధానమంత్రి చెప్పారు.'ఈ దార్శనికతలో భాగంగా జిఎస్‌టి ఫ్రేమ్‌వర్క్ కింద తదుపరితరం (నెక్స్ట్ జనరేషన్) సంస్కరణలు ప్రవేశపెట్టబడతాయి. ఈదీపావళికి జిఎస్‌టి సంస్కరణలు ప్రజలకు డబుల్ బోనస్‌ను ఇవ్వనున్నాయి.వారి ఆనందాలు రెట్టింపుకానున్నాయి. ఈ సంస్కరణల ముసాయిదాను కేంద్రం రాష్ట్రాలకు పంపించింది' అని మోదీ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అన్ని రాష్ట్రాలు సహకరిస్తాయని తాను ఆశిస్తున్నానన్నారు.దీపావళి పండుగ మరింత అద్భుతంగా జరిగేలా ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ప్రధానమంత్రి మోదీ కోరారు. జిఎస్‌టి రేట్లను సులభతరం చేయడమే ఈ సంస్కరణల లక్ష్యం అని చెప్పారు.

### రూ.11,000కోట్ల విలువైన రెండు హైవేలను ప్రధాని మోదీ ప్రారంభం

అంతకుముందు, కోట్ల రూపాయల విలువైన ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్2 ఢిల్లీ విభాగాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ప్రారంభించారు. ఢిల్లీదాని పరిసర ప్రాంతాలలో కనెక్టివిని మెరుగుపర్చడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఢిల్లీ సహాదాని పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్‌ను తగ్గించే లక్ష్యంతో రాజధానిలో రద్దీని తగ్గించడానికి ప్రభుత్వ సమగ్ర ప్రణాళిక కింద ఈ రెండు ప్రాజెక్టలను అభివృద్ధి చేశారు. ఈ కొత్త ప్రాజెక్టులు పూర్తిగా పనిచేస్తున్నప్పుడు సోనిపట్ నుంచి రోహ్‌తక్, బహదూర్‌గర్ , గుర్‌గ్రామ్ నుంచి ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని భావిస్తున్నారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే, యుఇఆర్2 ఢిల్లీఎన్‌సిఆర్ ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయి. ఢిల్లీలోని ప్రజల ఇబ్బందులన్నీ తొలగించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఈ ప్రాజెక్టలను ప్రారంభించిన తర్వాత ప్రధానమంత్రి మోదీ అన్నారు. అభివృద్ధి చెందుతున్న భారత దేశం స్ఫూర్తిని ప్రతిబింబించే ఢిల్లీ వృద్ధి నమూనాను ప్రభుత్వం రూపొందిస్తున్నదని ప్రధానమంత్రి అన్నారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్లు అసాధారణంగా నిర్మించబడింది. పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వేత తర్వాత అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ఇప్పుడు ఢిల్లీకి గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుంది అని ప్రధాని మోదీ చెప్పారు. నగరంలో పెరుగుతున్న చెత్త సమస్యను పరిష్కరించడంలో అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ప్రత్యేక సహకారం దాని ప్రత్యేకతను నిర్ధారిస్తుందని మోదీ ఎత్తిచూపారు.ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ ఈ రెండు ప్రాజెక్టల వల్ల ఢిల్లీలో 50శాతం ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందన్నారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేలోని 10.1కి.మీ పొడవైన ఢిల్లీ విభాగాన్ని దాదాపు రూ.5,360 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశామని, ఈవిభాగం యశోభూమి, ఢిల్లీ మెట్రో బ్లూ మరి యు ఆరెంజ్ లైన్స్ , రాబోయే బిజ్వాసన్ రైల్వే స్టేషన్, ద్వారకా క్లస్టర్ బస్ డిపోకు మల్టీమోడల్ కనెక్టివిటీని కూడా అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని ముండ్కా బక్కర్ వాలా గ్రామం టోల్‌ప్లాజాలోమోదీ రోడ్ షోను నిర్వహించారు.

### బిగ్‌బాస్ ఒటిటి సీజన్-2 విజేత

## ఎల్విష్ యాదవ్ ఇంటిపై కాల్పులు



**న్యూఢిల్లీ :** బిగ్‌బాస్ ఒటిటి సీజన్–2 విజేత, ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఎల్విష్ యాదవ్ ఇంటిపై ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. అయితే ఈ కాల్పుల ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సిసి కెమెరాల్లో రికార్డయ్యాయి. ముగ్గురు వ్యక్తులు బైకుపై గురుగ్రామ్‌లోని ఎల్విష్ యాదవ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. కాసేపటి తర్వాత వారిలో ఇద్దరు ఎల్విష్ ఇంటిపై బుల్లెట్‌ల వర్షం కురిపించారు. ఆ తర్వాత వాళ్లు కాసేపు కాల్పులు ఆపి బుల్లెట్‌లను లోడ్ చేసుకున్నారు. ఆ తర్వాత మరో రౌండ్ కాల్పులు జరిపారు. వారిలో ఒకడైతే ఇంటి మెయిన్ గేట్ దగ్గరికి వెళ్లి కాల్పులు జరిపాడు. అలా మొత్తం 25 రౌండ్ల కాల్పులు జరిపి ముగ్గురు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఫోరెన్సిక్ బృందాల సహాయంతో తనిఖీలు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాల్పుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. భవనంలోని రెండు, మూడో అంతస్తుల్లో ఎల్విష్ యాదవ్ తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దుండగుల కాల్పుల్లో తూటాలు మొదటి అంతస్తులోకి దూసుకువెళ్లాయి. దాడి జరిగిన సమయంలో ఎల్విష్ ఇంట్లో లేడని, అతడి కుటుంబసభ్యులు, కేర్‌టేకర్ ఉన్నారని పోలీసులు చెప్పారు. కాగా ఎల్విష్ యాదవ్ ఇంటిపై కాల్పులు జరిపింది తామేనని హిమాన్షు బావు గ్యాంగ్ ప్రకటించింది. ఎల్విష్ యాదవ్ బెట్టింగ్‌ను ప్రమోట్ చేస్తున్నాడని, అందుకే కాల్పులు జరిపామని తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టింది. ఇప్పుడు మేమేందో ఎల్విష్ యాదవ్‌కు పరిచయం చేశామని ఆ పోస్టులో పేర్కొన్నారు.

బెట్టింగ్‌ను ప్రమోట్ చేయడం ద్వారా ఎల్విష్ ఎన్నో కుటుంబాలను నాశనం చేశాడని ఎల్విష్ గ్యాంగ్ ఆరోపించింది. ఇకపై కూడా ఎవరైతే బెట్టింగ్‌ను ప్రమోట్ చేస్తారో వారికి ఏ క్షణంలో నైనా ఫోన్ కాల్ రావచ్చునని, లేదంటే ఆ ఇంటిపైకి బుల్లెట్‌లు దూసుకురావచ్చని హిమాన్షు గ్యాంగ్ హెచ్చరించింది. బెట్టింగ్ రాయుళ్లు తమను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సవాల్ చేసింది.

## హిమాచల్‌లో భారీ వర్షాలు

### ఇప్పటి వరకూ 261 మంది మృతి



**సిమ్లా :** హిమాచల్ ప్రదేశ్ మళ్లీ వానలతో అతలాకుతలం అవుతోంది. గత రెండు నెలల్లో రాష్ట్రం అంతటా భారీవర్షాలు, ఆకస్మిక వరదలతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల మండి జిల్లాలోని పానర్సా, టకోలి, నాగ్వైన్ ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి. చండీగఢ్‌మనాలి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను పూర్తిగా ఆపేసింది. కొన్ని చోట్ల రోడ్లు పూర్తిగా కూలిపోయాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ వరదల్లో మానవ ప్రాణ నష్టం జరగలేదని మండి జిల్లా ఎఎస్‌పి సచిన్ హిరేమత్ తెలిపారు. కానీ పోలీసులు అప్రమత్తమై పహారా కాస్తూ, రోడ్లు క్లిన్ చేయించి రవాణా తిరిగి ప్రారంభించే పనిలో ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ ప్రకారం జూన్ 20 నుంచి ఆగస్ట్ 16 వరకు వర్షాలతో మృతి చెందిన వారి సంఖ్య 261కి చేరింది. వీరిలో 136 మంది వర్షాలకు సంబంధించి జరిగిన ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారు. జిల్లాల వారీగా మండి జిల్లాలో అత్యధికంగా 26 మంది మృతి చెందగా, కాంగ్రాలో 28 మంది, కుల్లులో 11 మంది, చంబాలో 10మంది, మరణించారు. మరోవైపు 125మంది రోడ్డు ప్రమాదా ల్లో మృతిచెందారు. ఈ వర్షాల కారణంగా రాష్ట్రానికి మొత్తం రూ. 2,14,457 లక్షల నష్టం వాటిల్లింది. పిడబ్ల్యుడి (పబ్లిక్ వరక్స్ డిపార్ట్‌మెంట్) ప్రకారం రూ. 1.18 లక్షల కోట్లు, వ్యవసాయం, తోటల శాఖలకు రూ.83,000 కోట్లకు పైగా నష్టం జరిగింది. ఈక్రమంలో 278 ఇళ్లు పూర్తిగా ధ్వంసం కాగా, 703 పశువుల గుడిసెలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంకా27,000కు పైగా పశువులు, పక్షులు వర్షాలవల్ల మృతిచెందాయి. ప్రధా న రహదారులు ఎన్‌హెచ్ 05(కిన్నౌర్), ఎన్‌హెచ్ 305(కుల్లు) లాండ్‌స్లైడ్‌లతో మూసివేస్తున్నారు. కొంతమంది గ్రామాలు రోజుల తరబడి బాహ్య ప్రపంచంతో సంబంధం కోల్పోతున్నాయి. ఇది సహాయ చర్యలకు కూడా అడ్డంకిగా మారింది. ప్రత్యేక బృందాలు రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి ప్రాథమిక సదుపాయాలను పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యాయి.

## కథువాలో క్లౌడ్‌బరస్ట్

### కొండచరియలు విరిగిపడి ఏడుగురు మృతి



**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లోని కిష్టవార్ జిల్లాలో ఇటీవల సంభవించిన క్లౌడ్ బరస్ట్ పెను విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈ ఉపద్రవాన్ని మరువక ముందే కథువా జిల్లాలోని ఘాటీ గ్రామంలో మేఘ విస్ఫోటం సంభవించింది. ఈ విపత్తులో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఈ విస్ఫోటం సంభవించిందని స్థానిక పోలీసు అధికారి తెలిపారు. సహాయక చర్యల నిమిత్తం ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం ఆ ప్రాంతానికి చేరుకుందని వెల్లడించారు. ఘాటీ సమీపంలోని జుతానా జోడ్ అనే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో శిథిలా కింద ఒక కుటుంబం చిక్కుకున్నట్లు తెలుస్తోంది. భారీ వర్షాల కారణంగా సహాక్ ఖాద్, ఉజ్ నదులలో నీటి శాతం అమాంతంగా పెరిగిపోయిందని అధికారులు తెలిపారు. రైలు పట్టాలు దెబ్బతినడంతో పాటు ఆ ప్రాంతంలోని జాతీయ రహదారితో సహా ప్రధాన మార్గాలపై వాహనాలు నిలిచిపోయాయన్నారు. కథువా పోలీస్ స్టేషన్‌లోకి కూడా వరదనీరు చేరింది. ఈ ఘటనపై కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించారు. మేఘ విస్ఫోటంపై సమాచారం అందగానే కథువా పోలీసు అధికారి శోభిత్ సక్సేనాతో మాట్లాడినట్లు తెలిపారు. సహాయక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారన్నారు. మృతులకు సంతాపం తెలిపారు. మరోవైపు జిల్లా అధికారులు వాతావరణ హెచ్చరికలు జారీ చేశారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున అలాంటి ప్రదేశాలకు దూరంగా వెళ్లాలని కోరారు. ఇటీవల మచైల్ మాతా దేవి దర్శనానికి వెళ్తున్న యాత్రికులపై మేఘ విస్ఫోటం విరుచుకుపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో సహా ఇప్పటి వరకు 60 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 82 మంది గల్లంతయ్యారు.

# సాహితీ విహారి

## మాయమవుతున్న 'మానవత్వ కోణం'!

'మాయమైపోతున్నడమ్మా మనిషన్న వాడు... మచ్చుకైనా లేడు చూడు, మానవత్వము ఉన్న వాడు' అంటాడు ప్రముఖ కవి అందెశ్రీ. ఈ గొప్ప వాక్యాలను సాహిత్యానికి కూడా అన్వయించుకోవచ్చు. ఎందుకంటే, ప్రపంచ సాహిత్యంలో 'మానవత్వ కోణం' క్రమంగా మాయమవుతున్నది. ఆఫ్రికా దేశాల ఆకలి కేకలపై ఎంత మంది స్పందిస్తున్నారు? సిరియా ప్రజల కష్టాలను ... బాధామయ జీవితాలను ఎంత మంది సాహిత్య వస్తువుగా తీసుకుంటున్నారు? దశాబ్దాలుగా దాడులు ఎదుర్కొంటూ, రక్తమోడుతున్న గాజాలో దిక్కులేని ప్రజల తరపున గళం విప్పాల్సిన చాలామంది రచయితలు మూగనోము పట్టారు ఎందుకో? జనావాసాలను నేలమట్టం చేసినా.. ప్రార్థనా మందిరాలపై బాంబులు కురిపించినా.. ఆసుపత్రులను కూడా వదలకుండా ధ్వంసం చేసినా ఏమీ పట్టకుండా ధృతరాష్ట్రుడి వారసులవుతున్నారు.. కారణం ఏమిటో? నిజానికి పాలస్తీనా కథ చెప్పడమంటే.. అక్కడి ప్రజల బాధను వర్ణించడం. వారి నిరసనను అక్షరబద్ధం చేయడం. అక్కడి పరిస్థితులపై స్పందించని కలం ఎవరికి ఉపయోగం. మానవత్వాన్ని అపహాస్యం చేస్తున్న దుశ్చర్యలకు అల్లాడిపోవడం కేవలం పాలస్తీనాకు మాత్రమే పరిమితం కాదు. కళ్లుండి చూడాలేగానీ, తమ సొంత దేశంలోనే కాందశీకులుగా బతుకుతున్న వారు అడుగడుగునా కనిపిస్తారు. చెవులుండి ఆలకించాలేగానీ దోపిడికి, అణచివేతకు, అత్యాచారాలకు బలవుతున్న లక్షలాది మంది ఆర్తనాదాలు వినిపిస్తాయి. మానవత్వం ఉంటే, సమకాలీన రచనల్లో అత్యధిక శాతం ఈ అంశాలే ప్రతిబింబించాలి. అక్షర యుద్ధం కావాలి. బాధగాథల దారి ప్రస్థానాలను ప్రస్తావించాలి. సమాజంలోని అన్యాయాలు, విధ్వంసాలకు ప్రతి అక్షరం ఒక సంకేతం కావాలి. మానవత్వం విలువలను తట్టిలేపే విధంగా, రచనలు వివరణాత్మకంగా, భావోద్వేగాలతో నిండినవిగా మారాలి. మానవత్వంపై సభలు, సమావేశాలు నిర్వహించుకుంటున్నా, నిజ జీవితంలో పట్టించుకోవడం లేదన్నది చేదు నిజం. అంతర్జాతీయ దినోత్సవాలు నామమాత్రపు తంతుగానే మిగిలిపోతున్నాయి. సమాజానికి దిక్సూచిగా వ్యవహించాల్సిన సాహితీకారులు కూడా ఈ విషయాన్ని విస్మరించడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. నిజానికి సాహిత్యం అనేది మానవ జీవనానికి అద్దం. మనిషి అనుభవించిన సుఖాలు, దుఃఖాలు, పోరాటాలు, కలలు, ఆశలు అన్నీ ఏదో ఒక సాహితీ ప్రక్రియలో చోటు చేసుకుంటాయి. అయితే, సాహిత్యానికి ఉన్న అసలు ప్రాణం మానవత్వం. మానవత్వం లేకుండా రాసిన సాహిత్యం కేవలం పదాల కూర్పు మాత్రమే అవుతుంది. అది హృదయాలను తాకదు. సమాజంలో మార్పును తీసుకురాదు. ప్రాంతం లేదా భాష ఏదైనా, ప్రతి గొప్ప రచన వెనుక మానవత్వం అనే మూల విలువ తప్పనిసరిగా ఉంటుంది. మానవ హక్కులు, సమానత్వం, దయ, కరుణ, న్యాయం, బంధుత్వం వంటి భావాలు ఏ కవిత్వానికైనా, ఏ కథానికైనా, ఏ నాటకానికైనా జీవం పోసే శక్తులు. సాహిత్యానికి, మానవత్వానికి ఉన్నది అవినాభావ అనుబంధం. ఒక రచన భావోద్వేగాలను వ్యక్తపరిచే మార్గం. సాహిత్యం మనిషి లోపలి భావాలను వెలికి తీస్తుంది. కవి వ్యక్తపరిచే భావాలను పాఠకుడు స్వయంగా అనుభూతి చెందుతాడు. అంతటి బలం సాహిత్యానికి ఉంది. ఈ అనుభూతి పంచుకోవడమే మానవత్వానికి పునాది. మానవ సమస్యల పట్ల సున్నిత దృష్టి లేకుండా జరిగే సాహితీ సృష్టి ఎలాంటి ప్రయోజనం లేని, శూన్యమైన కళాఖండంగా మిగిలిపోతుంది. దళిత సాహిత్యం, మహిళా సాహిత్యం, విప్లవ సాహిత్యం.. ప్రక్రియలు ఏవైతేనేం..

మానవతను ప్రదర్శించినప్పుడే వాటికి సార్థకత. ప్రతి యుగంలో సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు వేరైనా, మానవత్వం కోణం మాత్రం స్థిరంగా ఉంటుంది. షేక్స్‌పియర్ నుంచి టాగూర్ వరకు, కనాఫాని నుంచి శ్రీశ్రీ వరకు ఎంతో మంది రచనల్లో మానవ విలువలు ప్ర ధాన స్థానం పొందాయి. లియో టాలిస్టాయ్ రచనలన్నీ మానవ దయ, సత్యం, అహింస అనే విలువల చుట్టూ తిరుగుతాయి. విక్టర్ హ్యూగో రాసిన లెస్ మిజరబుల్స్ పేదల దుస్థితిని, సమాజపు అన్యాయాన్ని, కరుణను ప్రతిబింబిస్తుంది. చార్లెస్ డికెన్స్ అనాథ పిల్లల బాధలు, పేదల కష్టాలు, పారిశ్రామిక యుగంలోని అన్యాయాలను మానవత్వంతో వివరించాడు. యుద్ధాలు, రాజకీయం మాత్రమే కాదు.. ధర్మం, కరుణ, స్నేహం, త్యాగం వంటి మానవ విలువలను నేర్పే ఎన్నో రచనలు వచ్చాయి. ఇప్పుడు రావడం లేదని అనలేముగానీ, సంఖ్య మాత్రం దారుణంగా కుదించుకుపోతున్నది. ఆధునిక సాహిత్యం అత్యధిక శాతం కార్పొరేట్ అనుకూల దృక్పథాన్ని సంతరించుకుంటూ, మానవత్వ కోణాలను మరచిపోతున్నది. కులం, మతం, జాతి అనే గోడలను చెరిపి సార్వత్రిక మానవత్వాన్ని ముందుకు తెచ్చే రచనల అవసరం ప్రస్తుత పరిస్థితు ల్లో ఎంతగానో



ఉంది. మానవత్వం, మానవత్వం సాహిత్యానికి కేంద్రబిందువులు కావాలి. సగటు జీవి బతుకు పోరాటాన్ని మానవ విలువల దృక్కోణంలో చెప్పగలగాలి. సమాజంలోని దోపిడీ, అసమానతలపై గళమెత్తి, మానవత్వపు కోణంలో అక్షరాలు సంధించినప్పుడు మా త్రమే విలువైన సాహితీ సృజన జరుగుతుంది. స్త్రీ స్వేచ్ఛ, మానవ స్వేచ్ఛ కోసం పోరాడే రచనలే మానవత్వానికి ప్రతీకలు. చాలా మంది రచయితలు కూడా మానవ సంబంధాల సున్నితతను చూపించారు. నేటి తరం ఆ విలువలను ముందుకు తీసుకెళ్లాలి. మానవత్వ కోణం లేకుంటే సాహిత్యం వెలవెలబోతుంది. ఎంతగొప్ప సాంకేతిక నైపుణ్యం ఉన్నా, పదాలు కూర్పు అద్భుతంగా కనిపించినా, మానవత్వం లేకపోతే పాఠకుడి మనసుకు దగ్గరగా వెళ్లలేవు. అలాంటి రచనలు సామాజిక ప్రయోజనం కోల్పోతాయి. సమాజం మార్పు చెందడానికి సాహిత్యం ఒక పునాదిగా ఉండాలి. మానవత్వం లేకపోతే ఆ శక్తి దెబ్బతింటుంది. మిగతా అంశాలు ఎలావున్నా, మానవ విలువలు శాశ్వతం. అవి లేకుండా రాసిన రచన కాలాతీ తత సాహిత్య స్థానాన్ని పొందలేదు. అందుకే, మానవత్వ సాహిత్యం అవసరం. ఈ రోజుల్లో యుద్ధాలు, వలసలు, కులహింస, పేదరికం, వాతావరణ

మార్పులు, మానవ హక్కుల ఉల్లంఘనలు విస్తరిస్తున్నాయి. ఇలాంటి కాలంలో సాహిత్యం మానవత్వపు దీపంలా సమాజానికి దారి చూపాలి. డిజిటల్ యుగంలోనూ, సోషల్ మీడియా సాహిత్యంలోనూ మానవ కోణం అవసరం. కేవలం వినో దం కోసమేకాదు.. ఒకరినొకరు అర్థం చేసుకునే వంతెన గా, ఒకరికొకరు నిలిచే మాధ్యమంగా ఉపయోగపడాలి. సాహిత్యం మనిషిని మరింత మానవుడిగా తీర్చిదిద్దే సాధనం. అందుకే ప్రతి యుగంలోనూ, ప్రతి భాషలోనూ మానవత్వం సాహిత్యానికి ఆత్మగా నిలిచింది. భావాలను, అనుభూతులను, న్యాయాన్ని, సమానత్వాన్ని, ప్రేమను, కరుణను రక్షించే శక్తి మానవత్వ సాహిత్యానికే ఉంది. అందువల్ల సాహిత్యంలో మానవత్వం కోణం అవసరం కాదు.. అదే సాహిత్యానికి హృదయం. సాహిత్యం అనేది కేవలం పదాల ఆట కాదు. అది మానవ అనుభవాలకు, ఆలోచనలకు, విలువలకు ప్రతిబింబం. సమాజపు సత్యాలను, వ్యక్తిగత బాధలను, సంతోషాలను, ఆకాంక్షలను సాహిత్యం తనలో మిళితం చేసుకుంటుంది. కానీ ఇందులోని ప్రధానమైన మూలతత్వం మానవత్వం. మానవత్వం లేని సాహిత్యం ఉంటే ,అది ఒక యాంత్రిక కూర్పు మాత్రమే అవుతుంది, పాఠకుడి మనసును కదిలించలేని పుస్తకపు పుటల దొంతరులుగానే మిగిలిపోతా యి. మనసు తాకే శక్తి ఉన్న బలమైన రూపాల్లో సాహిత్యానిది మొదటి స్థానం. ఇది మనిషి అంతరంగాన్ని తాకుతుంది. ఒక నవల, ఒక కవిత, ఒక నాటకం.. ఏ రూపమైనా కావచ్చు, కానీ దాని గుండె మానవత్వమే అయితేనే అది పాఠకుడిలో స్పందన కలిగిస్తుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అసమానతలను సాహిత్యం మానవ కోణం ద్వారా మాత్రమే వెలికి తీయగలదు. నిస్పృహ, అసమానత్వం, యుద్ధాలు, వలసలు, పేదరికం వంటి అంశాలను మానవత్వ దృష్టిలో చూపితేనే అవి స మాజానికి అర్థవంతంగా చేరతాయి. మానవత్వం అనేది కాలాతీతమైన విలువ. ఏ యుగంలోనైనా, ఏ భాషలోనైనా, సాహిత్యం దానిని ప్రతిబింబిస్తేనే అది తరతరాలకు నిలుస్తుంది. ప్రపంచ సాహిత్య దృక్కోణంలో మానవత్వంప్రపంచంలో ఎక్కడ రాసినా, గొప్ప సాహిత్యం అన్నింటికీ ఒకే గుండె ఉంటుంది.. అదే మానవత్వం. పేదల దుస్థితి లేదా వలసల బాధలు ప్రతిబింబించే రచనలు పాఠకుడిలో కరుణను కలిగిస్తాయి. అన్యాయానికి వ్యతిరేకంగా నిలిచిన పాత్రలు మనిషి ధైర్యాన్ని గుర్తు చేస్తాయి. ప్రేమ, స్నేహం, త్యాగం ప్రధానమైన కథాంశాలుగా నిలిచినప్పుడు పాఠకుడు తన స్వీయ అనుభవాలతో ఆ రచనను కలిపి చూసుకుంటాడు. ప్రపంచ సాహిత్యంలో ఎన్నో కథలు, నవలలు, నాటకాలు యుద్ధాల క్రూరతను, రాజకీయ దోపిడీని, సమాజపు అసమానతలను చూపిస్తూ, మానవతను ప్రధానంగా నిలబెట్టాయి. ఇవన్నీ కేవలం వినోదం కోసం కాదు, మానవ విలువలను కాపాడేందుకు పుట్టినవే. మానవత్వం లేకపోతే సాహిత్యం ఎందుకు నిర్జీవమవుతుంది? కేవలం కళాత్మక శైలి ఉన్నా, మానవత్వం లేకుంటే అది పాఠకుడి గుండెను తాకే అద్భుత రచనగా నిలవదు. మానవ సమస్యలను గుర్తించని సాహిత్యం సమాజంలో మార్పు తీసుకురాలేదు. మానవ విలువలు శాశ్వతం. అవి లేకపోతే రచన తాత్కాలిక ప్రాధాన్యంతో మిగిలిపోతుంది. ప్రపంచం అనేకానేక సమస్యల ఊబిలో కూరుకుపోయి, మనిషిని మనిషిగా చూడడాన్ని మరచిపోతున్న నేటి కాలంలో సాహిత్యం మానవత్వపు స్వరంగా నిలవాలి. యుద్ధ క్రూరత్వాన్న ప్రతిబింబించే రచనలు సమాజానికి శాంతి విలువను గుర్తుచేస్తాయి. వలస కూలీల అనుభవాలను వ్యక్తం చేసే కథలు మానవ హక్కుల పట్ల చైతన్యం పెంచుతాయి. పేదరికం, ఆకలి, అన్యాయం గురించి రాసిన సాహిత్యం పాఠకులలో బాధ్యతను కలిగిస్తుంది.మానవత్వం లేకుండా సాహిత్యం అనేది శూన్య పదాల సమాహారమే. భావాలను, దయను, కరుణను, న్యాయాన్ని, ప్రేమను కాపాడే శక్తి మానవత్వ సాహిత్యాని కే ఉంది. న్యాయం కోసం పోరాటం.. మానవత్వపు కోణం సాహిత్యాన్ని అన్యాయానికి వ్యతిరేకంగా నిలబెడుతుంది. ప్రేమ, స్నేహం, త్యాగం, సత్యం వంటి విలువలను తరతరాలకు చేరుస్తుంది. మానవత్వ సాహిత్యం కొత్త తరాలను మానవతా దృక్కోణంలో తీర్చిదిద్దుతుంది. యుద్ధ బీభత్సాల నుంచి శరణార్థుల అగచాట్ల వరకూ.. పేదరికం నుంచి యాంత్రిక జీవనం వరకూ మనిషిని మనిషిగా నిలబెట్టలేకపోతున్న అనేకానేక పరిస్థితులను సాహిత్యం ఒక్కసారిగా మార్చేస్తుందని చెప్పడానికి వీల్లేదు. అలాంటి మంత్రదండం ఏదీ రచయితల వద్ద ఉండదు. కానీ, మనుషుల్లో ఆలోచనలను మార్చడానికి, మానవతా విలువలు ఎలుగెత్తి చాటడానికి ఉపయోగపడుతుంది. పేదరికం, ఆకలి, అసమానతలు, వాతావరణ మార్పులు, సాంకేతిక విప్లవం వంటి ఎన్నో అంశాలు మానవ సంబంధాలను దిగజారుస్తున్నాయన్నది కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవం. మానవ హక్కుల ఉల్లంఘనలు కోకొల్లలు. ఈ సమస్యలను అర్థం చేసుకోవడానికి, సమాజంలో అవగాహన కలిగించడానికి, పరిష్కార మార్గాలను సూచించడానికి సాహిత్యం మానవత్వపు కోణాన్ని తప్పనిసరిగా కలిగి ఉండాలి. నేటి కాలంలో, విస్తృతమై, విశ్వవ్యాప్తమవుతున్న డిజిటలైజేషన్ అనే కొత్త వేదికల్లో కూడా మానవత్వమే సాహిత్యానికి మార్గదర్శకం కావాలి. సామాజిక మాధ్యమాల్లో మానవ అనుభవాలను పంచుకోవడం. మానవత్వం అనేది సాహిత్యానికి ఒక తాత్విక పునాది. న్యాయం, సత్యం, సమానత్వం వంటి నైతిక విలువలను కాపాడే మార్గం. మానవ అనుభవాలు ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ఒకే విధంగా ప్రతిబింబిస్తాయి. సాహిత్యం యొక్క అసలు జీవమైన మానవత్వ భావన లేకుండా వచ్చే రచనలు ఒక నిర్మాణం ప్రక్రియగ మాత్రమే. మానవత్వం సాహిత్యానికి శ్వాస. సమాజం ఎంత మారినా, కాలం ఎంత ముందుకు సాగినా, సాహిత్యం మానవత్వం అనే విలువను కాపాడాలి. అదే దాని స్థిరత్వం. అదే దాని మహత్తు. సాహిత్యంలో మానవత్వ కోణం అవసరం కాదు.. అది మాత్రమే సాహిత్యానికి ఆత్మ.

**– సత్యశ్రీ**


## మర్మాలను ఇముడ్చుకున్న 'మాయన్ కోడెక్స్'


మాయన్ నాగరికత ఇప్పటికీ ఒక సరైన వివరణ లేని ప్రహేళికే. ఈ నాగరికతకు సంబంధించిన కీలక అంశాలను ప్రతిబింబించే 'కొడెక్స్' ఎన్నో మర్మాలను ఇముడ్చుకున్నాయి. కొలంబియన్ నాగరికతకు ముందే మాయా నాగరికత విరాజిల్లింది. అప్పటి మాయన్ భాషా హైరోగ్లిఫ్ లిపిలో రూపొందించిన మేయో అమెరికన్ బార్క్ పేపర్‌పై ముడతలు పడిన పుస్తకాలలోని అంశాలను 'మాయన్ కొడెక్స్'గా పేర్కొంటారు. ఈ పుస్తకాలను మాయన్ ప్రజలు ఉపయోగించిన ఒక ముఖ్యమైన భౌతిక రికార్డింగ్ విధానంగా పేర్కోవచ్చు. ఈ పుస్తకాలు మాయా నాగరికత జ్ఞాపకాల పేటికను తెరుస్తాయి. 11వ శతాబ్దం నుంచి 15వ శతాబ్దం మధ్య ఈ పుస్తకం మాయా లేఖకులు వ్రాసిన సంక్లిష్టమైన అక్షరరూపాలను, రంగులమయమైన చిత్రాలను సంరక్షిస్తాయి. శతాబ్దాల తరబడి రంగులను నిలుపుకునేలా నిమ్మరసం పూతపూసిన చెట్టు బెరుడులపై వీటిని చిత్రించారు. పురాతత్వ పరిశోధకులు గుర్తించిన పుస్తకాలకు సంబంధించిన వివరాలను విశ్లేషించి ప్రయత్నాలు ఇప్పటికీ కొనసాగుతునే ఉన్నాయి. ఇలాంటి ఒక ఈ పుస్తకం పక్కనే ఒక మట్టి విగ్రహం కూడా ఉంది. బహుశా అది లేఖకుడు లేదా యాజకుడికి సంబంధించినది కావచ్చు. ఆలోచనలో నిమగ్నమైనట్టు కనిపిస్తున్న కారణంగా, సదరు వ్యక్తి ఒక గొప్ప రచనకు మనసులోనే రూపకల్పన చేసుకుంటున్నాడని అనుకోవచ్చు. కాగా, మాయన్ కొడెక్స్‌లో అప్పటికే ప్రచారంలో ఉన్న ధార్మిక, రాజకీయ, ఖగోళశాస్త్ర సంబంధిత సమాచారం, ఇతిహాసాలు, కాలగణన, జ్యోతిష్యం, దేవతల గురించిన వివరాలను వివరించారు. సంస్కృతిని చిత్రీకరించారు. మాయన్లు కొడెక్స్‌ను అధిక శ్రద్ధతో, చెట్ల బెరడులపై తీర్చిదిద్దినట్టు కనిపిస్తున్నది. ప్రత్యేకమైన అడవి చెట్టు నుండి ఈ బెరడును తీసి ఉంటారని, అందుకే ఇది ఇప్పటికీ శిథిలం కాలేదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఈ మాయన్ కొడెక్స్ ప్రాచీన మాయన్ నాగరికత యొక్క విలువైన ఆనవాళ్లుగా, మాయన్ జ్ఞానానికి, సంస్కృతికి చారిత్రక ప్రాముఖ్యతకు సజీవ రూపాలుగా విరాజిల్లుతున్నాయి. ఈ పుస్తకాల ప్రాచీన అనేక ప్రతులు వివిధ మ్యూజియాలలో సంరక్షించబడున్నాయి. మాయన్ నాగరికకు సంబంధించిన ప్రాచీన రచనలు, చారిత్రక, మత సంబంధ విషయాలు మడతలుగా రాసిన ఈ పుస్తకాలు ముమ్మాటికీ చారిత్రక నిధులే. ఈ పుస్తకాల్లోని ప్రతి పేజీ దేవతల, ఆచారాల, ఖగోళ గమనాల క్రమపట్టికను వెలికితీస్తుంది. మాయా ప్రజలు, విశ్వం మధ్య ఆగని సంభాషణలుగా, వరుసలలో నడిచే ఆకృతులు, సంకేతాలు వర్షదాతల, మొక్కజొన్న చక్రాల, సూర్యుని పరిభ్రమణ గాథలు పేర్కొంటున్నాయి. మాయన్ నాగరికతలో రాయడం ఒక ప్రార్థన. చదవడం ఒక దివ్య జ్ఞానం. ఎన్నో చేతులు ఈ పుటలను తిప్పి ఉంటాయి. నక్షత్రాల నృత్యంలో దాగిన కాలపు లయను వెతికి ఉంటాయి. ఏదిఏమైనా మాయన్ చరిత్ర నేడు నాగరికత హృదయం నుంచి సాగిపోయిన స్మృతిగా మారింది. అరుదైన కొడెక్స్ ఒక కనుమరుగైన లోకం జ్ఞాపకం స్వరూపం. వీటిలో రసాయాన మర్మమే కాదు... నాటి నాగరికత ఘనకీర్తి కూడా దాగి ఉంది.



## చదవాల్సిన పుస్తకం

### దేశ విభజనను కళ్లకుకట్టే 'మిడ్‌నైట్స్ చిల్డ్రెన్'



అత్యంత కల్పలా శక్తితో నిండిన నవలల్లో ప్రధానంగా పేర్కోదగినది సల్మా న్ రష్దీ రచించిన 'మిడ్నైట్స్ చిల్డ్రెన్' (అర్ధరాత్రి పిల్లలు లేదా అర్ధరాత్రి యొక్క పిల్లలు). 1981లో ప్రచురితమైన ఈ నవల సలీమ్ సినాయ్ అనే బాలుడి కథ వివరిస్తుంది. అతను 1947, ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి, బ్రిటిష్ పాలన నుండి భారత్ స్వాతంత్ర్యం పొందిన క్షణంలోనే జన్మిస్తాడు. అంటే, పాకిస్తాన్, భారత్ స్వాతంత్ర్య దినోత్సవాలకు అతను ప్రతినిధి. స్వాతంత్ర్యం సిద్ధించిన మొదటి గంటలో పుట్టిన ప్రతి చిన్నారిలో ఒక అద్భుతమైన శక్తి దాగి ఉంటుందని, వారి మధ్య మర్మమైన ఒక సంబంధం ఉంటుందని సలీమ్ గ్రహిస్తాడు. అతనికి టెలిపతీ శక్తి ఉంటుంది. అంటే, దూరంగా ఉన్నవారి ఆలోచనలను వీరు గ్రహించగలుగుతారు. వారి గురించి తెలుసుకోగలుగుతారు. ఈ శక్తితోనే అతను తన మాదిరిగానే ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి పుట్టిన పిల్లల ఆలోచనలను వినగలుగుతాడు. వారి గురించి తెలుసుకోగలుగుతాడు. కొత్త భారతదేశం ఆశలు, పోరాటాలను వారంతా ప్రతిఫలిస్తారు. దేశం రాజకీయంగా మారుతున్నప్పుడు, విభజన, యుద్ధాలు, ఎమర్జెన్సీ పరిస్థితిని ఎదుర్కొంటుంది. సలీమ్ జీవితం కూడా దాదాపు అలాంటి మార్పులనే ప్రతిబింబిస్తుంది. అతని వ్యక్తిగత కథ భారతదేశపు పయనానికి ప్రతీకగా నిలుస్తుంది, అందులోని అందం, కలకలం, వేదనలతో సహా ప్రతి అంశం భారత దేశ ప్రస్థానంతో పోల్చుకోవచ్చు. ఈ నవల చరిత్రను, కల్పితాన్ని, వ్యంగ్యాన్ని ఒక ప్రత్యేక శైలిలో పూర్ణంగా మిళితం చేస్తుంది. రష్దీ తన కథలో మ్యాజికల్ రియలిజంను ఉపయోగించి వ్యక్తిత్వం, జ్ఞాపకం, జాతీయత, చరిత్ర భారాల వంటి అంశాలను అన్వేషిస్తాడు. సలీమ్ జీవితంలోంచి ఆయన చూపేది ఏమిటంటే, వ్యక్తుల జీవితాలు గొప్ప రాజకీయ సంఘటనల ద్వారా ఎలా మలచబడతాయో, అలాగే జ్ఞాపకం ఒకప్పుడు శక్తివంతమైనదిగా, విశ్వసనీయంకానిదిగా కూడా ఉండగలదని. ఒక బరువైన అంశాన్ని, కీలకమైన పరిణామాలను మర్మగర్భంగా రష్దీ వివరించిన తీరు అద్భుతం. అందుకు ఇది తప్పక చదవాల్సిన పుస్తకాల జాబితాలోకి చేరుతుంది.

## ఎంత దిగజారితే అంత గొప్ప భాష!

భాష ఎంతగా దిగజారిపోతే అంత గొప్ప అనుకునే దుస్థితి. ఒకప్పుడు పలకడానికి కూడా మొహమాటపడే పదాలు ఇప్పుడు విరివిగా ప్రచారమవుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అంతా నిర్లజ్జగా, నిస్సంకోచంగా వాడేస్తున్నారు. ప్రైవేటు చానెల్స్ వచ్చి తెలుగు భాషను కొంత భ్రష్టు పట్టిస్తే, సోషల్ మీడియా ఉన్న కొద్దిపాటి విలువల వలువలను కూడా తీసేస్తున్నది. కొన్ని సినిమాలు... సీరియళ్లు... కార్యక్రమాల్లో వాడే భాష వింటే అసలు ఇది తెలుగేనా అనే అనుమానం వస్తుంది. అది ముమ్మాటికీ తెలుగుకాదు.. పైశాచిక భాష. పీక్కోవడాలు.. గోక్కోవడాలు భాష కిందే చెలామణి అవుతున్నాయి. ఇప్పుడు వస్తున్న చాలా సినిమాల్లో, అత్యంత మామూలుగా వాడుతున్న ఎన్నో పదాలు నిన్నమొన్నటి వరకూ సభ్య సమాజంలో ఉచ్ఛరించడానికి నిషిద్ధాలు. ప్రత్యేకించి తెలంగాణలో కొన్ని అసభ్యకరమైన పదాలను సామాన్యంగా ఉపయోగించరు. ఇప్పుడవి ఎలాంటి సంకోచం లేకుండా వాడుకోవడానికి అన్ని మాధ్యమాలు పోటీపడి మరీ వీలు కల్పిస్తున్నాయి. నిజానికి భాషణ, బోధన, ఆలనా, పాలనా అనేవి భాషకి నాలుగు చక్రాలు. తెలుగునాట అవేందుకో మొరాయించాయి. తలా ఒక చెయ్యి వేసిముందుకు నడిపించకపోతే, భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. పదాల ఎంపిక నుంచి ఉచ్చారణ వరకూ అడుగడుతునా నిర్లక్ష్యమే కనిపిస్తున్నది. 'ఏరా బూతులు మాట్లాడుతున్నావ్... దెబ్బలు తింటావ్ జాగ్రత్త' అని ఓ తండ్రి అంటే, 'నేను సినిమా పాట పాడుతున్నా' అన్నాడట ఓ పిల్లవాడు. నాలుగు గోడలకు పరిమితమయ్యే పదాలు పిల్లల నోళ్లలో నానే రీతిలో సినిమాలు ఉంటున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడు. హాస్యం పేరుతో తెలుగు చానెళ్లలో కురుస్తున్న బూతు అంతాఇంతా కాదు. ఆ దిక్కుమాలిన కార్యక్రమాలకు చూస్తూ, పళ్లు ఇకిలించుకుంటూ, పిచ్చి పిచ్చి వ్యాఖ్యానాలు చేసే సెలబ్రిటీలు... ఇంగ్లీషు, ఉర్దూ పదాలు వాడడం తప్పుకాదు. జనబాహుళ్యానికి అర్థమవడానికి ఇతర భాషలకు చెందిన కొన్ని పదాలు తప్పనిసరి అవుతాయి. కానీ, ఇంగ్లీషు వాళ్లు కూడా వాడడానికి ఇబ్బందిపడే పదాలను యాంకర్ యమకింకర్లు అలవోకగా వాడుతున్నారు. రాయడం సభ్యతకాదు.. వివరించడం ఉచితం కానేకాదు కాబట్టి అలాంటి పదాలు వాడడం లేదు. ఈ 'భాషాదురాక్రమదారులు' పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ, భాషను శక్తి వంచన లేకుండా అవమానిస్తూ, రాక్షసానందం పొందుతున్నారు. మనకి ఇంగ్లీషు వచ్చు అనుకుంటున్నాం.. కాని రాదు... తెలుగు రాదనుకుంటున్నాం, కానీ వచ్చు.... ఇంగ్లీషులో మనం మాట్లాడుతున్నామంటే దాని అడుగున లేదా మనస్సు పొరల్లో తెలుగు ఉంది. తెలుగు భూమికగా మన ఇంగ్లీషు సాగుతుంది. అందుకే మాతృభాష ఎక్కడికి పోదు. ఈ విషయాన్ని గమనించకుండా మనమంతా మూకుమ్మడిగా తెలుగు భాషకు అపచారం చేస్తునే ఉన్నాం. తెలుగు జాతికే ఇది అవమానం. నిజమో కాదో మీరే ఆలోచించుకోండి.

## ఈ వారం కవితలు

### దీనినేమంటారు?

అధికారం అతి కారమవుతుంది
ధిక్కారాన్ని నియంత్రించడానికి
తైనాతీలను నెత్తికెక్కించుకుని
మాట వినని వారి నెత్తిన
మేకులు కొడుతుంది

అవసరాలకు ఆదుకోదు సరికదా
పరిసరాలను అనుకూలంగా
మలచుకుంటుంది తప్పెవరు చేసినా
దండించాలంటూనే తన తాబేదార్లను
కాపాడుకుంటూనే వుంటుంది

చెప్పినట్లు నడుచుకోమంటూ ఆదేశాలిస్తూనే
తను చేసినట్లు చేస్తే ప్రత్యక్ష దాడిచేస్తుంది
నీతిని పాతాళలోకంలో పాతిపెట్టి
'అంతూలే'ని మించిన అంతులేని
సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటుంది

ఈ దేశంలో వామపక్ష రాజకీయ పక్షాలు తప్పితే
మిగతా జాతీయ, ప్రాంతీయ పార్టీలు
అన్నీ ఒకే తాను గుడ్డపేలికలే
జెండా రంగుల్లో... కనీసమొకటైనా
పోలిక కలిగివుండటమే కాక
వారి వారి సిద్ధాంతాలు ఏమైనా
అధికారంపైనే మమకారం
హెచ్చుగానే పోషిస్తాయి

అందుకు కలబడడానికైనా కలిసిపోడానికైనా
ఏ సంస్కారమూ అడ్డురాదు
ఏ సందర్భమూ వదిలి పెట్టవు
ఇక్కడ తిట్టి అక్కడ పొగడటానికి
సిగ్గు పడవు ఎందుకంటే
వారికి భజన పరులు అవసరం
జనుల అవసరాలు అనవసరం.

ప్రజాస్వామ్య రాజ్యమనేది పైతొడుగు
అంతర్గతంగా నియంతృత్వమే
కరుడుగట్టిన విధానం.
ప్రశ్నించడం సహించరు
తిరగబడితే వెంటబడి
బడితపూజకు సిద్ధమౌతారు.

ఆర్థిక నేరగాళ్ల కొమ్ముకాస్తూ
దేశాలు దాటిస్తారు
సామాన్యుడు బాకీపడితే
తోలువలిచి తాటతీస్తారు
ఇదేమి ప్రజారాజ్యం?
ప్రజాస్వామ్యమంటారా?

**కపిల రాంకుమార్,**
**9849535033**

### బొట్లు రాల్చే గెల


నిన్న మొన్నటి కథ కాదు
ఆకాశాన్నంటిన చెట్టు నేలపై వున్నప్పటి నుండి
నాలోని జిజ్ఞాస దాన్ని కొసేదాకా చూడాలనే
చూస్తూనే వున్నా నాటి నుండి నేటి దాకా గీస్తూ
మేఘాలకు చిల్లు పడ్డట్టు
జల జల రాలే చినుకులు నన్ను ఆపవు
కోడి కూయక ముందే
నా ఆయుధాలతో పయనం వనంలోకి
సంధ్య రాకమునుపే నేను ఎక్కి దిగేస్తా
లొట్లల్లో నురుగులు కక్కే నా కష్టార్జితం
నా కుటుంబం ఆకలి తీర్చే పానకం

ముస్తాదు నా మాదిగ చేతిలో శిల్పం
కొడవళ్ళు కొలిమిలో పదును తేల్చే కమ్మరి
పలు ఆకారాల లొట్లు కుమ్మరి చక్రంపై గిరగిరా
ఉమ్మడి వృత్తుల మేళవింపు నాఅమ్ముల పొది
వనంలో పొద్దాడు పరుపు తాడు పండు తాళ్ళు
గెలల గీత గీతకి వైవిధ్యం

గీత సమయంలో సైతం విశిష్టత నేనెరుగు
జిహ్వను తాకే విభిన్న రుచులు నా నేర్పరితనమే
నాలుగు చెట్ల లోగిలి
సకల సామాజికాంశాల చర్చా వేదిక
వూర్లోని పంచాయితీలు సేదతీరే చోట పరిష్కారం దొరకగా తేలిక పడే మనసులు
మందువా లో

వూర్లో జరిగే ఏ వేడుకైనా
లొట్టి వంచనిదే సంబరం సాగదు
ఇంటి వసారాలో తగిలించిన లొట్టి
గల ఇంటికోసం వెతికే అతిథులు
అంతటి మధురం ఆ కల్పవృక్షం
అందించే పానీయం

ప్రపంచం మొత్తం తిరుగుతూ
వ్యాపారం పల్లెల్లోకి జొరబడి వృత్తులనే చిదిమింది
బెల్ట్ షాపుల పుణ్యమా అని పారే మద్యం
నా నేలలో తస్కరించిన నీటిలో ఏవేవో కలిపేసి పల్లె
దాకా పంపిన రంగు నీళ్ళ బహుళజాతి దందా
ఒడిసిన కల్లుకి వినియోగదారుల్లేక విలవిల
నేను మాత్రం నా చెట్టును విడవను
చైతన్యం విరిసిన నాడు
రంగు రంగుల నీళ్ళ దందా అట
కెక్కు
మద్యంలోని మర్మం ఎరిగి
అసలుసిసలైన ఉట్టే కల్లు
బొట్టు కోసం వనం వైపు
అడుగులు పడు
అదేమీ అత్యాశ కాదు కదా!
గీత కార్మికుడినైన నేనూ మనిషినే!!



**గిరి ప్రసాద్ చెలమల్లు**
**9493388201**

## కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు అఖిల్ కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపతున్న విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుపుకున్న పరిగి ఎమ్మెల్యేరామ్మోహన్‌రెడ్డి స్థానికి నాయకులతో కలిసి అఖిల్ గృహంకు వెల్లి మరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం తీసుకోని త్వరగా కోలుకోవలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి ,మాజీ యాదయ్యగౌడ్ ,శ్రీకాంత్‌రెడ్డి , రాములు నరేష్ తదితరులు పాల్గోన్నారు.

## ప్రశంసాపత్రం అందుకున్న డాక్టర్‌కు అభినందనలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ బస్తీ దవాఖానాలో అత్యుత్తమ సేవలందిస్తున్న కుషాయిగూడ కు చెందిన ఆడబిడ్డ డాక్టర్ శైలజకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు యాదయ్య కూతురు డాక్టర్‌గా సేవలందిస్తు ఉత్తమ ప్రశంసాపత్రం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాగుల వాసు దేవ ముదిరాజ్, ఆర్.వెంకటేశ్వర్లు, వెంకటేష్, దయానంద్, రాజుముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## 19న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పర్యటన

**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలో ఆగస్ట్ 19న బిజెపి రాష్ట అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పర్యటిస్తారని, వికారాబాద్ అసెంబ్లి కోఆర్డినేటర్ వడ్ల నందు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను పరామర్శించడానికి వస్తున్నారని తెలిపారు. ఏ ఒక్క ప్రజాప్రతినిధి సందర్శించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పెన్షన్లు పెంచి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ ,పాండు తదితరుల పాల్గొన్నారు.

## నేడు అంబు రామేశ్వర జాతర ఉత్సవాలు

**ప్రజాపక్షం/తాండూర్ :** తాండూర్ నియోజకరవ్గంలోని పెద్దేముల్ మండల పరిధిలోని తట్టేపల్లి అటవీ ప్రాంతంలో వెలిసిన శ్రీ అంబు రామేశ్వర స్వామి జాతర ఉత్సవాలు సోమవారం జరుపుకోన్నారు. జాతర ఉత్సవలను పురస్కరించుకొని అంబురామేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ వుడవల్లి వెంకట్ ,పాలకవర్గం సభ్యులు అంజయ్య తదితరులు ఏర్పాట్లును పూర్తి చేశారు. ప్రతి సంవత్సరం శ్రామణం మాసం చివరి సోమవారం అంబు రామేశ్వర స్వామి జాతర జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది, జాతర ఉత్సహాలలో భాగంగా శ్రీ అంబురామేశ్వర్‌స్వామి విగ్రహ పల్లకి సేవ ఆదివార సాయత్నం తట్టేపల్లి నుండి భక్తులు ఆటపాటల మధ్య అత్యంత భక్తుల ఆలయం వరకు పల్లకి సేవ కొనసాగించారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలిసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## జల దిగ్బంధంలో ఏడుపాయల ఆలయం

**మెదక్ :** ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా సింగూరు ప్రాజెక్టు నుంచి 5 గేట్లు ఎత్తి 50వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది.



దీంతో మెదక్ జిల్లా నాగ్సాన్‌పల్లి గ్రామ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల శ్రీ వనదుర్గా భవాని మాత ఆలయం గత నాలుగు రోజులుగా పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆదివారం నాటికి నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగి,ఏడుపాయల గుండా పొంగిపొర్లడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. ప్రధాన ఆలయం లోపలికి వరద నీరు చేరింది. భక్తులు దర్శనం చేసుకోవడానికి వీలు లేకపోవడంతో అధికారులు తాత్కాలికంగా ఆలయాన్ని మూసివేశారు. ప్రస్తుతం భక్తులు ఆలయ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ప్రధాన ఆలయం ముందు ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా నది దృశ్యాలను భక్తులు చూసి ఆశ్చర్యపోతున్నారు. భద్రత చర్యల్లో బాగంగా ఏడుపాయల పరిసర ప్రాంతాల్లో పోలీసులు బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నది పరిసరాలకు ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# విద్యతోనే సమాజానికి సేవచేసే దృక్పథం సాధ్యం

ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** విద్యతో సమాజానికి సేవచేసే దృక్పథాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి, రాజీవ్‌గాంధీ నగర్‌లో గల బివిఆర్ ఐటి ఇంజనీరింగ్ కళాశాల ఫర్ ఉమెన్స్‌లో పదవ పట్టభద్రుల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి విచ్చేసి 573 మంది విద్యార్థినులకు పట్టాలను అందజేశారు. ముందుగా పట్టభద్రుల శోభాయాత్ర జరిగింది.

ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ రతన్ టాటా మాటలను గుర్తుచేశారు. ఒక నిమిషం మీ జీవితాన్ని మార్చలేకపోవచ్చు కాని ఆ నిమిషాన్ని మీరు ఎలా వినియోగిస్తారో అది మాత్రం మీ జీవితాన్ని మార్చగలదని అన్నారు.

విద్య అనేది కేవలం డిగ్రీ సాధనకే పరిమితం కాదని, ఆలోచనా విధానం మరియు సమాజానికి సేవచేసే దృక్పథాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కెవి విష్ణు రాజు మాట్లాడుతూ పట్టా అనేది అంతిమ గమ్యం కాదని, నూతన ప్రయాణానికి ఆరంభమని, విద్యార్థినులు నేర్చుకున్న జ్ఞానాన్ని సమాజంకోసం వినియోగించాలని సూచించారు. ఎక్కడ ఉన్నా ఏ పని చేసినా మీలోని విలువలు, నైతికతలు తగ్గకూడదని అన్నారు. వృత్తి జీవితం, వ్యక్తిగత జీవితం రెండింటిని సమతౌల్యంగా నిర్వహించడం ఎంతో ముఖ్యమని విద్యార్థినులకు సూచించారు.



కళాశాల ప్రిన్సిపల్ సునీత ఆధ్వర్యంలో విద్యార్థినులచే పట్టభద్రుల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వేదిక్ రిక్రూట్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ డైరెక్టర్ డాక్టర్ బి. రవీంద్ర బాబు, కళాశాల ప్రిన్సిపల్ కెవిఎన్ సునీత, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నా రు.



## సిఐగా బాధ్యతలు చేపట్టిన బాలస్వామికి శుభాకాంక్షలు

టిటిడిపి అధ్యక్షులు వేముల సంజీవ గౌడ్

**ప్రజాపక్ష/ఘట్‌కేసర్:** పోలీస్ స్టేషనలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ బాలస్వామిని టిటిడిపి ఘట్‌కేసర్ మున్సిపల్ అధ్యక్షులు వేముల సంజీవ గౌడ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంజీవ గౌడ్ మాట్లాడుతూ తమరి విధి నిర్వహణలో తమ వంతుగా మీకు తోడ్పాటును వేల్లా వేళలో అందిస్తామని ప్రజలకు మనోధైర్యాన్ని భద్రత భరోసా కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ పి. సురేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ టి.మహేష్, పోచారం మున్సిపాలిటీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 'మార్వాడీ గో బ్యాక్' ఉద్యమంపై
# దృష్టి సారించిన నిఘా వర్గాలు

నేడు ఆమన్‌గల్‌కు పిలుపునిచ్చిన ఉద్యమకారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమాలతో ఏర్పడిన కొత్త రాష్ట్రానికి మరో కొత్త తలనొప్పి వచ్చి పడింది. పక్షంరోజుల నుంచి 'మార్వాడి గో బ్యాక్' అనే నినాదం రాష్ట్రంలో వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో మార్వాడీలు ఎస్‌సి యువకుడిపై దాడికి తెగబడడం, మరోపక్క మార్వాడీలకు వ్యతిరేకంగా ఆమన్‌గల్లులో స్థానిక వ్యాపారులు నేడు బందుకు పిలుపు నివ్వడం పలు విమర్శలకు దారి తీస్తుంది.

రాష్ట్రంలో పురుడు పోసుకుంటున్న ఈ కొత్త ఉద్యమంపై ఇంటెలిజెన్స్ వర్గాలు అప్రమత్తమయ్యా యి. ఈ నినాదం ఉద్యమంగా మరుతుందా, ఈ ఉద్యమం బలోపేతమైతే రాష్ట్రంలో దారితీసే పరిస్థితులపై నిఘా వర్గాలు తర్జనబర్జన పడుతున్నారు. ఈ ఉద్యమం వెనుక ఎవరైనా ఉన్నారా లేదా మార్వాడీ వ్యాపారులపై ప్రజల్లో ఒకరకమైన చెడు అభిప్రాయం ఏమైనా ఉందా అనే ఆలోచనలో పడ్డారు. ఈ ఉద్యమం పై ఆరా తీసేందుకు నిఘా వర్గాల అధికారులు రంగంలోకి దిగినట్లు సమాచా రం. మరో పక్క నేడు ఆమన్‌గల్‌లో వ్యాపారులు బంద్‌కు పిలువు ఇవ్వడంతో ఎలాంటి దాడులు జరగకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తు చర్య లు తీసుకున్నారు. అదనపు పోలీసు బలగాలను ఆమన్‌గల్‌కు తరలించారు. నిఘా వర్గాలు కూడా దీనిపై మరింత దృష్టి సారించాయి. ఈ కొత్త నినాదంపై బిజెపి, కాంగ్రెస్ పార్టీల బడా నేతలు కూడా స్పందించారు. కొందరు నేతలు మార్వాడీలకు మద్దతు తెలపగా మరికొందరు వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఎస్‌సి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి మరో అడుగు ముందుకేసి ఏకంగా మార్వాడీలకు వార్నిం గ్ ఇచ్చారు. రాష్ట్రం లో ఒక్క కొత్త షాపు పెట్టినా ఊరుకోమని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితోనే 'మార్వాడీ గో బ్యాక్' ఉద్య మం చేపడతాం అని కీలక ప్రకటన చేశారు.

తెలంగాణను వదిలివెళ్లే వరకు వారికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని అన్నారు. మార్వాడీ వ్యాపారులు జిఎస్‌టిలు కట్టరు.. బిల్లు ఇవ్వ రు.. ఇక్కడ డబ్బులు దండుకొని గుజరాత్, రాజస్థాన్కు వెళ్తారని హాట్ కామెంట్స్ చేశారు. మార్వాడీల చందాలతో బిజెపి బతుకుతోంది. అందుకే బండి సంజయ్ వారికి మద్దతు ఇస్తున్నారని హాట్ కామెంట్స్ చేశారు. సోమవారం నాటి ఆమనగల్ బంద్‌తో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు.

ఇదిలా ఉంటే.. 'గో బ్యాక్ మార్వాడీ' అంటూ కొనసాగుతున్న ప్రచారం బాగా వైరలవుతున్నది. ఇటు సామాజిక ఉద్యమకారులు, అటు రాజకీయ పార్టీ నాయకుల కూడా స్పందిస్తుండటంతో ప్రజల్లో కూడా చర్చ నడుస్తున్నది. ఈ పరంపరలో 'మార్వాడీ వ్యాపారులు గో బ్యాక్' అంటూ ఈ నెల 18న రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో స్థానిక వ్యాపారవర్గాల వారు బంద్‌కు పిలుపునివ్వడంతో ఈ అంశం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

వారం రోజుల నుంచి ఈ నినాదంపై సోషల్ మీడియాలో అనుకూలంగా, వ్యతిరేకంగా పోస్టు లు కుప్పలు తెప్పలుగా పెడుతున్నారు. సోషల్ మీడియా వారియర్స్ ఏకంగా మార్వాడీ గో బ్యాక్ నినాదంపై చర్చలే పెట్టారు.

## 18న సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో వాహనాల వేలం

**బేగంపేట్:** వివిధ కేసులలో పట్టుబడిన తొమ్మిది ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్టు సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీన ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ వేలం పాటు ఉంటుందని, ఎక్సైజ్ సూపరింటెంట్ జి పంచాక్షరి సమక్షంలో ఈ వేలం పాటు కొనసాగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్ కార్డ్ కాపీ, పాన్ కార్డ్ కాపీతో పాటు.. రూ.25 వేల నగదుతో, లేదా డీడీ రూపంలో ముందుగా జమ చేసి వేలంలో పాల్గొనాలని చెప్పారు.

వేలం పాటలో వాహనం పొందని వారికి ఈ నగదు తిరిగి చెల్లించబడుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు 87126 59644 నెంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

కొడంగల్ టూ హైదరాబాద్ రెఫర్


# కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో పిచ్చికుక్కల స్వైర విహారం

## ఆరుగురికి తీవ్రగాయాలు

**ప్రజాపక్షం/ కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో పిచ్చి కుక్కల స్వైర విహారంతో ఆరుగురికి తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌కు తరలించారు. పూర్తి వివరాల్లోకి వెళితే కొడంగల్ పట్టణంలో రోజు మాదిరిగానే మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఉదయం 5 గంటల ప్రాంతంలోవిధులకు హజరుఅయ్యేందుకు రాగా మున్సిపల్ కార్యాలయ గేట్ ముందుపడుకున్న ఓ కుక్క అనంతయ్య అనే కార్మికుడిపై విరుచుకుపడి తీవ్రంగా గాయపర్చడం జరిగింది. విషయం గమనించిన తోటి కార్మికులు కుక్కను పట్టుకునేందుకు ప్రయత్నం చేయగా అక్కడి నుంచి పారిపోయిన కుక్క కార్గిల్ కాలనికి చెందిన కుర్మయ్య అనే వ్యక్తిని అతికిరాతకంగా దాడిచేసి ప్రాణాలుపోయేంత దాడి చేసి గాయపర్చడం జరిగింది. దీంతోపాటు కిష్టప్ప, బాబ్యానాయక్, లక్ష్మమ్మ, వెంకటయ్యలకు కూడా కుక్కలు కరిచినట్లు కొడంగల్ ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బంది తెలిపారు. అదేవిధంగా గత వారంరోజుల



క్రితం పద్మమ్మకు కూడా కుక్కలు కరవడంతో ప్రస్తుతం ఆమే చికిత్స పొందుతున్నారు. అదేవిధంగా మరోముగ్గురిపై కుక్కలు దాడి చేయగా వారు నేరుగా తాండూర్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లినట్లు విశ్వసనీయసమాచారం. దీంతో పట్టణ ప్రజలు భయాందోళనలకు గురై తమ ఇండ్లలోని పిల్లలను బయటికి వెళ్లనివ్వకుండా ఇండ్లకు తాళాలు వేసుకున్నారు.భయటికి వస్తే చాలు కుక్కలు బాబోయ్ అంటు భయాందోళనలకు గురి అవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి కుక్కల బెడద



నుంచి కొడంగల్ ప్రజలను రక్షించాలని వేడుకుంటున్నారు. కుక్కల గాయాలపాలైన క్షతగాత్రులు ప్రస్తుతం హైద్రాబాద్‌లో చికిత్స పోందుతున్నారు.

**పరిగి :** వికారాబాద్ జిల్లాలో కుక్కల పరిగి మున్సిపల్ లో అగస్టు నెలలోనే 250మందిని కుక్క కటుకు గురైనాట్లు తెలుస్తుంది. ఆదివారం పరిగిలో 17మందిని ,తాండూర్ నియోజకవర్గంలోని బషీరాబాద్‌లో నాలుగురిని కుక్క కాటుకు గురైనట్లు భాదితతులు తెలిపారు. జిల్లా వ్యప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్క కాటుకు మందులో అందుబాటులో లేకపోవడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పరిగి మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ .మాజీ ఎంపీపీ కరుణం అరవింద్‌రావు , భాస్కర్ తో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్యులను అడుగ తమ దగ్గర కుక్కకాటుకు తగిన మందులు లేవని తెలిపారు.పై అధికారులను ఫోన్లో సంప్రదించగా వారు నిర్లక్ష్యంగా స్పందిచాడం జరిగింది అని తెలిపారు.



అయన మాట్లాడుతూ కుక్కకాటుకు మందులు లేకపోవడం అనేది ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం అని తెలిపారు.

## యాదాద్రికి పోటెత్తిన భక్తులు

**యాదగిరిగుట్ట :** తెలంగాణ తిరుపతి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం, ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి, అమ్మవార్ల శీఘ్రదర్శనం 4 గంటలు, అతిశీఘ్రదర్శనం 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. యాదగిరిగుట్ట కొండపైన దర్శన క్యూలైన్లతో పాటు ప్రసాద విక్రయ కేంద్రం, శివాలయం, పలు కూడళ్లలో భక్తుల సందడి నెలకొంది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారితో పాటు యాదాద్రి కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..** శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.58,05,696 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,02,550, బ్రేక్ దర్శనం ద్వారా రూ.5,49,300, వీఐపీ దర్శనం ద్వారా రూ.11,25,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,66,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,43,980, ప్రసాద విక్రయం ద్వారా రూ.19,89,310, కల్యాణకట్ట ద్వారా రూ.1, 20, 000 తో పాటు వివిధ శాఖ, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## మూల మలుపులు..రోడ్డు పక్కనే బావులు..
# ప్రమాదాలకు నిలయాలు

- ★ పట్టింపులేని పాలనా యంత్రాంగం
- ★ నెత్తురోడుతున్నా స్పందించని ఖాకీలు, ఆర్ అండ్‌బి అధికారులు
- ★ మూల మలుపులు, రోడ్డు పక్కన ఉన్న బావుల వద్ద హెచ్చరికల బోర్డులేవీ..?

**ప్రజాపక్షం/అక్కన్నపేట:** ప్రజల రక్షణను గాలికొదిలేసినవైనం..ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ లేదన్న తీరు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్‌లో నెలకొంది.ఒక వైపు ప్రధాన రహదారుల మూల మలుపులేమో.. మృత్యు మలుపులతో స్వాగతిస్తున్న తీరు..మరోవైపు రోడ్డు పక్కనే రక్షణ గోడ లేని బావులు దర్శనమిస్తుంటాయి.హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని ప్రధాన రోడ్డుతో పాటు పలు గ్రామాలకు వెళ్ళే మార్గాల్లో ప్రమాదకర మూల మలుపులతో పాటు రోడ్డు పక్కన ఉన్న బావుల వద్ద రక్షణ గోడలు,హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

బీటీ రోడ్డు కావడంతో వాహనదారులు దూసుకుపోతున్నారు.ఆదుపు తప్పితే ప్రమాదం పొంచి వుంది.ఇలాంటి ప్రమాదం పొంచి వున్న తీరును నిత్యం గస్తీ చేసే పోలీసులు,పంచాయతీరాజ్ శాఖ అధికారులు గమనించడం లేదా..? లేక మాకేందుకు లే..అనుకుంటున్నారేమో మరీ..! ఈ సమస్య తమ పరిధిలోకి రాదనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు స్థానిక పోలీసులు. ప్రమాదాలు జరిగాక స్పందించడం కన్నా ప్రజా సమస్యలను ముందస్తుగా గుర్తించి రక్షణ






చర్యలు తీసుకోవాలి.కానీ సంబంధిత శాఖల అధికారులు ప్రమాదాలు సంభవించాక స్పందించి చేతులు దులుపుకుంటారు.ఆలోపు జరిగే తీవ్రతకు ఎవరు మూల్యం చెల్లిస్తారు.గతంలో అక్కన్నపేట ఎస్‌ఐగా పనిచేసిన భానోతు పాపయ్యనాయక్ తన కారును తనే డ్రైవ్ చేస్తూ కరీంనగర్ వెళ్లే మార్గంలో చిన్నములుకనూర్ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న బావుల వద్ద రక్షణ గోడలు,హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో కారుతో సహా బావిలో పడిపోయి రిటైర్డ్ ఎస్‌ఐ పాపయ్యనాయక్ ప్రాణాలు కోల్పోయాడు.అక్కన్నపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మూలమలుపువద్ద గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కోనేటి సారయ్యతో పాటు పలువురు వాహనదారులు మృత్యువాత పడ్డాడు.మల్లంపల్లి నుంచి చౌటపల్లికి వచ్చే మార్గంలో ప్రమాదకర బావులు వున్నాయి.వీటి వద్ద ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోలేదు.ఇప్పటికైనా సంభంధిత అధికారులు హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి పరిధిలోగల ప్రధాన రోడ్డు ప్రక్కన ఉన్న బావులను గుర్తించి రక్షణ గోడలు,హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల వాహనదారులు ఇప్పటికే పలు మార్లు కోరినా ఎవరు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిణామాల దృష్ట్యా రోడ్డు మార్గాల్లో పలు చోట్ల రోడ్డు పక్కనే చెట్ల పొదల మధ్య వ్యవసాయ బావులు, ప్రమాదం పొంచి వున్న మూల మలుపులు ఉన్నాయి. వీటి వద్ద రక్షణ గోడలు,ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.వాటితో పాటు ఆయా గ్రామాల్లో సైతం ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న బావులను గుర్తించాలి.ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసేలా సంబంధిత పోలీసు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



## ఆర్‌ఎస్‌ఎస్‌పై ప్రధాని మోదీ గొప్పలు చెప్పడం సరికాదు

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప మహనీయులను విస్మరించి ఆర్‌ఎస్‌ఎస్‌పై గొప్పగా ప్రధాని మోదీ మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోబావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ఢిల్లీ ఎర్రకోటపై ప్రసంగిస్తూ ప్రధాని మోదీ ఆర్‌ఎస్‌ఎస్ గురించి గొప్పటా చెప్పడం పరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మహనీయులను స్మరించుకోవాల్సింది పోయి ఇతరుల గురించి మాట్లాడటం ఆ స్థాయికి తగదని అన్నారు. ప్రధాన మంత్రి పదవికి వన్నెతెచ్చే విధంగా వ్యవహరించాలే తప్పా దిగదార్చే విధంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాదని పేర్కొన్నారు.

## వినాయక చవితి వేడుకలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి : సిఐ

**ప్రజాపక్షం/షాబాద్ :** వినాయక చవితి వేడుకలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ కాంతా రెడ్డి అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పని సరిగా పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోలీస్ శాఖ ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, రాములు, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు




**ప్రజాపక్షం/కొందుర్గు:** విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి వివరించారు. ఆదివారం కొందుర్గు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ స్థంబాలను వేయించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా మంజూరైన రూ.20లక్షలతో వేసి సిసి రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. రోడ్డు వేశారు. సరే..విద్యుత్ లైన్లు లేక రాత్రి సమయాల్లో పాములు రోడ్లపైకి వస్తున్నాయని, కుక్కల బెడద ఎక్కువగా ఉందని కాలనీ ప్రజలకు నేతలు దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్ళి తక్షణమే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి నూతనంగా విద్యుత్ స్థంబాలను వేయించారు. వాటికి విద్యుత్ దీపాలను అమర్చడంతో కాంతులు విరజిమ్ముతున్నాయి. దాంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని వివరించారు. ఏ ప్రభుత్వ హయాంతో చేయని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తాము చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యుడు భీమారం మాణెయ్య, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాడిగళ్ల మహేందర్, అశోక్, విద్యుత్ లైన్మెన్ లింగంలు ఉన్నారు.

## దేవాలయాలలో మానసిక ప్రశాంతత

### మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** దేవాలయాల వద్ద మానసిక ప్రశాంతత దొరకుతుందని ఇబ్రహింపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమానికి అయన ముఖ్యఅతిధిగా హాజరైనారు. నిర్వాకులు ఎంఎల్ఎకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసంధర్బంగా మాజీ ఎంఎల్ఏ మాట్లాడుతూ దేవాలయాలు ఆధ్యాత్మిక చింతనకు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. అమ్మవారి అనుగ్రహం ఉంటే ఎదైనా సాదించవచ్చునని అన్నారు. గడ్డమల్లాయగూడ గ్రామాభివృద్ధికి తమ వంతుగా సహకరించామని అన్నారు. గ్రామాన్ని అన్నివిధాలుగా తిర్చిదిద్దడానికి ఎంతగానోకృషి చేశామన్నారు.గ్రామ ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటామని హమి ఇచ్చారు.ఈకార్యక్రమంలో బిఅర్ఎస్ పార్టీరాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి,మండల బిఅర్ఎస్ పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేశ్ గౌడ్, సహకారసంఘం చైర్మేన్ తోటిరెడ్డి రాజేంధర్‌రెడ్డి, కల్లూరి శివ, బోల్లంపల్లి వేంకటేశ్,రమేశ్, సురేశ్, అచ్చన ధానయ్య, తమ్మలోనిగూడ మాజీ సర్పంచ్ సంతోష , గ్రామ మాజీ సర్పంచ్ అచ్చన జంగయ్య, మాజి ఉప సర్పంచ్ ఆవ జంగయ్య, అచ్చన మల్లేశ్, శరమంద, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు యాచారం మండలానికి మంద కృష్ణ మాదిగ

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల కేంద్రానికి సోమవారం ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ వస్తున్నారని విహెచ్‌పియస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ళ జంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మండల కేంద్రంలోని డిఎస్ అర్ గార్డేన్‌లో జరిగే నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల, చేయూత పింఛన్ దారుల సదస్సుకు హాజరౌతున్నారని అన్నారు. సకాలంలో దివ్యాంగులు, పింఛన్ దారులు హాజరై విజయవంతం చేయాలని అయన కోరారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కుల మతాలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో బోనాల పండగను జరుపుకున్నారు.మహిళ లు కొత్తబట్టలు ధరించి. బోనాలను అందంగా అలంకరించారు.డప్పు చప్పుళ్ళతో పోతురాజుల అటపాటలతో అంగరంగ వైభవంగా బోనాల ఊరేగింపు కనుల పండుగగా జరిగింది, గ్రామంలోని పెద్దలు , ప్రజలు బోనాల ఉత్సవంతో ఎంతో ఉత్సాహంగా పాల్గోన్నారు.



# పదేళ్లలో అభివృద్ధికి నోచుకోని జూబ్లీహిల్స్

### హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. యూసుఫ్ గూడ డివిజన్‌లోని కృష్ణ నగర్‌లో ఉన్న మహమూద్ ప్యారడైస్ ఫంక్షన్ హాల్‌లో బూత్ ఇన్‌చార్జిలు, ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, స్పోర్ట్స్ అథారిటీచైర్మన్ శివసేన రెడ్డి, కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, నవీన్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొన్నారు.

**అభ్యర్థి కాకుండా పార్టీ విజయం ముఖ్యం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'అభ్యర్థితో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలి. జూబ్లీహిల్స్ అభివృద్ధి జరగాలంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని గెలిపించండి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తున్నాం. గత పదేళ్లలో జూబ్లీహిల్స్ అభివృద్ధికి నోచుకోలేదని మంత్రి పొన్నం విమర్శించారు. 'గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. మేము కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నాం. ఇది ఉప ఎన్నిక కోసం కాదు, నిరంతర ప్రక్రియ. సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం' అని మంత్రి అన్నారు. 'హైదరాబాద్‌కి గోదావరి, కృష్ణ, మంజీర జలాలను కాంగ్రెస్ ప్రభుత్వమే తెచ్చింది. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ ప్రజలకు ఒక్క చుక్క నీరు అయినా తెచ్చిందా? ఒక్క కొత్త పైప్‌లైన్ వేసారా? హైదరాబాద్ పెరుగుతోంది, నీటి అవసరాలు పెరిగాయి' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ గోదావరి ఫేజ్ 2 కింద 15 టిఎంసిల నీటిని తెస్తోందని ఆయన తెలిపారు. 'అందరం ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభావం చూపుతుంది' అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ పార్టీని గెలిపించినట్టుగానే జూబ్లీహిల్స్‌లో కూడా గెలిపించాలని కోరారు.

## కల్లుగీత కార్మికుల అభివృద్ధికి కృషి



### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** కల్లు గీత కార్మికుల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను గౌడ సంఘం నేతలు సన్మానించారు. సర్దార్ పాపన్న గౌడ్ 375వ జయంతి కార్యక్రమాలను పాపన్నగౌడ్ చౌరస్తాలో సోమవారం నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరు కావాలని గౌడ యువజన సంఘం సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గౌడ సంఘం అభివృద్ధి కోసం తానెప్పుడు కృషి చేస్తానన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గౌడ కమ్యూనిటీ భవన నిర్మాణ విషయంలో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. కల్లు గీత కార్మికులను అదుకునేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. కల్లు గీత కార్మికులను ఏనాడు ప్రభుత్వం విస్మరించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్దార్ పాపన్న గౌడ్ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, భానుచందర్ గౌడ్, అభిలాష్ గౌడ్, బయికాడి రాజేందర్ గౌడ్, భాగం మధుసూదన్ గౌడ్, ప్రవీణ్‌కుమార్ గౌడ్‌లు పాల్గొన్నారు.

## దత్తత తీసుకున్న కుక్కపిల్లలకు ప్రేమను పంచండి

### జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దత్తత తీసుకున్న దేశీ కుక్కపిల్లలను ఇంటిల్లిపాది ప్రేమను పంచి కుటుంబ సభ్యులుగా చూడాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని జలగం వెంగళరావు పార్క్‌లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో జరిగిన 'ఇండి పప్పీ మేళా'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'హీరో అవ్వండి, కొనుగోలు చేయకండి, దత్తత తీసుకోండి' అనే నినాదంతో నిర్వహించిన ఈ మేళాలో ఎంతో ఆరోగ్యంగా, విశ్వాసపాత్రంగా ఉన్న దేశీ కుక్కపిల్లలను ప్రదర్శించారు. వాటికి ఇప్పటికే వ్యాధినిరోధక టీకాలు వేయించారు. ఈమేళాకు హాజరైన కుక్కపిల్లల ప్రేమికులు, పెంపుడు జంతువుల పట్ల ఆసక్తి ఉన్నవారు ప్రదర్శనకు ఉంచిన కుక్కపిల్లలను చూసి ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్‌వి. కర్ణన్ కుక్కపిల్లలను పరిశీలించి వాటిని దత్తత తీసుకునే వారికి శుభాకాంక్షలు తెలిపారు. మొదటి కుక్కపిల్లను కూకట్‌పల్లికి చెందిన సిహెచ్. సాయికి కమిషనర్ అందచేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంత్, జిహెచ్ఎంసి ముఖ్య పశువైద్య అధికారి అబ్దుల్ వకీల్ పాల్గొన్నారు.



## శంషాబాద్‌లో ఇద్దరి అదృశ్యం

**ప్రజాపక్షం/శంషాబాద్:** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.సి ఐకె.నరేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మొదటి ఘటనలో ముచ్చింతల్ గ్రామానికి చెందిన బొడ్డు రత్నం (48) వృత్తిరీత్యా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.ఈనెల 13న నందిగామ మండలం చేగురు గ్రామంలోని తన కూతురు మౌనిక అత్తరింటికి వెళ్తానని చెప్పి వెళ్లాడు. అయితే ఆ సాయంత్రం వరకూ రత్నం తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని భార్య బొడ్డు మంజుల ఆందోళన చెందింది.తన కూతురిని సంప్రదించగా, రత్నం అక్కడికి కూడా రాలేదని తెలిసింది. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.రెండో ఘటనలో మహారాష్ట్రలోని లాతూర్ మండలం హల్గరా ప్రాంతానికి చెందిన సూర్యావంశీ రాజేందర్ (35) తన కుటుంబంతో కలిసి శంషాబాద్ మండలం ఇంద్రనగర్ దొడ్డిలో వలస వచ్చి అడ్డా లేబర్‌గా పని చేసేవాడు. ఈనెల 10న హోటల్ పనికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లిన రాజేందర్ తిరిగి ఇంటికి రాలేదు. స్వగ్రామానికి వెళ్ళాడేమోనని భార్య పూజ రాజేందర్ ఫోన్ చేసినా, అక్కడికి రాలేదని తెలిసింది. దీంతో ఆందోళన చెందిన పూజ, శంషాబాద్ పోలీసులను ఆశ్రయించింది.ఈ రెండు సంఘటనలపై మిస్సింగ్ కేసులు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజాశ్రేయస్సుకు పాటుపడుతున్న ఎమ్మెల్యే

### వార్డు అభివృద్ధికి రూ.7.60కోట్ల నిధులు

### కాంగ్రెస్ నేత లత శ్రీశైలంగౌడ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా..ఇచ్చిన మాటకు కట్టుబడి నిధులను వరదలా తీసుకువచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఏకైక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని మాజీ కౌన్సిలర్ పులిమామిడి లత శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో మీడియాతో మాట్లాడుతూ వార్డులోని కాలనీల్లో ఇంటింటిని ఎమ్మెల్యే పర్యటించి మీకు ఏమైన సమస్యలు ఉన్నాయా..తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానంటూ పదేపదే చెప్పుకొచ్చారని వివరించారు. దాంతోనే వార్డు అభివృద్ధికి మొదటి విడతలో రూ.3.60కోట్ల నిధులు మంజూరు చేయించి విద్యుత్, మంచినీరు, సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పనులకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మంజూరు చేసిన నిధులతో ఎంతమేరకు పనులు చేశారని స్వయంగా వచ్చి పరిశీలించినట్లు వివరించారు. అభివృద్ధి పనులకు పరిశీలించడమే కాకుండా రెండవ విడతలో రూ.4కోట్ల నిధులు మంజూరు చేస్తున్నానని ప్రకటించారని తెలిపారు. దాంతో వార్డులో ఉన్న వివిధ కాలనీల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడు ఇలాంటి ఎమ్మెల్యేను తాను చూడలేదని, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే ఏకైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని తెలిపారు. నల్లమోని శంకరయ్య నుండి అయ్యగారి ఇంటి వరకు సిసిరోడ్డు నిర్మాణం, అర్జునయ్య ప్లాట్ నుండి నల్లమోని శంకరయ్య ఇంటి వరకు, సేవలాల్ గుడి నుండి లైన్‌మెన్ ప్రతాప్‌రెడ్డి ఇంటి వరకు, సిద్దార్థ ఇంటినుండి రైల్వేట్రాక్ వరకు ఆంధ్రా శ్రీను ఇంటి నుండి నల్లమోని శంకరయ్య ఇంటి వరకు, ఏడి రాంసింగ్ ఇంటి నుండి పోలీస్ సురేష్ ఇంటి వరకు, ఇవే కాకుండా సాయిబాబా గుడి కింది భాగంలో మరో రెండులైన్లు సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టేందుకు రూ.4కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. తన వార్డు అభివృద్ధికి ఇంతపెద్ద ఎత్తున నిధులు కేటాయించి పనులు చేపట్టడం సంతోషంగా ఉందని, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.



## పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సహకారం

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మంచినీటి దాహార్తిని తీర్చేందుకు పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌కు మరమ్మత్తులు చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాయికల్ శ్రీనివాస్ సొంత ఖర్చులు రూ.70వేలు వెచ్చించి వాటర్‌ప్లాంట్‌కు మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో వాటర్‌ప్లాంట్‌ను గతంలో సడక్ అనే స్వచ్చంద సంస్థ ఏర్పాటు చేసిందని వివరించారు. మరమ్మత్తులకు నోచుకొకుండా మూడు నెలలు గడుస్తుంటే పట్టించుకునే వారు లేకుండా పోయారని, దాంతో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తన దృష్టికి తీసుకువచ్చారని గుర్తు చేశారు. దాంతో రూ.70వేలు సొంత ఖర్చులతో మరమ్మత్తులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ఈ విషయంలో గ్రామంలో సోషల్ మీడియా ద్వారా ఎంత ప్రచారం చేసిన ఫలితం లేకుండా పోయిందని, చివరకు తానే ముందుకు వచ్చి చేసినట్లు తెలిపారు. గత 15రోజుల క్రితం గ్రామంలో రూ.2లక్షలలతో సిసి కెమెరాలను సైతం ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. గ్రామాభివృద్ధి కోసం తనవంతు సహాయ సహకారాలు అంధించేందుకు తాను ఎల్లప్పుడు ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆశన్న గౌడ్, దిద్దెల కృష్ణయ్య, పాండునాయక్, మహిళా సంఘం నాయకురాలు యశోదమ్మ, ఎర్రోళ్ల యాదయ్య, మహ్మద్ సమద్, మెకానిక్ శంకరయ్య, శేఖర్‌రెడ్డి, కుమ్మరి జంగయ్య, దారమోని వెంకటయ్య, నూకల రామచంద్రయ్య, పాండుగౌడ్, యాదయ్యలు పాల్గొన్నారు.





## కబ్జాకు గురైన స్థలంలో పార్క్

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** మలక్‌పేట శ్రీపురం కాలనీలోని 25ఏళ్ళ క్రితం కబ్జా కు గురైన స్థలాన్ని కాలనీకి చెందిన గుండవరం వేణుగోపాల్‌రావు, పద్మలు కలిసి స్థానికుల సహకారంతో కబ్జాలను తొలగించడానికి కోర్టును ఆశ్రయించి విజయం సాధించారు. దుర్గంద పూరితంగా ఉన్న ఆ స్థలాన్ని సుందరంగా తీర్చిదిద్ది స్వర్ణ చతుర్భుజ పార్క్‌గా నామకరణం చేశారు. ఆదివారం శ్రీపురం మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన స్వర్ణ చతుర్భుజ పార్క్ రజతోత్సవ సంబురం 2000–25ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యానవనంగా తీర్చిదిద్దే సమయంలో తాము ఎదుర్కొన్న బెదిరింపులు, ఇబ్బందుల తీరును వివరించారు. నాడు సహకరించిన ఆత్మీయులందరిని ఆహ్వానించి అందరికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు రవీందర్‌రెడ్డి, రామారావు, కొండారెడ్డిలతో పాటు రాజేశ్వర్‌రావు, రాజేందర్, నరేందర్ ప్రవీణ్ స్వర్ణ, శకుంతల, అనిత హేమతో పాటు పలువురు సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.






## పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతిఒక్కరిది

### భారీ మట్టి గణనాథుడి విగ్రహాన్ని సందర్శించిన మధుయాష్కీగౌడ్

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని తిరంగా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగోల్ సమతాపురి కాలనీలో ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల మట్టి గణనాథుని విగ్రహాన్ని టి పిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ ఆదివారం సందర్శించారు. 19 ఏళ్లుగా వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. పర్యావరణ సహితమైన మట్టి గణనాథుని ఏర్పాటు చేయడం అందరికీ ఆదర్శమని ఈ సందర్భంగా మధుయాష్కి పేర్కొన్నారు.పకృతిని, పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని అందరూ మట్టి గణపతిని ప్రతిష్టించి పూజలు నిర్వహించాలని మధుయాష్కీ గౌడ్ సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కొండోజు శ్రీనివాస్, దాము మహేందర్ యాదవ్, రమేష్, నాగార్జున రెడ్డి, తిరంగా యూత్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## షార్ట్ రన్‌పై బిసిసిఐ కీలక నిర్ణయం!



### సూర్యకుమార్ ఫిట్

**న్యూఢిల్లీ:** భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫిట్నెస్ సాధించాడు. ఈసారి టీ20 ఫార్మాట్లో జరగనున్న ఆసియా కప్ వచ్చే నెల 9న ఆరంభం కాబోతుండగా.. మూడు వారాల ముందే సూర్య ఫిట్నెస్ పరీక్షలో పాసయ్యాడు. బెంగళూరులోని బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ (సిఒఇ)లో అతడికి పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఐపిఎల్ అనంతరం సూర్య జర్మనీలోని మ్యూనిక్ హెర్నియా శస్త్రచికిత్స చేయించుకున్నాడు. బిసిసిఐ నిబంధనల ప్రకారం ఓ క్రికెటర్ శస్త్రచికిత్స చేయించుకుంటే.. తిరిగి జట్టులోకి రావడానికి సిఇఒలో ఫిట్నెస్ పరీక్ష పాసవడం తప్పనిసరి. ఆసియా కప్ కోసం జట్టును ఎంపిక చేసేందుకు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ మంగళవారం సమావేశం కానున్న నేపథ్యంలో సూర్య.. సిఒఇకి వెళ్లి ఫిట్నెస్ నిరూపించుకున్నాడు. సెలక్షన్ కమిటీ సమావేశంలో సూర్య కూడా పాల్గొంటాడు. యుఎఇ వేదికగా సెప్టెంబరు 9 నుంచి 28 తేదీల మధ్య ఆసియా కప్ జరుగుతుంది. 10న యుఎఇతో మరోసారి ఢీకొనే అవకాశముంది.

#### అందుబాటులో బుమ్రా

ఆసియా కప్‌లో భారత అగ్రశ్రేణి పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆడే అవకాశముంది. తాను ఈ టోర్నీకి అందుబాటులో ఉంటానని సెలక్టర్లకు బుమ్రా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. పూర్తి ఫిట్నెస్ లేకపోవడం వల్ల ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో జస్ప్రీత్ మూడు మ్యాచ్లో ఆడాడు. నిరుడు టీ20 ప్రపంచకప్ తర్వాత బుమ్రా అంతర్జాతీయ టీ20లే ఆడలేదు. దీంతో ఈ ఫార్మాట్లో మళ్లీ బరిలోకి దిగుతాడా లేదా అన్న సందేహాలు కలిగాయి. కానీ ఆసియా కప్ ఆడేందుకు అతను సిద్ధమయ్యాడు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ వరకు అతను ఈ ఫార్మాట్లో కొనసాగే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది.

ఐపిఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో పలు మార్పులకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) శ్రీకారం చుడుతోంది. తీవ్రంగా గాయపడిన ఆటగాళ్లు మరితంగా గాయపడకుండా చూడాలనే ఉద్దేశంతో రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌ను అనుమతించేందు కు బోర్డు పచ్చజెండా ఊపింది. అంతేకాదు షార్ట్ రన్‌పై, రిటైర్డ్ హర్ట్ అయిన బ్యాటర్లపై, వన్డే మ్యాచ్‌లో రెండు బంతుల వినియోగంపై కూడా బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకుంది. మామూలుగా టీ20ల్లో.. ముఖ్యంగా ఐపిఎల్‌లో వికెట్లు పడుతుంటే ప్రధాన బ్యాటర్లు ఓవర్ చివరి బంతికి చివర సింగిల్ తీసేందుకు ప్రయత్నిస్తారు. టెయిలెండర్లు వికెట్ కాచుకోలేరు, బౌండరీలు బాదలేరు కాబట్టి వాళ్ల బదులు స్ట్రయిక్ తీసుకోవాలని కష్టమైనా సరే రెండు రన్స్ తీస్తుంటారు. ఈ క్రమంలో కావాలనే కొందరు నాన్ స్ట్రయికింగ్ క్రీజులో బ్యాటు పూర్తిగా పెట్టరు. దీన్నే షార్ట్ రన్‌గా పరిగణిస్తారు. ఇకపై షార్ట్ రన్ తీసి బ్యాటింగ్ చేద్దామనుకుంటే కుదరదని బిసిసిఐ తేల్చి చెప్పింది. బ్యాటర్లు ఉద్దేశపూర్వకంగానే షార్ట్ రన్ తీస్తే.. స్ట్రయికింగ్‌లో ఎవరు ఉండాలో ఫీల్డింగ్ జట్టు కెప్టెన్ నిర్ణయించేలా కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది. ఐసిసి ఈమధ్య వన్డేల్లో రెండు బంతుల నియమాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. బిసిసిఐ కూడా ఇదే విధానాన్ని అనుసరించనుంది. ఇకపై వన్డే మ్యాచుల్లో 34 ఓవర్ల తర్వాత ఒకే బంతిని మార్చేందుకు అనుమతించనుంది. త్వరలో



ప్రారంభం కాబోయే విజయ్ హజారే ట్రోఫీ నుంచే ఈ నియమం అమల్లోకి వస్తుందని బిసిసిఐ వెల్లడించింది. అంతేకాదు ఎవరైనా రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్‌కు వెళ్తే వాళ్లను మళ్లీ మైదానంలోకి అనుమతించబోమని బిసిసిఐ స్పష్టం చేసింది. అయితే.. క్లాజ్ 25.4.2 ప్రకారం రిటైర్డ్ హర్ట్ అయినవాళ్లకు వెసులుబాటు ఉంటుందని బోర్డు చెప్పింది. మామూలుగా అయితే రిటైర్డ్ హర్ట్ అయిన వాళ్లు ఇన్నింగ్స్ మధ్యలో లేదా చివర్లో బ్యాటింగ్‌కు వస్తుంటారు. కానీ, ఈ కొత్త నిబంధన రాకతో ఇకపై ప్రత్యర్థి కెప్టెన్ అనుమతించినా సరే వాళ్లు మైదానంలోకి వచ్చేందుకు రిఫరీ ఓకే చెప్పరు. ఈ నియమం అన్ని ఫార్మాట్లకు వర్తిస్తుందని బిసిసిఐ తెలిపింది

## భారత స్కేటింగ్ కోచ్‌గా ఖాదిర్




డెహ్రాడూన్ వేదికగా జరుగనున్న ఏషియన్ ఓపెన్ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ ట్రోఫీలో భారత జట్టుకు హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న టోర్నీలో ఆతిథ్య భారత్ సహా పలు దేశాలు పోటీపడుతున్నాయి.ఆసియాలోని వివిధ దేశాల టాప్ స్కేటర్లు బరిలోకి దిగే టోర్నీలో భారత యువ స్కేటర్లు సత్తాచాటేందుకు మంచి అవకాశమని ఖాదిర్ పేర్కొన్నాడు. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ మన స్కేటర్లు పతకాలు సాధిస్తారన్న నమ్మకముందని అన్నాడు. నాలుగు రోజుల పాటు జరిగే టోర్నీలో 500మీ, 1000మీ, 1500మీ, టీమ్ రిలే ఈవెంట్లలో పోటీలు జరుగనున్నాయి.

# ఆరోగ్యం

ఫోకస్



## పెరుగుతున్న శ్వాసకోశ సంబంధిత వ్యాధులు



శ్వాసకోశం మన శరీరంలో జీవనాధారమైన వ్యవస్థ. గాలి పీల్చడం, ఆక్సిజన్‌ను రక్తంలోకి పంపించడం, కార్బన్ డయాక్సైడ్‌ను బయటకు పంపించడం వంటి కీలకమైన పనులను ఊపిరితిత్తులు, శ్వాసకోశ మార్గాలు నిర్వహిస్తాయి. కానీ గత కొన్ని దశాబ్దాలుగా ఈ వ్యవస్థను దెబ్బతీస్తున్న వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) ప్రకారం, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు సంవత్సరానికి కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయి, అందులో లక్షలాది మరణాలు చోటు చేసుకుంటున్నాయి. శ్వాసకోశ వ్యాధులు కొత్తవి కావు. క్షయ (టిబి), న్యుమోనియా, ఇన్‌ఫ్లుయెంజా వంటి వ్యాధులు శతాబ్దాలుగా మానవాళిని వేధిస్తున్నాయి. 19వ శతాబ్దంలో యూరప్‌లో టిబి ఎంతో మంది మరణాలకు కారణమైంది. పారిశ్రామిక విప్లవం తర్వాత గాలి కాలుష్యం ఊపిరితిత్తుల వ్యాధుల పెరుగుదలకు ప్రధాన కారణమైంది. 20వ శతాబ్దం మధ్యలో యాంటీబయాటిక్స్, టీకాల వలన కొంత నియంత్రణ వచ్చినా, పట్టణీకరణ, పొగతాగడం, వాతావరణ మార్పులు కొత్త సవాళ్లను తెచ్చాయి. 21వ శతాబ్దంలో కొవిడ్ 19 వంటి శ్వాసకోశ సంబంధిత వైరస్‌లు మళ్లీ ప్రపంచానికి గాలి విలువను గుర్తుచేశాయి. డబ్ల్యుహెచ్‌ఓ అంచనాల ప్రకారం, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి సుమారు 3 మిలియన్ల మంది మరణిస్తున్నారు. ఆస్తమాతో 262 మిలియన్లకు పైగా ప్రజలు బాధపడుతున్నారు. టిబి కారణంగా 2022లో ప్రపంచవ్యాప్తంగా 1.3 మిలియన్ మంది మరణించారు. న్యుమోనియా, ప్రత్యేకించి పిల్లలు మరియు వృద్ధులలో, ఇంకా ప్రధాన మరణ కారణం. గాలి కాలుష్యం ప్రతి సంవత్సరం దాదాపు 7 మిలియన్ మరణాలకు కారణమవుతోంది.

### ముఖ్యమైన వ్యాధులు

ఆస్తమా అనేది వాయు మార్గాలు దప్పికతో, వాపుతో సంకోచించడంతో వచ్చే దీర్ఘకాలిక వ్యాధి. పుప్పొడి, ధూళి, రసాయనాలు, పొగ వంటివి ట్రిగ్గర్‌లుగా పనిచేస్తాయి. క్రానిక్ బ్రాంకైటిస్, ఎంఫ్సీమ ఉన్నాయి. శ్వాస కష్టంగా మారుతుంది. ముఖ్య కారణం పొగతాగడం, పరిశ్రమల కాలుష్యం. కాగా, క్షయ (ట్యూబర్‌కులోసిస్/ టిబి) మైకోబాక్టీరియం ట్యూబర్‌కులోసిస్ అనే బాక్టీరియాతో వచ్చే అంటువ్యాధి. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది. ఇక వైరస్, బాక్టీరియా లేదా ఫంగస్ వల్ల ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ న్యుమోనియా. పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువవారిలో ప్రమాదకరం. ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం కూడా కష్టమే. అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటి.

### సమస్యలు..

శ్వాసకోశ సంబంధిత వ్యాధుల వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. ఈ రుగ్మత వల్ల ఒక వ్యక్తి ఆరోగ్య, ఆర్థిక, సామాజికాది అంశాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గడం అనేక సమస్యలకు కారణమవుతుంది. ఆక్సిజన్ సరఫరా లోపించి, ఒక్కోసారి ప్రాణాలకు ప్రమాదం తెచ్చిపెడుతుంది. ఈ వ్యాధుల వల్ల దీర్ఘకాలిక అలసట, పనితీరు తగ్గడం తదితర సమస్యలు కూడా ఉన్నాయి. వైద్య ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగ దినాలు కోల్పోవాల్సి వస్తుంది. ఉత్పాదకత తగుతుంది. ఇలాంటి పరిస్థితులు అందరిపైనా, ప్రత్యేకించి బలహీన వర్గాలపై తీవ్రమైన ప్రభావం చూపుతాయి. ఆరోగ్య అసమానతలు పెరుగుతాయి. నివారణ చర్యల్లో కాలుష్య నియంత్రణ అత్యంత ప్రధానమైనది. పరిశ్రమలు, వాహనాల ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధనాల వినియోగం వంటి చర్యలు అత్యవసరం. పొగతాగడాన్ని పూర్తిగా మానేయాలి. ధూమపాన నిషేధ చట్టాలు కఠినంగా అమలు చేయాలి ఫ్లూ, న్యుమోనియా, టిబి వంటి వ్యాధుల నివారణకు టీకాలు వేయాలి. శ్వాసకోశ ఆరోగ్యం ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం అవసరం. చెట్లు నాటడం, నగరాల్లో గ్రీన్ జోన్‌లు ఏర్పాటు చేయాలి. అధిక కాలుష్య ప్రాంతాల్లో మాస్క్ ధరించడాన్ని తప్పనిసరి చేయాలి. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు జరిపించుకొని, వైద్యుల సూచనలతో తగిన చికిత్స తీసుకోవాలి. సొంత వైద్యం ఎంతమాత్రం పనికి రాదు.

### ప్రధాన కారణాలు

**గాలి కాలుష్యం :** పట్టణాల్లో వాహనాల పొగ, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ స్థలాల ధూళి, గృహ ఇంధనాల దహనం వంటి వాటి వలన గాలి నాణ్యత దారుణంగా పడిపోతోంది. పిఎం2.5, పిఎం 10 వంటి సన్నని ధూళి కణాలు ఊపిరితిత్తుల లోతువరకు చేరి శాశ్వత నష్టం కలిగిస్తాయి.

**పొగతాగడం :** ఊపిరితిత్తుల క్యాన్సర్, బ్రాంకైటిస్ వంటి వ్యాధులకు పొగతాగడమే ప్రధాన కారణం. పాసివ్ స్మోకింగ్ కూడా అంతే ప్రమాదకరం.

**వాతావరణ మార్పులు :** ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం విధానాలు మారడం, దుమ్ము తుఫానులు, పుప్పొడి సీజన్ పొడిగించడం వలన అలర్జీలు, ఆస్తమా కేసులు పెరుగుతున్నాయి.

**జీవనశైలి :** ఆహారపరమైన లోపాలు, వ్యాయామం లేకపోవడం, బలహీన రోగ నిరోధక శక్తి వలన ఇన్ఫెక్షన్లకు సులభంగా గురవుతున్నారు.

**జనసాంద్రత :** గుంపులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, ముఖ్యంగా నగర స్లమ్‌లలో, గాలి ద్వారా వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి.

## నష్టపోయిన పంటలకు పరిహారం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్





**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** భారీవర్షాలకు పంటలు మునిగిపోయి నష్టం వాటిల్లిందని, నష్టపోయిన పంట పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం కార్యదర్శి చిలుక దేవిదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం తహసీల్దార్ లక్ష్మి తో కలిసి తాంసి మండలం గోట్కూరి గ్రామంను, పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.25వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఇల్లు కూలిపోయి నిరాశ్రయులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులను పలకరించి దైర్యంగా ఉండాలని, ప్రభుత్వం నష్టపరిహారం అందించే వరకు తాము పోరాడి ఒత్తిడి తీసుకొస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, తాంసి మండల కార్యదర్శి అర్గాంగి రమేష్, ఆదిలాబాద్ రూరల్ మండల కార్యదర్శి మహబూబ్ ఖాన్, తాంసి గిర్ధవార్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణం చేపట్టాలి

### ఎఐవైఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** జనగాం నుంచి నారాయణపురం వెళ్లే దారిలో ఉన్న వాగుపై వంతెన నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి విప్లవ్ మాట్లాడుతూ గతంలో వాగు మధ్యలో నీరు ప్రవహిస్తుండడంతో ప్రత్యామ్నాయంగా డ్రైనేజీ పైపును ఏర్పాటు చేశారని, అది ఇప్పుడు మధ్యలో కుంగిపోవడంతో పెద్ద మట్టి దిబ్బగా ఏర్పాటవటంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాత్రి వేళలో ఆ మట్టిదిబ్బ వద్ద పడి చాలా మంది గాయలపాలయ్యారన్నారు. నిత్యం గ్రామం నుండి విద్యార్థులు పాఠశాలకు ఇదే మార్గంలో వెళ్తుంటారని ఇక్కడ గ్రామం నుంచి వెళ్లే మురికినీరు జమ అవ్వటంతో దుర్వాసన వస్తుందని, వర్షం వస్తే అటుగా వెళ్లడం ఇబ్బందులకు గురిచేస్తుందని, తక్షణమే వంతెన నిర్మాణం చేసి సమస్య పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కన్వీనర్లు శనిగల నరేష్, ఐత రాజు కిరణ్, కొండూరి వంశీ నాయకులు నాతి సైదులు, కొండూరి రవి, కప్పల అరుణ్, కొండూరి రాజు, ఏసారపు నవీన్, కప్పల దినేష్, శనిగల మహేష్, కొండూరి మణి తదితరులు పాల్గొన్నారు.

## పదిలక్షల ఎకరాల భూమిని పేదప్రజలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులది

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పదవులతో సంబంధంలేకుండా ప్రజా సమస్యలపై దాదాపుగా వంద సంవత్సరాలుగా నాటినుంచి నేటి వరకు కమ్యూనిస్టు పార్టీ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. మండలంలోని తిర్నాపల్లి గ్రామంలో ఆదివారం సిపిఐ మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు అధ్యక్షతన తిర్నాపల్లి గ్రామ డిప్యూటీ సర్పంచ్ రామకృష్ణతోపాటు దాదాపుగా 40మంది వివిధ పార్టీల కార్యకర్తలు సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ దాదాపుగా సిపిఐపార్టీ స్థాపించి దాదాపు వంద సంవత్సరాలు అవుతుందని, నాటినుంచి నేటివరకు దేశం, రాష్ట్రంలో సిపిఐ అధికారంలో లేకున్నా, పదవులు లేకున్నా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలో 10లక్షల ఎకరాల భూమిని పేదప్రజలకు పంచిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. పార్టీలతో సంబంధంలేకుండా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో సిపిఐ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ మాజీ సర్పంచ్ పెబ్బేటివిజయుడు, ఎఐవైఎఫ్ కార్యదర్శి బిజ్జశ్రీనివాసులు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి బండిలక్ష్మి పతి, సిపిఐ మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు,కోశాధికారి చింతలపల్లి కుర్మయ్య, కోడేరు మండల సిపిఐకార్యదర్శి కిరణ్‌కుమార్, మండల సహాయ కార్యదర్శి లక్ష్మి నారాయణ, వివిధగ్రామాల సిపిఐ శాఖల కార్యదర్శులు కృష్ణయ్య, తుమ్మల శివుడు, యూసుఫ్, లక్ష్మణస్వామి, నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తిపై మాట్లాడే హక్కు బిజెపికి లేదు : సిపిఐ

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :**దేశ భక్తి గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదని, నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ అన్నారు. ఆదివారం వనపర్తిలో సిపిఐ జిల్లా నేత కళావతమ్మ నివాస గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమ్యూనిస్టులను ఏరువేస్తామని, వారి దేశ భక్తిపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని తొలిసారి డిమాండ్ చేసింది. కమ్యూనిస్టులే అన్నారు. స్వాతంత్రం కోసం, తెలంగాణ విముక్తి కోసం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎందరో కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారన్నారు. ఆపరేషన్ కంగారు పేరుతో కమ్యూనిస్టులను ఏరివేస్తామని బండి సంజయ్ చెప్పటం దుర్మార్గమన్నారు. ఎర్రజెండాను అంతం చేసే శక్తి బిజెపికి లేదన్నారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు కళావతమ్మ, శ్రీరాం, సిపిఐ నాయకులు రమేష్, మోష, ఎఐవైఎఫ్ నాయకుడు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## వినియోగదారుల ఆదరణతోనే గుర్తింపు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వినియోగదారుల ఆదరణతోనే గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బిసి ఉద్యమ నాయకుడు దుడుకు లక్ష్మీనారాయణ వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. పట్టణంలోని ఎస్‌పిటి మార్కెట్‌లో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ బ్లూమూన్ కలెక్షన్స్‌ను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి ఉద్యమంలో రాణించినట్లుగానే వ్యాపార రంగంలోనూ లక్ష్మీనారాయణ రాణించాలని ఆకాంక్షించారు. అందరి ఆదరాభిమానాలతో ఆయన వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వస్త్ర వ్యాపారాన్ని నూతనంగా ప్రారంభించిన లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిటిప్రోలు వెంకటపతి, మిరియాల సోమయ్య, మిరియాల యాదగిరి, చిలువేరు చంద్రయ్యలు, లొడంగి శ్రవణ్ కూమార్, మాదగోని శ్రీనివాస్, పిల్లి రామరాజు, చీర ఫంకజ్ యదవ్, వైద్యుల సత్యనారయణ, నల్ల సోమమల్లయ్య,జిల్లా యాదయ్య, వి.లెనిన్ వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులది నిరంతర పోరు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** ప్రజా సమస్యలపై నిత్యం కమ్యూనిస్టులు నిరంతర పోరు సల్పిస్తారని ఆగస్టు 20 నుండి 22 వరకు కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో జరగనున్న సిపిఐ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆదివారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్ లో జరిగిన సిపిఐ దేవరకొండ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ఎల్1, ఎల్2, ఎల్3 లిస్టులతో సంబందం లేకుండా అధికారులు నిజమైన అర్హులను గుర్తించి ఇళ్లను కేటాయించాలని, సొంత స్థలం లేని పేదవారికి ఇళ్ల స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, ప్రభుత్వం అనేక షరతులు పెట్టినప్పటికి నిజమైన అర్హులను గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పతకాలను నిజమైన అర్హులకే కేటాయించాలని కోరారు. స్వాతంత్ర్య పోరాటం నుండి నేటి వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీలేనని వారు స్పష్టం చేశారు. వందేళ్ల ప్రస్థానంతో ముందుకు సాగుతున్న సిపిఐని ప్రజలతో మరింత మమేకం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలం చెందారాన్నారు. ఇప్పటికి నియంతృత్వ పోకడలు, అవినితి మితిమీరిందని అన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఉపన్యాసాలు ఇస్తున్నారే కానీ కొత్త ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. గవర్నర్ వ్యవస్థతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. స్వతంత్ర వ్యవస్థలను కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకొని రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికార పార్టీతో ఉన్న స్నేహ ధర్మాన్ని పాటిస్తూనే ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తున్నామని తెలిపారు. ఇక ముందు మరింత పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలకు సన్నద్దం కానున్నామని, ఇందుకు మహాసభల వేదికగా కార్యాచరణను రూపొందించుకోనున్నామని తెలిపారు. అదే విధంగా స్థానిక సంస్థల్లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిసి బిల్లుకు బిజెపి పెద్ద అడ్డంకి అని విమర్శించారు. ఒక వైపు బిసి బిల్లుకు అడ్డుపడుతున్న బిజెపి మరోవైపు రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిన బిసి బిల్లులను గత 4 నెలలుగా తొక్కి పెట్టడం సరికాదని, ఆర్డినెన్స్ ఆమోదం విషయంలో సైతం ఇదే విధంగా చేయడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో పోలే వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, నియోజకవర్గ సభ్యులు సుదర్శన్‌రెడ్డి,మైనోద్దిన్, అచ్చయ్య, రామస్వామి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## డప్పు కళాకారుల గ్రామ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని శాయినిపల్లి గ్రామంలో ఆదివారం తెలంగాణ డప్పు కళాకారుల సంఘం గ్రామ కమిటిని ఎన్నుకున్నారు. ఈ కమిటీని ఖిల్లఘనపూర్ డప్పు కళాకారుల మండల ఉపాధ్యక్షులు మిద్దె ఆంజనేయులు, మండల కార్యవర్గసభ్యులు మల్లగల మన్యం, గోపాల్‌పేట్ మండల బాధ్యులు స్వామి మల్లయ్య ఆధ్వర్యంలో కమిటిని ఎన్నుకున్నారని తెలిపారు. శాయిన్‌పల్లి గ్రామకమిటి అధ్యక్షులుగా గట్టుగళ్లవెంకటయ్య, ఉపాధ్యక్షులు కొత్తూరిమాసయ్య, కుర్మయ్య, ప్రధాన కార్యదర్శి సురేందర్, సహాయకార్యదర్శి పోలేపాండు వీరితోపాటు మరో 20మంది మండల వివిధగ్రామాల డప్పు కళాకారులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణ కేంద్రంలోని నిర్మాణంలో ఉన్న 150 పడకల నూతన ఆసుపత్రిని రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆసుపత్రి నిర్మాణ పురోగతిని సమీక్షిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అత్యాధునిక సదుపాయాతో వైద్యం అందేలా తీర్చిదిద్దాలన్నారు త్వరితగతిన పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.

## బొడ్రాయి ప్రతిష్టాపన.. ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని పంచదేవ్ పహాడ్ గ్రామంలో నాభిశిల బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరికి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు గణేష్ కట్టా సురేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య, మండల కార్యదర్శి నాగప్ప, గ్రామ అధ్యక్షులు వి.వెంకటయ్య, బిజెపి కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆడపడుచులు, తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల్ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్



**ప్రజాపక్షం/మక్తల్ :** పట్టణంలోని యాదవనగర్‌లో వెలసిన వేణుగోపాల్ స్వామిని ఆదివారం ఉదయం మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వెంకన్న శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం నిర్వాహకులు డాక్టర్ శ్రీరాములు కావలి శ్రీహరి మాజీ ఎమ్మెల్యేను శాలువా పూలమ్మతో ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్ టిఆర్ఎస్ పార్టీ నాయకుల చిన్న హనుమంతు మొగలప్ప జుట్ల శంకర్ అశోక్ కుమార్ గౌడ్ అమ్రేష్ నరసింహారెడ్డి శివారెడ్డి గుంటి రాఘు వినోద్ కుమార్ కెసిఆర్ అంజప్ప రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## నూతన మండల వాలిబాల్ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ మద్దూర్ :** మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల మద్దూర్ అవరణలో నారాయణపెట జిల్లా అసోషియెషన్ జిల్లా అబ్జర్వర్లు ఆద్వర్యంలో ఆదివారం రోజు నూతన వాలిబాల్ కమిటి ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కల్లప్ మహేష్,ప్రధాన కార్యదర్శిగా అతిక్‌ఉర్ రహ్మాన్, కొశాధికారిగా ఎం.రాజును ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అబ్జర్వర్లు అనంతసేన,సాయినాథ్,జగదీష్,బాల్ రాజ్ ,మద్దూర్ సీనియర్ వాలిబాల్ క్రిడాకారులు విరేష్ గౌడ్,రమేష్,మహెందర్,రవి పాల్,ఇక్బాల్,రవి మరియు మండల క్రిడాకారులు తదితరులు పాల్గోన్నారు.

## కృష్ణా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తం

తహసీల్దార్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/కృష్ణ :** గత నాలుగు రోజులుగా భారీ వర్షాల కారణంగా కర్ణాటక రాష్ట్రంలోని నారాయణపూర్ డ్యామ్ గేట్లు తెరవడం వలన కృష్ణ నదికి భారీ వరద వచ్చే అవకాశం ఉన్నందు వలన కృష్ణ మండలంలోని కృష్ణనది పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తాహసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో అధికారులందరు అందుబాటులో ఉండాలని అవసరమైన ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో సంబంధిత పోలీస్‌స్టేషన్ లేదా 100 డయల్ చేసి సంప్రదించాలని కోరారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండలం వడ్డేవాట గ్రామానికి చెందిన అక్కల ఎలేందర్ గౌడ్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి వెంటనే మండల అధ్యక్షుడు నాగరపు బీచుపల్లి , టౌన్ అధ్యక్షులు పోతులపల్లి శ్రీనివాస్ , జిల్లా ప్రధాన కార్యదర్శి పాపయ్య, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఎంజే బోయేజ్ , అక్కడకు పంపీ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, మండ్ల తిరుపతయ్య, ఏజిపి అడ్వకేట్ మునగారి కృష్ణ, భాను ప్రకాశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు
- అనర్హులను ఎంపిక చేస్తే తొలగిస్తాం
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరిగతిన పూర్తి చేయాలి : మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం / పాన్‌గల్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అవినీతి అక్రమాలకు చోటు లేదని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం పాన్‌గల్ మండల పరిధిలోని తెల్ల రాళ్లపల్లి తండా, వెంగళాయపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ అర్హులందరికి సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాలలో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రజలతో సమావేశమై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులలో ఎవరైనా అనర్హులు ఉన్నారా అని గ్రామస్తులను అడిగారు. అధికారులు, నాయకులు ఎంతటి వారైనా ప్రజల నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రజా పాలనలో ప్రజలందరికి న్యాయం చేస్తామన్నారు. ఎన్నికల కంటే ముందు ఇచ్చిన హామీలను అన్నింటిని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు ఆయనతెలిపారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, ఎంపిడిఒ గోవిందరావు, డిప్యూటీ తహసీల్దార్ ఆశోక్ , మాజీ ఎంపిపి వెంకటేష్ , నాయుడు, మాజీ జెడ్‌పిటిసి రవి, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నాయకులు రాము యాదవ్ , పుల్లారావు, వివిధ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 25వ తేదీన సత్యాగ్రహ దీక్ష



**ప్రజాపక్షం/జడ్చర్ల :** రాజాపూర్ మండల కేంద్రంలో బిసి జాగృతి సేన జిల్లా నాయకులు రాజాపూర్ ఉపసర్పంచు అల్లె శ్రీనివాస్ కుర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిసి జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు సాధనే లక్ష్యంగా ఈనెల 25 తారీకు న హైదరాబాదులోని ఇందిర పార్కు దగ్గర బిసి దళపతి, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష కార్యక్రమం ఉంటుంది. కావున ఉమ్మడి జిల్లాలోని బిసి సామాజిక వర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, బిసి సంఘాల నాయకులు, బిసి కులసంఘాల నాయకులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్ అమలయ్యే వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బిసిలందరూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి జాగృతి సేన జిల్లా నాయకులు మాజీ ఉపసర్పంచు అల్లె శ్రీనివాస్ కుర్మ, బిసి జాగృతి సేన కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్‌కుమార్, రాజేష్, జనిగల శేఖర్ యాదవ్, బిసి జాగృతి సేన నియోజకవర్గం అధ్యక్షులు బొల్లెమోని నిరంజన్, బాలగౌడ్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మంటపాల నిర్వహణలో భద్రత, నియమనిబంధనలు తప్పనిసరి

మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌పి డి.జానకి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** తెలంగాణ రాష్ట్ర పోలీసు వెబ్‌సైట్‌లో గణేష్ విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపులకు అనుమతి కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో గణేష్ మండపం నిర్వహణకు మండపాల నిర్వహకులు తెలంగాణ పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ నం దు దరఖాస్తు చేసుకోవాలని, ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపానికి సంబంధించిన సమాచారం కొరకు మాత్రమని, ఈ సమాచారంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత , బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులభంగా ఉంటుందని జిల్లా ఎస్‌పి డి.జానకి తెలిపారు. పోలీసు శాఖ ఆన్లైన్ ద్వారానే అనుమతి మంజూరు చేయడం జరుగుతుందని, ఆ తరువాతనే వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా బీరప్ప బోనాలు

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రంలో కురుమసంఘం ఆధ్వర్యంలో బీరప్ప బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీజడ్పిటిసి విజితారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కురుమసంఘం నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ చిందంలక్ష్మి కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ జంగిలినిరంజన్, మాజీ ఎంపిటిసి లలితతంబాల్‌యాదవ్, మాజీవార్డుమెంబర్ యాదగిరి, కురుమసంఘం నాయకులు కృష్ణ, రామకృష్ణ , వెంకటయ్య, మల్లయ్య, వెంకటయ్య, జంగయ్య, మల్లయ్య, శ్రీశైలం, బీరప్ప, కుమార్, టిఆర్ఎస్ నాయకులు ఆనంద్, రాజు, గోరటి రాజు, శేఖర్, ఎంఎస్‌గౌడ్, వెంకటయ్య, శ్రీను, సైదులు, అనిల్ పాల్గొన్నారు.



## గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ఉట్కూర్ శివారులోని అయ్యప్ప స్వామి టెంపుల్ వెనక భాగంలోని గల వెంచర్‌లో గంజాయి అమ్ముతున్నారన్న పక్క సమాచారంతో ఉట్కూర్ పోలీసులు దాడులు నిర్వహించి కోరేబాన్ సంజీవ్, చెట్టు కింది అరవింద్ కుమార్ అనే ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నామని, వారి వద్ద నుండి 125 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఉట్కూర్ ఎస్ఐ రమేష్ తెలిపారు.యువత గంజాయి డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అలాంటి వ్యసనాల బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, గంజాయి డ్రగ్స్ ఎవరైనా అమ్మిన, సేవించిన అట్టి వ్యక్తుల పై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. యువత చెడు మార్గాల బారిన పడకుండా బాగా చదువుకొని, ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్సై కోరారు.

## విద్యార్థులు ఫోన్‌లను విడిచి ఆటలు, మైదానం వైపు రావాలి

బావసార క్షత్రియ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ కుమార్ జైత్రానే



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** పాఠశాల కళాశాలల విద్యార్థిని విద్యార్థులు మొబైల్ ఫోన్‌లను విడిచి ఆటల మైదానం వైపు రావాలని భవసార క్షత్రియ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ కుమార్ జైత్రానే అన్నారు. సరాఫ్ బజార్ వీధిలోని దత్తాత్రేయ మందిరంలో భవసార క్షేత్రియ సమాజ్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు విద్యా సదస్సుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో చదువుకునే వారు పుస్తకాలను పక్కనపెట్టి మొబైల్ ఫోన్‌లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని దీనిని పక్కనపెట్టి విద్యార్థిని విద్యార్థులు ఆట పాటలలో సైతం రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. నేటి సమాజంలో చదువుకునే విద్యార్థులతో పోటీపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆయన సూచించారు. చదువుల తల్లి సరస్వతి దేవిని పూజిస్తే చదువుల తల్లితోపాటు లక్ష్మీ దేవి ఆశీర్వాదం ఇస్తుందని అప్పుడే చదువుతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు. అంతేకాక ప్రపంచంలోనే హిందూ సంప్రదాయం చాలా గొప్పదని హిందూ సంప్రదాయానికి ప్రతి ఒక్కరు క ట్టుబడి ఉండాలని ఆయన అన్నారు. చదువుతోపాటు నేటి సమాజంలో జరుగుతున్న మంచి చెడు అంశాలపై ఆయన విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లోకండే శ్రీధర్, కిషోర్ తాండ్లే, వసంత్ కుమార్, బాసూద్కర్, నారాయణపేట బావ సార క్షత్రియ సమాజ్ అధ్యక్షులు తెల్కర్ విజయ్ కుమార్, సెక్రెటరీ రమేష్ నింకార్, శ్రీనివాస్, క్షీరసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని కుప్పగండ్ల గ్రామానికిచెందిన దుబ్బకాశయ్య ఇటీవల అనారోగ్యానికిగురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటిసి దేశంగోపాల్‌రెడ్డి ఆదివారం కాశయ్య కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.







# ఎడతెరిపిలేని వర్షాలు.... నీట మునిగిన పంటలు





**ప్రజాపక్షం/నారాయణపేట్ జిల్లా / కొత్తపల్లి/ జడ్చర్ల**

నారాయణపేట్ జిల్లా ఉట్కూర్ మండల పరిధిలో గ్రామాలలో వారం రోజులుగా ఏడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. ఈక్రమంలో పంటలు చాలా ఎకరాలు నీటిలో ము నిగాయి. పత్తి, వరి, కంది పంటలు నీట మునిగడంతో తాము చాలా నష్టపోయామని రైతులు ప్రభుత్వానికి ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం తమను ఆదుకోవాలని, నష్టపోయినా పంటలకు నష్టపరిహారం, అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

### పొంగిపోర్లుతున్న వాగులు వంకలు

కొత్తపల్లి మండల వ్యాప్తంగా గత ఐదు రోజుల నుండి ఎడతెరపి లేని వర్షాలకు వాగులు వంకలు పొంగిపోర్లుతున్నాయి. మండల పరిధిలోని భూనీడ్ నుండి మద్దూర్ వెళ్లాలి అనుకుంటే బ్రిడ్జి తక్కువ ఎత్తులో ఉండటం వల్ల అమ్మ చేరువు నుండి వచ్చిన నీరు బ్రిడ్జిపై నుండి పారుతుంది. భూనీడ్ నుండి పట్టణాలకు వేళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు.కొత్తపల్లి, భూనీడ్ వాగులో బ్రిడ్జి నిర్మాణంలో ఉన్నందువల్ల ప్రయాణికులకు అటువైపు వేళ్లలేకపోతున్నారు. భూనీడ్ అమ్మ చెరువు నిండి కొయిల్ సాగర్‌కు ఉధృతంగా ప్రవహిస్తున్నది. మండలంలోని గ్రామాల ప్రజలు వాగు పరిసర ప్రాంతాల రైతులు జోరుగా వరి నాట్లు వేస్తూన్నారు. అటువైపు పంటపోలాలు ఉన్న రైతులు మాత్రం వాగులో ప్రాణాలను అరచేతిలో పట్టుకొని వాగును దాటుతున్నారు. గత మూడు సంవత్సరాల క్రితం పొలానికి వేల్లిన భూనీడ్ గ్రామానికి చెందిన రైతు వాగులో కొట్టుకోపోయి మరణించాడు. అధికారులు స్పందించి ఇప్పటికైనా వాగులో ఉన్న వంతెనలను ఎత్తుకు పెంచి నిర్మాణం చేపట్టాలని రైతులు, ప్రయాణికులు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### భారీ వర్షాలకు అలుగు పారిన పోలేపల్లి చెరువు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోలేపల్లి చెరువు అలుగు పారడంతో పోలేపల్లి–కిష్టారం మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. రోడ్డుపై నుండి భారీగా వరద నీరు పారడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. పోలేపల్లి పారిశ్రామిక సేజ్ లో పనిచేసే కిష్టారం చుట్టుపక్కల గ్రామాల వారు కంపెనీలలో పని చేయడానికి రావాలంటే ఉదండపూర్ రోడ్డు ద్వారా వచ్చి కావరంపేట నుండి పోలేపల్లి కంపెనీలకు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా పోలేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న కిష్టారం గ్రామ విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులక గురవుతున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## పోలీస్ జాగిలం సేవలు మరువలేని



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నేర పరిశోధనలో సాటి లేని జాగిలం,వాసన పసిగట్టిందంటే వదిలి పెట్టని నైజం అనేక కీలక కేసులలో నేరస్థులను డిటెక్ట్ చేసి పోలీస్ శాఖకు వెన్ను దన్నుగా నిలిచి దాదాపు 12 సంవత్సరాల కాలం పాటు విధి నిర్వహణలో విశేష సేవలు అందించి అనారోగ్య కారణంగా మరణించడం బాధాకరం అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. నల్లగొండ జిల్లా పోలీస్ శాఖలో డాగ్ స్క్వాడ్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ జాగిలం పింకీ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తుది శ్వాస విడిచింది. జిల్లా ఎస్‌పి సూచనల మేరకు అడిషనల్ ఎస్‌పి రమేష్ పూలమాల వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించి అధికార లాంఛనాల తో అంత్య క్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు,ఆర్ఐ సంతోష్, ఆర్ఎస్ఐ రాజీవ్,డాగ్ హ్యాండ్లర్ నాగరాజు,డాగ్ స్క్వాడ్ సిబ్బంది కరుణాకర్,సంపత్,సతీష్, గోపాల్, మహేంద్ర,నరేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



## చల్లని తల్లి ముత్యాలమ్మ
### జాతరలో సిపిఐ నాయకుల సందడి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** అమ్మలగన్నమ్మ చల్లని తల్లి ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,పాడిపంటలు సమృద్ధిగా పండి ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని సిపిఐ పార్టీ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,మాజీ శాసనసభ్యులు పల్లా వెంకటరెడ్డి,ఉజ్జిని యాదగిరిరావు,సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు,పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ,జిల్లా కౌన్సిల్ సభ్యులు యల్లావుల రమేష్‌లు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ఊరచెరువు వద్దనున్న పోచమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూర్‌నగర్‌లో మత్యాలమ్మతల్లి జాతరను చూస్తుంటే సామాజిక,సాంస్కృతిక ప్రాంతీయ ఏకత్వం కనిపిస్తుందన్నారు. అన్నివర్గాల ప్రజలు జాతరలో పాల్గొనడం విశేషమని అన్నారు. ప్రజల ఆనవాయితీ అంశాల పట్ల సిపిఐ మద్దతిస్తుందన్నారు.

## బుద్ధవనం సందర్శించిన కాలుష్య నియంత్రణ బోర్డ్ కార్యదర్శి



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రం బుద్ధవనాన్ని ఆదివారం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి గుగులోతు రవి కుటుంబ సమేతంగా సందర్శించారు. సాగర్ సందర్శనలో భాగంగా నాగార్జున సాగర్ ప్రధాన డ్యామ్, ఎత్తిపోతల జలపాతాన్ని, నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించిన అనంతరం బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధవనంలోని బుద్ధ పాదాల వద్ద వందనం సమర్పించిన అనంతరం బుద్ధ చరిత వనం, జాతకవనం, ధ్యాన వనం, స్తూప వనాలను సందర్శించి మహాస్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో కొద్దిసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవి చంద్రులు అయన చేత బుద్ధ జ్యోతి వెలిగింపజేసి పంచశీల కండువాలతో సన్మానించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ డ్యాం వివరాలను, నాగార్జునకొండ, బుద్ధవనం చారిత్రక విశేషాలను వివరించారు. వీరితోపాటు రెవెన్యూ ప్రోటోకాల్ ఆఫీసర్ దండా శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## అక్తర్ పాషా మృతి సిపిఐకి తీరనిలోటు



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు అక్తర్ పాషా అనారోగ్యంతో మృతిచెందడం పార్టీకి తీరనిలోటు అని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వై. దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అక్తర్ పాషా పార్థివ దేహానికి పూలమాలలు వేసి, సిపిఐ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్తర్ పాషా తండ్రి చాంద్‌పాషా, తాత అబ్బాస్‌లు మొదటి నుండి పార్టీలో ఉంటూ ఉద్యమాలలో పాల్గొని పార్టీ ఎటువంటి కార్యక్రమం నిర్వహించిన పూర్తి చేసేవారని తాత, తండ్రి అడుగుజాడల్లోనే అక్తర్ పాషా కూడా సిపిఐలో కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో నిర్వహించారన్నారు. అక్తర్ పాషా కుటుంబానికి సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రన్న, రాష్ట్ర సమితి సభ్యులు ఆది సాయన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర, సినియర్ నాయకులు దయాకర్‌రెడ్డి, సిపిఐ మండలకార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులు బక్కయ్య, వెంకన్న, స్వామి, చంద్రయ్య ఉన్నారు.

## కస్తూర్బా గాంధీకి అందని బాలికల దుస్తులు

**ప్రజాపక్షం/ ఉండవెల్లి :** కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తల్లిదండ్రులు లేని పిల్లలు దిక్కులేని వాళ్లకు విద్యా బోధనలు కొనసాగుతున్నాయి. పేద బాలికలకు ప్రభుత్వం చేయూత అందించడంలో విఫలమైందని చెప్పవచ్చును. వివరాల్లోకి అలంపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు దుస్తులు అందని దుస్థితి ఉన్నది. పాఠశాలలు పునర్ ప్రారంభమై మూడు నెలలు కాలం చెల్లుతున్న కొత్తగా కస్తూర్బాలో అడ్మిషన్ అయిన చేరిన విద్యార్థులకు దుస్తులు పెట్టేలు కాస్మోటికి చార్జీలు తదితర వంటివి ఇవ్వడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకుంటున్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు మాత్రం వసతులు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైన విమర్శలు ఉన్నాయి. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులు మంది విద్యార్థులకు విద్యా బోధనలు సాగుతున్నట్లు కొత్తగా వచ్చిన విద్యార్థులు సుమారు 20 మంది వీళ్లకు మాత్రం ఎటువంటి దుస్తులు లేకపోవడం అందించే సహాయం లేదని అధికారులు వెల్లడించారు. 2022 సంవత్సరంలో కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాలలోనే జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. బైపీసీ ఎంపీసీ విద్యార్థులకు మాత్రమే చదువుకోడానికి అవకాశం ఉన్నదని. సిఐసి, హెచ్ ఇసి గ్రూపు లో ఒక అవకాశం లేకపోవడంతో పేద విద్యార్థులు చదువుకోలేని పరిస్థితులు కనబడుతున్నాయి. కస్తూర్బా జూనియర్ కళాశాల విద్యార్థులకు అదనపు గదులు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులు కొత్త నడకన నడవడం వలన నేటి కి విద్యార్థులకు ప్రత్యేకంగా కస్తూర్బా జూనియర్ కళాశాల ఏర్పాటుకు అవకాశం లేకుండా పోయింది.

# కాసుల కక్కుర్తితో... కడుపులోనే ఛిద్రం!

ఆగని భ్రూణ హత్యలు..
సూర్యాపేట జిల్లాలో రోజుకోచోట వెలుగులోకి..
నిద్రావస్థలో వైద్యఆరోగ్యశాఖ అధికారులు..

**కాసుల కక్కుర్తితో కొందరు వైద్యులు గర్భస్థ శిశువులను కడుపులోనే చిదిమేస్తున్నారు. భ్రూణ హత్య నేరమని ప్రభుత్వం దీనిని అరికట్టేందుకు ఎన్ని చట్టాలను తీసుకువచ్చినా ఏ మాత్రం ఆగడంలేదు. సూర్యా పేట జిల్లాలో గత కొన్ని నెలలుగా ఏదో ఒక చోట భ్రూణ హత్య జరిగిన సంఘటనలు రోజుకు ఒకటి వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా తుంగతుర్తి మండల కేంద్రంలో అబార్షన్ చేస్తుండగా వికటించి ఓ గర్భిణి శనివారం మృతి చెందడం కలకలం రేపింది. దీనిని అరికట్టాల్సిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిద్రావస్థలో ఉండడంతోనే ఇలా జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**


**ప్రజాపక్షం/సూర్యాపేట :** నేడు సమాజంలో ఆడపిల్లలకు జన్మనివ్వడం తల్లిదండ్రులు భారంగా భావిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు వైద్యులు కాసులకు కక్కుర్తిపడి స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో కుమ్మక్కై చట్టవ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు. పుట్టబోయే బిడ్డ ఆడా? మగా? అనేది తెలియగానే ఆడ అని నిర్ధారణ అయితే గర్భస్థ శిశువును కడుపులోనే చిదిమేస్తున్నారు. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా 229 ప్రైవేటు ఆసుపత్రులు ఉండగా ఇందులో 35కు పైగా ప్రసూతి ఆసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు 45 స్కానింగ్ సెంటర్లు ఉండగా వీటిలో ఎక్కువగా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణ ప్రాంతాలలోనే అధికం. పట్టణ ప్రాంతాలలోని వైద్యులు ఆయా గ్రామాలలో పనిచేస్తున్న కొంతమంది గ్రామీణ వైద్యులను ఏజెంట్లుగా పెట్టుకొని ఈ తతంగం గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తున్నట్లు వెలుగు చూస్తున్నాయి. ఒక్కొక్క అబర్షన్‌కు రూ. 30 వేల నుండి 50వేల వరకు ఫీజు తీసుకొని కడుపులో పిండం కండ్లు తెరవకముందే చిదిమేస్తున్న పరిస్థితి. మే నెలలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రామలింగేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఓమెగా ఆసుపత్రిలో ఓ మహిళకు అబర్షన్ వికటించి మృతి చెందడంతో భ్రూణ హత్య వెలుగు చూసింది. ఇది మరువకముందే చర్చికంపౌండ్‌లో బాప్టిస్ట్ చర్చి ఎదురుగా ఓ గ్రామీణ వైద్యుడు ఎలాంటి అనుమతులు లేకుండా, గుట్టుచప్పుడు కాకుండా ఓ ప్రత్యేక గదిలో స్కానింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసి గత కొంతకాలంగా గర్భిణీలకు స్కానింగ్‌లు నిర్వహిస్తున్నట్లు గత నెలలో బయటపడింది. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా పట్టణంలోని మరో ప్రైవేటు ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తున్న నిర్వాహకుడితో కలిసి ఇలా చేస్తున్నట్లు తేలింది. ఇదిలా ఉండగా కోదాడ,



హుజూర్‌నగర్ ప్రాంతాలలో కూడా భ్రూణ హత్యలు విచ్చలవిడిగా జరుగుతున్నట్లు సమాచారం. తాజాగా తుంగతుర్తి మండల కేంద్రంలోని సాయిబాలాజీ ఆసుపత్రిలో ఓ గర్భిణీకి అబర్షన్ చేయగా తీవ్ర రక్తస్రావమై మృతి చెందిన సంఘటన శనివారం బయటపడింది. మండలంలోని సంగెం గ్రామానికి చెందిన బయ్యగళ్ళ విజిత (26)కు గోరెంట్ల గ్రామానికి చెందిన శ్రీనుతో వివాహం జరుగగా వారికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. ఇటీవల విజిత మూడవ సారి గర్భం దాల్చగా ఈనెల 15న కడుపు నొప్పి రావడంతో పరీక్షల కోసం తుంగతుర్తిలోని సాయిబాలాజీ ఆసుపత్రికి వెళ్ళగా అక్కడి ఆర్‌ఎంపి వైద్యుడు బండి శ్రీను దగ్గరకు ఆమెను తీసుకవచ్చారు. స్కానింగ్ చేయించమని వైద్యుడు చెప్పడంతో పిండం ఎదుగుదల లేదని స్కానింగ్‌లో తేలడంతో తొలగించాలని వైద్యుడు సూచించినట్లు విజిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇందులో వాస్తవం ఎంత అన్నది ఆమె కుటుంబ సభ్యులకు, సదరు డాక్టర్‌కే తెలియాలి. కుటుంబ సభ్యుల ఆమోదంతో వైద్యుడు బండి శ్రీను ఆమెకు అబర్షన్ చేస్తుండగా
తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి హుటాహుటిని తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న విజిత శనివారం ఆమె మృతి చెందింది. ఆమె మృతికి స్థానిక వైద్యుడే కారణమంటూ అక్కడి వైద్యులు చెప్పడంతో మృతదేహంతో అతడి ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగడంతో భ్రూణ హత్య అన్న విషయం వెలుగు చూసింది.
సూర్యాపేట జిల్లాలో రోజుకోచోట భ్రూణ హత్యలు వెలుగు చూడడం కలకలం రేపుతుంది. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం ఎన్ని చట్టాలు తీసుకవచ్చినా ఏ మాత్రం ఆగడంలేదు. వైద్యులు అబర్షన్లు చేస్తే నేరమని తెలిసినా కాసులకు కక్కుర్తిపడి కడుపులోని పిండాన్ని తీసివేస్తున్నారు. వీరికి ఆయా పార్టీల రాజకీయ నాయకుల అండదండలు ఉండడం, కొంతమంది వైద్యఆరోగ్యశాఖ అధికారుల చేతులు తడపడంతోనే విచ్చలవిడిగా భ్రూణ హత్యలు జరుగుతున్నాయని చర్చ పెద్దఎత్తున సాగుతుంది. ఇక్కడ జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారిగా గతంలో పనిచేసిన డాక్టర్ కోటాచలం అవినీతి ఆరోపణలతో బదిలీవేటుకు గురైన విషయం అందరికి తెలిసిందే. అతడు వెళ్ళిన తర్వాతనైన వైద్యఆరోగ్యశాఖలో మార్పులు వస్తాయని అందరూ భావించినా ఏ మాత్రం రాలేదని స్పష్టమవుతుంది. భ్రూణ హత్యలను అరికట్టాల్సిన వైద్యఆరోగ్యశాఖ అధికారులు నిద్రావస్థలో ఉండడంతోనే ఇవి పునరావృతం అవుతున్నాయని వాదన వినిపిస్తుంది. ఇప్పటికైన అధికారులు స్పందించి భ్రూణ హత్యలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ముత్యాలమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి
### మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** తెలంగాణ రాష్ట్రంలోనే హైదరాబాద్ లాల్ దర్వాజ బోనాల రాష్ట్రంలో రెండవ అతిపెద్ద బోనాల పండుగ హుజూర్‌నగర్‌లోనే జరుగుతుందని, ఎంతో మహిమ కలిగిన తల్లి ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని,పాడిపంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,అష్టైశ్వార్యాలతో కలకాలం వర్ధిల్లాలని తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. హుజూర్‌నగర్‌లో అత్యంత వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో మూడు రోజుల పాటు అంగరంగ వైభవం గా జరిగే ముత్యాలమ్మ పండుగలో మొదటిరోజు ఆదివారం పోచమ్మతల్లి జాతరలో మంత్రి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజ లు చేశా రు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.
**వ్యవసాయ కళాశాలకు స్థలపరిశీలన....** హుజూర్‌నగర్ పట్టణంలోని మగ్ధుంనగర్‌లో 1041 సర్వేనంబర్‌లో గల వ్యవసాయ భూములను ఆచార్య జయశంకర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జానయ్య గౌడ్,యూనివర్సిటీ అధికారులతో కలిసి తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యవసాయ కళాశాల ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈప్రాంతంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసినట్లయితే పట్టణానికి సమీపంలో ఉండి విద్యార్థులకు అనుగుణంగా ఉంటుందని, రోడ్డు,రవాణా తదితర సౌకర్యాలు కూడా ఉన్నాయని మంత్రి తెలియజేశారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్,ఆర్డీఓ శ్రీనివాసులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పెన్షన్లు పెంచకపోతే గద్దె దిగాల్సిందే...
### సిఎం రేవంత్‌కు మందకృష్ణ మాదిక హెచ్చరిక




**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండలో ఆదివారం చేయూత పెన్షన్ దారుల సన్నాహక సభ పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ రూ. 6వేలకు, వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలతో పాటు చేయూత పెన్షన్లన్నీ నాలుగు వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన సభకు పెద్ద ఎత్తున వికలాంగులు, జనం హాజరైయ్యారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి పెన్షన్ దారులను మోసం చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గ దుస్తున్న నేటికి పెన్షన్లు పెంచలేదని ఎద్దేవా చేశారు. పెన్షన్లను పెంచేంతే వరకు తన పోరాటం ఆపేది లేదని ఆయన సృష్టం చేశారు. సెప్టెంబర్ 03న హైదరాబాద్‌లో జరిగే చేయూత పెన్షన్ దారుల మహా గర్జన కు ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. విహెచ్‌పిఎస్ నేత గుద్దేటి సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విహెచ్‌పిఎస్ నేత వెంకటాచారి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవింద్ నరేష్ మాదిగ, జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలంమాదిగ, ఎంఆర్‌పిఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జీ గోపాల్, ఎంఎస్‌ఎఫ్ నియోజకవర్గ ఇంచార్జీ శ్రీకాంత్, ఎంజెఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ దర్శనం విష్ణు, కాసిం, భీష్మాచారి, సత్యనారాయణ, శ్రీరాం, జగదీష్, కృష్ణ, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## అతి తక్కువ ఫీజులతో బిఆర్‌ఓయులో ఉన్నత విద్య

అడ్మిషన్లు పొందెందుకు
ఈనెల 30 చివరి గడువు
అడ్మిషన్లలో ఉమ్మడి నల్లగొండను ప్రథమ స్థానంలో ఉంచాలి : జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ధర్మానాయక్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025/26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పిజి కోర్సులలో అతి తక్కువ పీజులతో అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 30 వరకు చివరి గడువు ఉందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి. ధర్మానాయక్ తెలిపారు. ఆదివారం నల్లగొండ లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ధర్మానాయక్ మాట్లాడుతూ అతి తక్కువ పీజుతో దేశంలో ఏ యూనివర్సిటీ అందించిని ఉన్నత విద్యను కేవలం బిఆర్ఓయులో బిఎ, బికాం, బిఎస్‌సి, ఎంఎ, ఎంకాం, ఎం ఎస్‌సి, డిప్లొమా కోర్సులలో చదువుకునేదుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం కోసం యూనివర్సిటీ విసి డాక్టర్ గంట చక్రపాణి తీసుకున్న నిర్ణయంతో సమత ఫ్రీషిప్లు నిపుణ ఫెలోషిప్లు ఇవ్వబోతున్నామన్నారు. సమత ఫ్రీషిప్ ఆదివాసీలు, ప్రాచీన గిరిజనులు, ట్రాన్స్ జెండర్ ప్రజలు, శారీరక వికలాంగులు దివ్యాంగులకు ఉచిత విద్యను అందించబోతున్నాంఅని తెలిపారు. ఇప్పటివరకు దేశంలో ఏ విశ్వవిద్యాలయం కూడా ఈ ప్రయత్నం చేయలేదని దీనివల్ల తెలంగాణలో ట్రాన్స్ జెండర్ తోపాటు దివ్యాంగులు, గోండు కోయ, చెంచు ఆదివాసులు ఎలాంటి ఫీజు లేకుండా ఉన్నత చదువులు చదువుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్ లేదా రెండు సంవత్సరాలు ఐటిఐ, ఓపెన్ ఇంటర్, 10+2 కోర్సు చదివిన వాళ్ళు పాలిటెక్నిక్ కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవచ్చన్నారు. బిఎ. బికాం. బిఎస్‌సి ద్వితీయ,తృతీయ సంవత్సర విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. డిగ్రీ, పీజీ రెండవ, మూడోవ సంవత్సర విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్, ఎన్‌జి కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పరంగి రవి,మహిళా డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ రాజారామ్,పున్న అంజయ్య,శ్రీకాంత్ ఉన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి
### లారీని వెనుకనుండి ఢీకొన్న డిసిఎం ఒకరు, ఆర్‌టిసి బస్సును పక్కనుంచి ఢీకొట్టడంతో మరొకరు



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం తెల్లవారుజామును ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే డిండి నుండి వరిధ్యానం లోడుతో దేవరకొండ వైపు వస్తున్న లారీని పోలేపల్లి నుండి దేవరకొండ వైపు కోళ్ల లోడుతో వస్తున్న డిసిఎం అతివేగంగా ఢీ కొనడంతో డిసిఎంలో ఉన్న భూతం లింగయ్య (45) అక్కడికక్కడే మృతి చెందగా డిసిఎం డ్రైవర్ సైదులుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న చందంపేట ఎస్ఐ సైదులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు లింగయ్య భార్య ఇందరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నట్లు సమాచారం



**ప్రజాపక్షం/డిండి:** డిండి మండలంలో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరగగా ఒకరు మృతి చెందగా, మరోకరికి త్రీవగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే చెరుకుపల్లి గ్రామానికి చెందిన ముడి శ్రీను, ముడి రాములు పనుల నిమిత్తం బొల్లనపల్లి గ్రామానికి వెళ్ళి తిరిగి వస్తుండగా పెద్ద తండా వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న ఆర్టీసి బస్సును పక్కనుండి ఢీకొనడంతో ముడి రాములు (58) తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, ముడి శ్రీనుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న డిండి ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలోని తేర్యాలకు చెందిన కనుకునూరి పవన్(23) శుక్రవారం మద్యాహ్నం మోటకొండూర్ మండల కేంద్రం పరిసర ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన తల్లి దండ్రులు, స్నేహితులు భువనగిరి ఏరియా అసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం చేయించడానికి నిమ్స్ పంజగుట్టకు తరలించారు. చికిత్స పోందుతూ ఆదివారం తెల్లవారుజాముున 2.30 గంటల సమయంలో మృతి చెందాడు. పోస్టుమార్టం చేసిన తర్వాత మృత దేహన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు, మృతుని పెదనాన్న కొడుకు మచ్చగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు.
పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన పవన్ కుమార్ కండ్లు అతని తల్లి దండ్రులు కనుకునూరి రమేష్, సుకన్యలు ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులకు నేత్ర దానం చేసినట్లు విలపిస్తూ తెలిపారు. చేతికి అందోచ్చిన కుమారుడు తమ కల్లముందే పురుగుల మందుతాగి మృతి చెందడంతో తల్లి దండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది. తెల్లారితే ఆదివారం బోనాల పండుగ సంబరాలలో ఊరంతా ఉండగా కనుకునూరి పవన్ మృతి చెందిన వార్త దావణంలా వ్యాపించడంతో తేర్యాల గ్రామంలో విశాదశాయలు అలముకున్నాయి. పవన్ అందరితో కలుపుగోలు ఉండే వ్యక్తి అని అతని మృతికి గ్రామస్తులు సంతాపం తెలియజేశారు.

# రీల్

## చర్చలతోనే సమస్య పరిష్కారం

పదమూడు రోజులుగా జరుగుతున్న సిని కార్మికుల సమ్మె పై నటుడు, దర్శకుడు ఆర్ . నారాయణ మూర్తి స్పందించారు.సినీ కార్మికులు నిర్మాతలు కలసి చర్చించు కొని సమస్యను పరిష్కరించుకోవాలి. కార్మికుల అడుగుతున్న వేతనాలు నిర్మాతలు పెంచాలి. కార్మికులను గౌరవిస్తూ వాళ్ల హక్కులను కాపాడాలి.మూడు యూనియన్లకు వేతనాలు పెంచకుండా మిగతా యూనియన్లకు పెంచడం ఏమిటి ? అందరితోపాటు ఆ మూడు యూనియన్ల కు నిర్మాతలు వేతనాలు పెంచాలి. నిర్మాతలు కోరుతున్న ఫ్లెక్సిబుల్ కాల్ షిట్. ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు కార్మికులుకూడా ఆలోచించాలి. ప్రస్తుతం మారుతున్న జీవన విధానంలో 6 నుంచి 6 టైమ్ నిర్మాతలకు ఇబ్బంది అవుతోంది అందుకే ఫెడరేషన్ కూడా ఆలోచించాలి. త్వరగా ఇరువురు సమ్మె విరమించి మళ్లీ షూటింగ్స్ తో కళకళ లాడాలి.కార్మికులు చర్చల ద్వారా సమస్య పరిష్కారం కాకపోతే నిరాహారదీక్ష చేస్తాము అని ఫెడరేషన్ సంఘాలు అంటున్నాయి. అక్కడవరకు పరిస్థితి రాకుండా చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలి. అని నారాయణ మూర్తి సూచించారు.



ఆర్. నారాయణ మూర్తి

## అమెరికాలో 43వ 'ది వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే పెరేడ్'లో విజయ్ దేవరకొండ

ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో అమెరికాలోని న్యూయార్క్ లో జరిగిన ది వరల్ లార్జెస్ట్ ఇండియా డే పెరేడ్ లో గ్రాండ్ మార్షల్ గా పాల్గొని సందడి చేశారు హీరో విజయ్ దేవరకొండ. మాడిసన్ అవెన్యూలో సర్వే భవంతు సుఖినః అనే థీమ్తో జరిగిన పరేడ్ వేడుకలకు గ్రాండ్ మార్షల్ గా విజయ్ దేవరకొండ వ్యవహరించారు. ఈ వేడుకల్లో స్థానిక అమెరికన్స్ తో పాటు భారీ సంఖ్యలో అమెరికాలోని ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రఖ్యాత ఎంపైర్ బిల్డింగ్ మన జాతీ య జెండాలోని మూడు రంగుల విద్యుత్ కాంతులతో వెలిగిపోయింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ మువ్వన్నెల లైటింగ్‌ను విజయ్ దేవరకొండ స్విచ్చాన్ చేశారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ప్రవాస భారతీయ సోదరులు మన దేశ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటుతున్నారు. ఎంపైర్



స్టేట్ బిల్డింగ్ పై మన మూడు రంగులు చూడటం సంతోషాన్ని కలిగిస్తోంది. దేశం కోసం వీళ్లు చేస్తున్న కాంట్రిబ్యూషన్ చూస్తుంటే గర్వంగా ఉంది. మన పెద్దలు ఎంతోమంది చేసిన త్యాగాలు, వారి కృషి వల్లే మనం ఇంత ఆనందంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోగలుగుతున్నాం అని విజయ్ దేవరకొండ అన్నారు.



## 'రాజా సాబ్' నిధి అగర్వాల్ బర్త్ డే పోస్టర్ రిలీజ్

బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ నిధి అగర్వాల్ రెబల్ స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్' చిత్రంలో నటిస్తూ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. శనివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా మూవీ టీమ్ బర్త్ డే విశెస్ తో స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ పోస్టర్ లో దేవుడిని ప్రార్థిస్తున్న నిధి అగర్వాల్ స్టిల్ ఆకట్టుకుంటోంది. ఈ మూవీలో నిధి అగర్వాల్ అందంతో పాటు నటనకు అవకాశమున్న ఇంపార్టెంట్ క్యారెక్టర్ లో కనిపించనుంది.'రాజా సాబ్' మూవీ తన కెరీర్ కు ఎంతో ప్రత్యేకంగా భావిస్తోంది నిధి అగర్వాల్. ఈ సినిమాతో తాను మరింతగా ప్రేక్షకుల అభిమానం సంపాదించుకుంటానని ఆశిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'రాజా సాబ్' సినిమాను టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్నారు. ఈ సినిమా త్వరలో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం.. ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.ప్రభాస్, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, సంజయ్ దత్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ కోటగిరి వెంకటేశ్వరరావు, సినిమాటోగ్రఫీ కార్తీక్ పళని, మ్యూజిక్ తమన్, ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మ ణ్, కింగ్ సోలొమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ టీజీ కృతి ప్రసాద్,కో ప్రొడ్యూసర్ వివేక్ కూచిభొట్ల, ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్ , రచన, దర్శకత్వం మారుతి.

## 'హలగలి' గ్లింప్స్ విడుదల

హీరో డాలీ ధనంజయ, సప్తమి గౌడ జంటగా సుకేష్ నాయక్ దర్శకత్వంలో యార్లగడ్డ లక్ష్మీ శ్రీనివాస్ సమర్పణలో కళ్యాణ్ చక్రవర్తి ధూళిపాళ్ల నిర్మిస్తున్న హిస్టారికల్ సినిమా 'హలగలి'. ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీలో చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ ని లాంచ్ చేశారు. ధనంజయ్యు కమాండింగ్ అవతార్ ప్రజెంట్ చేసిన గ్లింప్స్ గ్రేట్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో డాలీ ధనంజయ మాట్లాడుతూ.. . హలగలి అన్టోల్ స్టోరీ. ఈ సినిమాలో పార్ట్ కావడం గర్వంగా భావిస్తున్నాను. హలగలి కర్ణాటకలో గ్రేట్ ఎమోషన్. నిర్మాత కళ్యాణ్, డైరెక్టర్ సుకేష్ చాలా ప్యాషన్ తో ఈ ప్రాజెక్టుని రూపొందిస్తున్నారు. ఈ గ్లింప్స్ మీ అందరికీ నచ్చడం ఆనందంగా వుంది. మరిన్ని క్రేజీ అప్డేట్స్ రాబోతున్నాయి. తప్పకుండా సినిమా ఒక మంచి అవుతుందని అన్నారు. హీరోయిన్ సప్తమి గౌడ మాట్లాడుతూ ఈ సినిమా చేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఇది చరిత్రలో చాలా ముఖ్యమైన చాప్టర్. త్వరలోనే నా క్యారెక్టర్ కి సంబంధించిన గ్లింప్స్ కూడా రిలీజ్ కాబోతోంది. చాలా మాస్ క్యారెక్టర్ చేశాను. ఇది మన నేల కథ. డైరెక్టర్ చాలా అద్భుతంగా రాశారు. చాలా బిగ్ స్కేల్ లో ఈ సినిమా తీస్తున్నారు. ఈ సినిమాలో సెట్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. ధనుంజయ గారితో ఇది నా సెకండ్ ఫిల్మ్. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది అని చెప్పారు.ప్రొడ్యూసర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ కన్నడలో పదో తరగతి పాఠ్యాంశంలో కూడా ఇది ఉంది. దీని గురించి చాలా మంది రీసెర్చ్ లు చేశారు. . ఇది ఒక పార్ట్ లో చెప్పాల్సింది కాదు. రెండు పాటలుగా చెప్పాల్సిన కథని అప్పుడే నిర్ణయించుకున్నాము. సినిమాలో డాలీ క్యారెక్టర్ చాలా పవర్ఫుల్గా అద్భుతంగా ఉండబోతుంది. సప్తమిది మాస్ క్యారెక్టర్. అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు.అని పేర్కొన్నారు. డైరెక్టర్ సుకేష్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.





## ఆగస్టు 27న సుందరకాండ విడుదల

హీరో నారా రోహిత్ 20వ చిత్రం 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్ సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. టీజర్, పాటలు, ట్రైలర్ కు మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో నారా రోహిత్ మాట్లాడుతూ సుందరకాండ ట్రైలర్, సాంగ్స్ కి చాలా మంచి రెస్పాన్స్ ఉంది. ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఫ్యామిలీ అంతా కలిసి వెళ్లి ఈ సినిమాను చూడొచ్చు. సినిమా మొదలైనప్పుడు ఎంత హ్యాపీగా ఉన్నామో ఇప్పుడు అంతే హ్యాపీగా ఉన్నాం. వినాయక చవితికి ఈ సినిమా రిలీజ్ చేయడం చాలా హ్యాపీగా ఉంది అని అన్నారు. ఆగస్టు 27న ఈ సినిమా రిలీజ్ కాబోతోందని చెప్పారు.శ్రీదేవి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆగస్టు 27న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. మేమంతా ఎంతగానో ఎదురు చూస్తున్నాం. సినిమా మొత్తం చాలా ఎంజాయ్ చేశాం. చాలా కాలం తర్వాత ఈ సినిమా చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. మా సినిమా ట్రైలర్ ని లాంచ్ చేసిన ప్రభాస్ కి థాంక్యూ సో మచ్ అని ఆమె చెప్పారు. డాక్టర్ నరేష్ వి కె మాట్లాడుతూ.ఈ సినిమా జనాల్లోకి చాలా అద్భుతంగా వెళుతుంది. ఈ బజ్ ని మేము సెలబ్రేట్ చేసుకుంటున్నాము. ఒక రూల్ బ్రేక్ చేసి రొమాంటిక్ కామెడీ తీసినప్పుడు అది ఎప్పుడు కూడా సక్సెస్ అవుతుంది.ఈ సినిమా తర్వాత పెద్ద డైరెక్టర్ అవుతాడు. ఇలాంటి రొమాంటిక్ కామెడీ ఇప్పటి వరకు రాలేదు అన్నారు. ఈ సమావేశంలో వాసుకి, డైరెక్టర్ వెంకటేష్ , నిర్మాత సంతోష్ పాల్గొన్నారు. నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, సత్య, అజయ్, వీటీవీ గణేష్, అభినవ్ గోమటం, విశ్వంత్, రూప లక్ష్మి , సునైనా, రఘు బాబు నటించారు.

## బిజెపి చేతిలో ఎన్నికల సంఘం కీలుబొమ్మ

### సిపిఐ మాతో ఉంది, తమిళనాట మళ్ళీ గెలుపు మాదే
### తమిళనాడు సిపిఐ రాష్ట్రమహాసభలో ముఖ్యమంత్రి స్టాలిన్



**సేలం:** కేంద్ర ఎన్నికల సంఘం బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ విమర్శించారు. ''భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) మా పక్షానే ఉంది, వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో కూడా తమ పార్టీయే విజయం సాధిస్తుంది, ద్రవిడియన్ నమూనా 2.0 ప్రభుత్వాన్ని మళ్ళీ ఏర్పాటు చేస్తాం అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సేలంలో నాలుగురోజులపాటు జరిగే సిపిఐ తమిళనాడు రాష్ట్రమహాసభల్లో రెండోరోజు శనివారం నాటి సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. ఈ సభలో పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా కూడా పాల్గొని ప్రసంగించారు.వివిధ ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక పార్టీలకు చెందిన నాయకులతో పాటు సభావేదికను పంచుకున్న స్టాలిన్ మాట్లాడుతూ, ''ఎన్నికలను బిజెపి ఒక వంచనగా, అపహాస్యంగా మార్చేసింది, కేంద్ర ఎన్నికల సంఘం అధికార బిజెపి చేతిల్లో కీలుబొమ్మగా మారింది, బిజెపి కూర్చిన స్వరాలకు అనుగుణంగా నాట్యం చేస్తున్నది, చివరకు వారు ఓటర్ల జాబితాలను వారు తారుమారు చేయడం కూడా ప్రారంభించారు,ఈరోజున భారత ప్రజాస్వామ్యం దాడులకు గురవుతోంది, బిజెపి ఇప్పుడు ఎన్నికల సంఘంలో తమకు అనుకూలంగా ఉండే ఉన్నతాధికారులను నియమించుకోవడం మాత్రమేకాదు, ఓటర్ల జాబితాలలో కూడా బిజెపి జోక్యం చేసుకుంటున్నది, ఓట్ చోరీ జరిగిందని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన విమర్శలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పడానికి బదులుగా, ఒక అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం దాఖలు చేసింది, దీనిబట్టే తెలుస్తోంది, ఎన్నికలసంఘం ఏ స్థాయికి దిగజారిపోయిందో'' అని ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శించారు. 2021లో తమిళనాడులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మేం విజయం సాధించాం, వచ్చే ఏడాది 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మేం మళ్ళీ గెలుస్తాం, ద్రవిడియన్ నమూనా 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం, కమ్యూనిస్టులు మా పక్షానే ఉన్నారు'' అని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి చరిత్రను కూడా వక్రీకరిస్తోందని స్టాలిన్ విమర్శించారు. అదేవిధంగా ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామిపై కూడా స్టాలిన్ తన ప్రసంగంలో విమర్శల దాడి చేశారు. ''మన కూటమిలో ఎవరూ ఎవరికీ బానిస కాదు, మన సైద్ధాంతిక భావజాలాన్ని అర్థం చేసుకోకుండా పళనిస్వామి అహంకారంతో మాట్లాడుతున్నారు, కమ్యూనిస్టుపార్టీ నాయకులతోనో లేదా తిరుమవలవన్‌తో పోల్చిచూస్తే ఆయన ఏం గొప్ప త్యాగాలు చేశారని మిడిసిపాటు?'' అని స్టాలిన్ ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి కేంద్రీకరించడానికి బదులుగా ఎఐఎడిఎంకె పార్టీ కూటమిలో ఉన్న నాయకులను అవమానించి, వారిని అప్రదిష్ఠపాలు చేయడంపైనే దృష్టి సారిస్తున్నారు'' అని విమర్శించారు.

**సేలం సెంట్రల్ జైలులో కమ్యూనిస్టు స్మారక హాలు నిర్మాణం**

సేలం సెంట్రల్ జైలులో 1950 ఫిబ్రవరి 11వ తేదీన జరిగిన కాల్పుల సంఘటనను ఎం.కె.స్టాలిన్ సిపిఐ రాష్ట్ర మహాసభలో ప్రసంగిస్తూ గుర్తుచేసుకున్నారు. ఈ కాల్పుల్లో 22 మంది కమ్యూనిస్టు ఖైదీలు ఈ కాల్పుల్లో మరణించారని, వారి త్యాగాలకు గుర్తుగా సేలం సెంట్రల్ జైలులో ఒక స్మారక హాలు నిర్మిస్తామని, వెంటనే ఈ హాలు నిర్మాణ పనులు కూడా ప్రారంభం అవుతాయని ఈ మేరకు తాను ఉత్తర్వులు ఇచ్చారని స్టాలిన్ కరతాళ ధ్వనులమధ్య చెప్పారు. తమిళనాడు రాష్ట్ర సిపిఐ కార్యదర్శి ఆర్.ముత్తరాసన్ చేసిన విజ్ఞప్తి మేరకు తాను ఈ నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేశానని చెప్పారు. స్టాలిన్ కూడా ఐదు కిలోమీటర్ల రోడ్ షోలో పాల్గొన్నారు. సేషంపట్టి నుండి ధర్మపురి అదనపు కలక్టరరేట్ భవనం సమీపంలో ఉన్న సర్క్యూట్ హౌస్ వరకూ ఈ రోడ్ షో జరిగింది. ఇదిలా ఉండగా, నాలుగురోజుల పాటు సేలంలో జరుగుతున్న సిపిఐ రాష్ట్రమహాసభల్లో రెండోరోజు శనివారంనాడు రాజకీయ, సంస్థాగతమైన, సైద్ధాంతిక సమస్యలపై చర్చలు జరిగాయి. తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రతినిధులు, జాతీయ నాయకత్వం సమక్షంలో ఈ చర్చలు జరిగాయి.

## స్తంభించిన ఇజ్రాయెల్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష నాయకుడు యైర్ లపిడ్ తదితరులు రాజధాని టెల్‌అవీవ్‌లోని హోస్టేజ్ స్క్వేర్ వద్ద ఈ సందర్భంగా మాట్లాడారు. బందీల విడుదల కోసమే ఈ రోజున దేశం అంతా స్తంభించిపోయిందన్నారు. ప్రభుత్వం తన ప్రయోజనాలకోసం వాడుకోవడానికి బందీలు చదరంగంలో పావులు కాదని ఆయన హెచ్చరించారు. బందీలు ఇళ్ళకు తిరిగి వచ్చేవరకూ తమ పోరాటం కొనసాగుతుందన్నారు. విడుదలైన బందీ ఆర్బెల్ యెహౌస్ మాట్లాడుతూ, హమాస్‌పై సైన్యంఒత్తిడి చేస్తుంటే, బందీలను వారు చంపేస్తూ ఉంటారన్నారు. హమాస్ వద్ద ఇంకా బందీలుగా ఉన్నవారిని సంప్రదింపుల ద్వారా వెనక్కు తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేయకుండా యుద్ధాన్ని విస్తరించాలని ప్రభుత్వం ప్రయత్నించడాన్ని తీవ్రంగా విమర్శించారు. ''బందీగా ఏం జరుగుతుందో తనకు అనుభవపూర్వకంగా తెలుసు, ప్రభుత్వం నుండి ఎలాంటి ఒత్తిడి వస్తుందో, అలాంటి సమయంలో బందీలపట్ల ఉగ్రవాదుల ప్రతిస్పందన ఏ విధంగా ఉంటుంటో నాకు ప్రత్యక్షంగా తెలుసు, అలాంటి సమయాల్లో బందీలను చంపేయడం తప్ప వేరే ఆలోచన చేయరు, అందువల్ల ఇప్పటివరకూ ప్రాణాలతో ఉన్న బందీలను చర్చల్లో ఒప్పందం ద్వారా గౌరవంగా వెనక్కు తీసుకురావడమే మేలైన ఆలోచన'' అన్నారు. ''బందీలను భూగర్భంలో దాచిపెడతారు, అక్కడ బందీలకు ఊపిరి అందదు, మంచినీరు లభించదు, గుండెల నిండుగా గాలి పీల్చుకోవడానికి ఆక్సిజన్ కూడా లభించదు, ఈ పరిస్థితుల్లో బందీలను వీలైనంత త్వరగా విడుదల చేసి తీసుకురావాలి, ఇప్పటికే మనం హమాస్ విడుదల చేసిన అనేక వీడియోలు చూశాం కదా, బందీలు దుర్భర పరిస్థితుల మధ్య జీవిస్తున్నారు'' అని ఆర్బెల్ యెహౌస్ అన్నారు. గడచిన జనవరి నెలలో బందీల చెర నుండి విడుదలైన ఆర్బెల్ యెహౌస్ మొత్తం 482 రోజులు హమాస్ ఉగ్రవాదుల చెరలో బందీగా ఉన్నారు. ఈయనతోపాటు బిబాస్ అనేక వ్యక్తిని కూడా జనవరిలోనే హమాస్ విడుదల చేసింది. కానీ బిబాస్ భార్య షిరి, వారి కుమార్తె ఏరియల్, బేబీ ఫిర్‌లను బందీగా ఉన్న సమయంలోనే ఉగ్రవాదులు చంపేశారు. సమ్మె సందర్భంగా పలుచోట్ల 32 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రధానమంత్రి కార్యాలయం అజ్జా వీధిలో కూడా వందలాది మంది కార్మికులు, ప్రదర్శకులు బ్యానర్లు ప్రదర్శిస్తూ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. రాజధానికి వెళ్ళే కీలకమైన సొరంగమార్గంలో ప్రదర్శకులు బైఠాయించారు. పోలీసులు వారిని ఈడ్చుకుని లాక్కుపోయారు. అనేకమందిని అరెస్టు చేశారు. ప్రదర్శనను ఆర్థికమంత్రి బెంజాలాల్ స్మోట్రిక్ తీ వ్రంగా విమర్శించారు. శత్రువుకు లొంగిపోయేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, దీనివల్ల శత్రువుకే మేలు జరిగే ప్రమాదం ఉందని విమర్శించారు.

**డిమాండ్లు నెరవేరిస్తేనే యుద్ధం ఆపుతాంఃనెతన్యాహూ :** హమాస్ ఉగ్రవాదులు తమ డిమాండ్లకు తలొగ్గితేనే గాజాలో యుద్ధం విరమిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ మరోసారి ఉద్ఘాటించారు. గాజాలో బందీలుగా ఉన్న 50 మంది ఇజ్రాయెలీ పౌరులను ఒకేసారి విడుదల చేయాలని, హమాస్ ఉగ్రవాదులు ఆయుధాలు వదిలిపెట్టాలని, గాజాను ఆయుధాలు లేని ప్రాంతంగా మార్చాలని, గాజాపై హమాస్ పెత్తనం, వారి పాలన ఉండకూడదని, హమాస్ ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలించాలని ఈ షరతులకు అంగీకరించి సమగ్ర ఒప్పందం చేసుకుంటే గాజాలో యుద్ధాన్ని విరమిస్తామని, సైన్యాన్ని వెనక్కు తరలిస్తామని నెతన్యాహూ స్పష్టం చేశారు.

### మిగులు జలాల్లో వాటాలు తేలిన తరువాతే
## గోదావరిపై కొత్త ప్రాజెక్టు
### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మిగులు జలాల్లో తెలుగు రాష్ట్రాల వాటాలు తేలిన తర్వాతనే గోదావరి నదిపై ఎలాంటి కొత్త ప్రాజెక్టులు నిర్మించినా అది చట్టబద్ధంగా, న్యాయంగా ఉంటుందని డిప్యూటీసిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నీటి వాటాలను నిర్ధారించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం పౌర హక్కులను కాలరాయడమేనని అన్నారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన 'ఓట్ల చోరీ' నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క, మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కంటే తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని అన్నారు. నదీ జలాల కోసమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని,ప్రస్తుతం తమ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయి, నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే మిగులు జలాల అంశంపై ఒక స్పష్టత వస్తుందని తెలిపారు. అర్హులైన ఓటర్లను తొలగించి, బోగస్ ఓట్లను చేర్చడం ద్వారా బిజెపి లబ్ధి పొందిందని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా మోదీ ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తు చేశారు. అయినప్పటికీ, ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని భట్టి మండిపడ్డారు. ఏపిలో కూడా కాంగ్రెస్ పార్టీ బలపడుతుందన్నారు.

## పోరాట యోధుడు అయోధ్య

(మొదటి పేజీ తరువాయి)







పోరిక బలరామ్ నాయక్, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎండి మౌలాన, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు నివాళ్లర్పించారు. సంస్మరణ సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉన్నది ఉన్నట్లు కుండబద్దు కొట్టేలా మాట్లాడే వ్యక్తిత్వం గల మనిషి అయోధ్య లేకపోవడం చాలా విచారకరం. సూర్యాపేట ప్రాంతం నుండి ఇక్కడికి సామాన్య వ్యక్తిగా వచ్చిన ఆయన అసమాన నాయకునిగా గుర్తింపు పొందారన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఏనాడూ తన గురించి ఆలోచించుకోకుండా పేదలకు, బడుగు బలహీన వర్గాలకు, నిర్భాగ్యులకు ఎర్ర జెండా తరుపున ఏదైనా చేయాలని తపనతోనే ఆఖరిదాగా జీవించారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం భుజాన ఎత్తుకున్న ఎర్రజెండాను కిందపడనీయకుండా, ఆ జెండా రెపరెపలు ఎక్కడా వాడిపోనికుండా చేశారని, ఆఖరికి అదే ఎర్రజెండా కప్పుకుని మాయమైపోయారని కంటతడి పెట్టారు. సమస్యల పరిష్కారం కోసం ఎందాకైనా పోరాడే నైజం ఉన్న ఆయన అవసరాన్ని బట్టి ఎక్కడ తగ్గాలో, నెగ్గాలో కూడా తెలిసిన వ్యక్తి అన్నారు. శాస్త్రీయ దృక్పదం గల మేధావిగా, సమాజా శ్రేయస్సు పట్ల ప్రేమ, తృష్ణ ఉన్న నేత అని, కనీస సౌకర్యాలు లేని రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు ఆయన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిలబడ్డారని, నిర్భందాలు, ధౌర్జన్యాలు, అన్యాయాలు, అక్రమాలను సైతం ఎదుర్కొన్నారని చెప్పారు. మైసా కొండయ్య, పాకాలపాటి పెద్దబ్బాయి, దాట్ల వెంకటేశ్వరబాబు వంటి నాయకులతో కలిసి బలమైన పోరాటాలు చేశారని, దమీందారీ వ్యవస్థకు ఎదురొడ్డి నిలబడి భూమిలేని పేదలకు భూములు పంచారని, నిరుపేదలకు అండగా ఉన్నారని, పోడుభూములకు పట్టాలు ఇప్పించే విషయంలోనూ, బిటిపిఎస్ నిర్వాసితులకు హేతుబద్ధమైన ప్యాకేజి ఇప్పించి నిర్వాసిత కుటుంబాల్లోని యువతకు ఉద్యోగాల కల్పనలో ఆయన చేసిన కృషి చిరకాలం గుర్తుండి పోతుందన్నారు. ఈ ప్రాంత కమ్యూనిస్టు శిఖరంగా పార్టీని ముందుడి నడిపిన అయోధ్య భౌతికంగా మన మధ్య లేడంటే ఇప్పటికీ నమ్మలేకుండా ఉన్నామని, ఆయన వదిలి వెళ్లిన ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేసిన నాడే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని ఈ సందర్భంగా కూనంనేని తెలిపారు.

**పొత్తు ధర్మం తప్పని నిబద్ధత గల నాయకుడు : ఎంపి బలరామ్ నాయక్**

పినపాక నియోజకవర్గ సిపిఐ నేత బొల్లోజు అయోధ్య పొత్తు ధర్మ తప్పని నిబంద్ధత గల నేతని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరామ్ నాయక్ అన్నారు. దేశరాజకీయ అవసరాల దృష్ట్యా రెండు జాతీయ పార్టీలు కలిసి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పనిచేసే నేతని చెప్పారు. రాష్ట్రంలో సిపిఐ తో కాంగ్రెస్ పార్టీ పొత్తుపెట్టుకున్న ప్రతి సందర్భంలోనూ నిస్వార్థంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆయన లేని లోటు కమ్యూనిస్టు పార్టీకి తీరనిదని, ఆయన చూపిన మార్గంలో ముందుతరం ముందుకు సాగాలని సూచించారు.

**నాకు రాజకీయ భిక్ష పెట్టింది అయోధ్యే : ఎమ్మెల్యే పాయం**

తాను సిపిఐలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానని, తనను భారత కమ్యూనిస్టు (సిపిఐ) పార్టీలోనికి తీసుకొచ్చి రాజకీయ భిక్ష పెట్టింది బొల్లోజు అయోధ్యేనని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సుదీర్ఘ కాలం పాటు రాజకీయాల్లో కొనసాగడానికి కారణం అయోధ్య నేర్పిన రాజకీయ క్రమశిక్షణే అని, ఆయన పేరు తలంపుకుంటూ పలుమార్లు కంటతడి పెట్టారు. పినపాక నియోజకవర్గంలో పేదలు, కార్మికులు, కర్షకులు మెచ్చిన, నచ్చిన మనిషి అయోధ్యని సిపిఐ జాతీయ సమితి సభ్యు లు భాగం హేమంతరావు అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య ఓ ఉద్యమ స్ఫూర్తి అని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సిపిఐ నాయకులు కమటం వెంకన్న, రేసు ఎల్లయ్య, ముర్వా వెంకటేశ్వరరావు, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరా వు, రావులపల్లి రవికుమార్, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీ కుమారి, ఉప్పుశెట్టి రాహుల్, కంచర్ల జమలయ్య, అనంతనేని సురేష్‌తో పాటు మండే వీరహనుమంతరావు, టిడిపి నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, వట్టం నారా ణ, సిపిఎం నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమో సీ నాయకులు కేతా నాగేశ్వరరావు, మాస్ లైన్ జిల్లా నాయకులు ఆర్ మధు సూధన రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కొల్లెటి భవాని శంకర్, పోశం భాస్కర్, జక్కుల రాంబాబు, సుధాకర్, రామ్‌గోపాల్, రమేష్, టిఎన్‌టియూసి నాయకులు పోటు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com